https://prajapratibha.com
RNI : APTEL 2013/54721

# ప్రజా ప్రతిభ

ప్రతి అక్షరం ప్రజా పక్షం
తెలుగు దినపత్రిక

సంపుటి 13 | సంచిక 197 | prajapratibha.2013@gmail.com | ఎడిటర్ : దానూరి శ్రీనివాస్ | 9441500341 | వెల రూ. 5.00 | పేజీలు 15

ఆంధ్రప్రదేశ్ | Published from Andhra Pradesh & Telangana | గురువారం, మార్చి 26, 2026

కాంగ్రెస్ పార్టీ కార్యాలయం
## ఖాళీ చేయండి
అక్బర్ రోడ్డు కార్యాలయం ఖాళీకి నోటీసులు 02





### ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్‌తో
## ఏపీ పర్యాటక శాఖ ఎంఓయూ

**అమరావతి, మార్చి25 (ప్రజా ప్రతిభ):** ఆంధ్రప్రదేశ్‌ను కలినరీ టూరిజం హబ్ గా తీర్చిదిద్దే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ తిరుపతిలోని ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్ తో అవగాహనా ఒప్పందం చేసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమక్షంలో ఈ కీలకమైన ఎంఓయూ కుదిరింది. ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్ ప్రతినిధులు–ఏపీ పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్‌లు ముఖ్యమంత్రి సమక్షంలో ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు.

తెలుగు రుచులను, వంటకాలను ప్రపంచానికి పరిచయం చేయటంతో పాటు ప్రాంతీయ ఆహార సంస్కృతిని చాటి చెప్పేలా ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్ సహకారం అందించనుంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్‌ను కలినరీ టూరిజానికి ఓ కీలకమైన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు వీలుగా ఈ ఎంఓయూ తోడ్పడనుంది.

ప్రత్యేకించి కలినరీ విభాగంలో నైపుణ్యాభివృద్ధి కల్పన, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ నిర్వహించే ఫుడ్ ఫెస్టివల్స్, టూరిజం ఈవెంట్లను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా తెలుగు వంటకాల రుచులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలియచేసేలా కార్యాచరణ చేపట్టనున్నారు. ఈ అవగాహనా ఒప్పందం కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, ఏపీ హోటల్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



### చంద్రబాబుకు
## భయపడొద్దు..

ఆ రోజులు పోయాయి: వైయస్ జగన్

అద్దంకి నియోజకవర్గ వైసీపీ నేతలతో జగన్ సమావేశం

ప్రతి విషయంలో క్రెడిట్ చోరీ చేస్తున్నారని విమర్శ

మిట్టల్ స్టీల్ ప్లాంట్ మన హయాంలోనే రాష్ట్రానికి వచ్చిందని వ్యాఖ్య..



**ప్రకాశం జిల్లా ప్రతినిధి, మార్చి25 (ప్రజా ప్రతిభ):** వైసీపీ అధినేత జగన్ ప్రకాశం జిల్లా అద్దంకి నియోజకవర్గ పార్టీ నేతలతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వంపై, ముఖ్యంగా సీఎం చంద్రబాబుపై ఆయన నిప్పులు చెరిగారు. పాలనలో అంతా తనదే అన్నట్టుగా చంద్రబాబు వ్యవహరిస్తున్నారని, ప్రతి చిన్న విషయంలో 'క్రెడిట్ చోరీ' చేస్తున్నారని మండిపడ్డారు. ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ మన హయాంలోనే రాష్ట్రానికి వచ్చిందని, కానీ ఇప్పుడు తన వల్లే వచ్చినట్టుగా చంద్రబాబు 'బిల్డప్' ఇస్తున్నారని జగన్ ఎద్దేవా చేశారు. గూగుల్ విషయంలోనూ ఇదే జరిగిందని, మాటలు కోటలు దాటుతున్నా మిగతా 2లో..

### పాక్ లాగా భారత్ దళారీ దేశం కాదు

అఖిలపక్షంలో విదేశాంగ మంత్రి జైశంకర్



**న్యూఢిల్లీ, మార్చి25(ప్రజా ప్రతిభ):** పాకిస్థాన్‌ను 'దళారీ' దేశంగా కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ అభివర్ణించారు. పాకిస్థాన్‌లాగా భారతదేశం ఎప్పుడూ మధ్యవర్తిత్వం నెరపే దేశం, దళారీ దేశం కాదని అన్నారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలపై కేంద్రం నిర్వహించిన అఖిల పక్ష సమావేశంలో జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేసినట్టు సంబంధిత మిగతా 2లో..



### స్థిరంగానే భారత్
## ఇంధన భద్రత

మరిన్ని నౌకలు భారత్‌కు చేరుకునే అవకాశం 02

పశ్చిమాసియా పరిస్థితులపై అఖిలపక్షంలో ప్రభుత్వం వివరణ

సమస్య ఎదుర్కొనేందుకు ఉమ్మడిగా సాగాలని నిర్ణయం

### విద్యార్థులు వినూత్నంగా
## ఆలోచించాలి

భవిష్యత్‌పై స్పష్టత ఉండాల్సిందే

యువత స్వశక్తితో ఎదగడానికి ప్రయత్నించాలి

కుప్పం జాబ్ మేళాలో నారా భువనేశ్వరి



**చిత్తూరు, మార్చి25 (ప్రజా ప్రతిభ):** విద్యార్థులు వినూత్నంగా ఆలోచించాలని, భవిష్యత్తుపై స్పష్టత ఉండాలని సీఎం చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి సూచించారు. యువత స్వశక్తితో ఎదగాలన్న ఆమె.. కష్టాన్ని నమ్ముకోవాలని, తద్వారా ఎలాంటి లక్ష్యాన్నైనా సాధించవచ్చని చెప్పారు. కుప్పం నియోజకవర్గంలోని ఓ డిగ్రీ కాలేజీలో నిర్వహించిన మిగతా 2లో..

## అరటి రైతులను ఆదుకోండి

గిట్టుబాటు ధరలు కల్పించండి

అరటి గెలలను వేసుకుని రైతులతో ర్యాలీ

కడప కలెక్టరేట్ వద్ద ధర్నాకు యత్నం

వైఎస్ షర్మిల డిమాండ్





**కడప, మార్చి25 (ప్రజా ప్రతిభ):** అరటి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని వైఎస్ షర్మిల కోరారు. కోల్డ్ స్టోరేజీ సౌకర్యాల విషయంలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నానని తెలిపారు. ఎన్నికల ముందు ప్రచారం కోసం మాత్రమే పులివెందులలో అరటి ప్రాసెసింగ్ యూనిట్‌ను జగన్ ప్రారంభించారని విమర్శలు చేశారు. అరటి రైతుల సమస్యలపై కూడా షర్మిల స్పందించారు. పంట మిగతా 2లో..

### ఘనంగా ధూళిపాళ్ల నరేంద్ర
## కూతురు వివాహం

హాజరై ఆశీర్వదించిన సీఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డి



**గుంటూరు, మార్చి25 (ప్రజా ప్రతిభ):** గుంటూరు జిల్లా పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర చిన్న కుమార్తె వివాహానికి తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. గుంటూరులోని మిగతా 2లో..

## ఒంటిమిట్టలో హరిద్ర ఘటనం

పసుపు దంచే కార్యక్రమం ప్రారంభం



**కడప, మార్చి25 (ప్రజా ప్రతిభ):** కడప జిల్లా ఒంటిమిట్టలోని ప్రసిద్ధ ప్రాచీన ఆలయం శ్రీ కోదండ రామస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం పవిత్రమైన హరిద్ర ఘటనం కార్యక్రమంతో ప్రారంభమయ్యాయి. పసుపు దంచే కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 1న శ్రీ సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించాలని తితిదే అధికారులు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో మిగతా 2లో..

## ఐదు టవర్లుగా సెక్రటేరియట్ ఐకానిక్ టవర్



వేగంగా ఐదు టవర్ల నిర్మాణం పనులు

పనులను పరిశీలించిన మంత్రి నారాయణ

**అమరావతి, మార్చి25 (ప్రజా ప్రతిభ):** రాజధాని అమరావతిలో రాష్ట్ర స్థాయి అధికారులంతా ఒకేచోట ఉండేలా సెక్రటేరియట్‌కు ఐకానిక్ టవర్లు డిజైన్ చేశామని మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ వెల్లడించారు. ఈ ఐదు టవర్ల నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ఆయన వివరించారు. అత్యాధునిక డయాగ్రిడ్ టెక్నాలజీతో మిగతా 2లో..



### ఇరాన్‌పై యుద్ధం
## గెలిచాం

ఇరాను సైనికంగా అంతమొందించాం

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన

**వాషింగ్టన్, మార్చి25 (ప్రజా ప్రతిభ):** ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధంలో తాము గెలిచామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రటించుకున్నారు. ఈ పోరులో ఇరాన్‌ను సైనికపరంగా అంతమొందించామని ఆయన అన్నారు. ఆ దేశం ఇకపై ఎప్పటికీ అణ్వాయుధాలను అభివృద్ధి చేయకూడదనేదే తమ మొదటి షరతు అని.. దానికి ఇరాన్ మిగతా 2లో..

## దేశంలో పెట్రో కొరత లేదు

ఇంధన ధరల్లో కూడా మార్పులు లేవు

దేశవ్యాప్తంగా పైపులైన్ల విస్తరణ, నేచురల్ గ్యాస్ సరఫరా

బ్లాక్ మార్కెటింగ్‌పై దాడులు కొనసాగిస్తున్నాం

పైప్డ్ గ్యాస్ అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో దానికే ప్రాధాన్యం

ఆందోళనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మరోమారు ప్రకటన



**న్యూఢిల్లీ, మార్చి25 (ప్రజా ప్రతిభ):** పైపులతో నేచురల్ గ్యాస్ కు తాము ప్రాధాన్యం ఇస్తున్నామని, పెట్రోల్, డీజిల్‌కు దేశంలో ఎలాంటి కొరత లేదని, ఇంధనం ధరల్లో కూడా మార్పు లేదని పెట్రోలియం మంత్రిత్వ శాఖ బుధవారంనాడు ప్రకటించింది. వదంతులు నమ్మవద్దని కోరింది. గృహావసరాల కోసం వందశాతం పీఎన్‌జీ సరఫరాకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని పెట్రోలియం శాఖ సంయుక్త కార్యదర్శి సుజాతా శర్మ తెలిపారు. ఈ మేరకు నోటీఫికేషన్ ఇచ్చామని, నిర్దిష్ట కాలపరిమితి లోపు దేశవ్యాప్తంగా పైపులైన్ల విస్తరణ, నేచురల్ గ్యాస్ మౌలిక వసతుల అభివృద్ధి జరగనుందని చెప్పారు. పశ్చిమాసియాలో ఘర్షణల మిగతా 2లో..

# అరటి రైతులను ఆదుకోండి






(మొదటిపేజీ తరువాయి)

నష్టపోయిన అరటి రైతులను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కడపకు వచ్చిన వైఎస్ షర్మిల రెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి వ్యానులో అరటి గెలలు వేసుకొని ర్యాలీగా కడప కలెక్టరేట్ కు చేరుకున్నారు. పంట నష్టపోయిన అరటి రైతులను తక్షణం ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ జిల్లా జాయింట్ కలెక్టర్ నిధి మీనాకు వినతిపత్రం అందజేశారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైఎస్ షర్మిల రెడ్డి మాట్లాడారు. నిన్న పులివెందుల నియోజకవర్గం సింహాద్రిపురం మండలంలోని కసునూరు గ్రామంలో వడగండ్ల వర్షానికి దెబ్బతిన్న అరటి తోటలను పరిశీలించి, రైతులతో మాట్లాడి వారి కష్టాలను అడిగి తెలుసుకున్నానన్నారు. రైతులు తమ దఅష్టికి తెచ్చిన సమస్యలను జిల్లా జాయింట్ కలెక్టర్ వివరించడం జరిగిందన్నారు. అకాల వర్షానికి అరటి తోటలు పూర్తిగా దెబ్బతిని రైతులు పూర్తిగా నష్టపోయారన్నారు. మన రాష్ట్రంలో అరటి 70 నుంచి 80 లక్షల వరకు పండిస్తున్నారని తెలిపారు. 58 శాతం రాయలసీమ నుండి అరటి పండుతోందని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర లేక కొట్టుమిట్టాడుతున్నారన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. టన్ను 26 వేల రూపాయలు పలికిన అరటి ఈరోజు 6 వేల రూపాయల కన్నా తక్కువగా పడిపోయిందన్నారు. దేశంలోనే మన రాష్ట్రంలో బెస్ట్ క్వాలిటీ అరటి పంట సాగు అవుతుందని, ఇతర దేశాలకు ఎక్స్పోర్ట్ చేసుకుంటారన్న నమ్మకంతో రైతులు అరటి పంటను పండించారన్నారు. ప్రస్తుతం రేటు పడిపోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు వాపోతున్నారన్నారు. రైతులు పండించిన పంటను గిట్టుబాటు ధర వచ్చేంతవరకు నిల్వ చేసుకునేందుకు కోల్డ్ స్టోరేజీలు లేక ప్రాసెసింగ్ ప్లాంట్ లు లేక తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కోల్డ్ స్టోరేజీలు, ప్రాసెసింగ్ ప్లాంట్లు ఏర్పాటు చేయడంతోపాటు మార్కెటింగ్ సపోర్ట్ కల్పించాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అరటికి కనీస గిట్టుబాటు ధర 12 వేల రూపాయలు కల్పించాలన్నారు. ధరల స్థిరీకరణ నిధులను రైతుల మేలు కోసం ఉపయోగించాలన్నారు. వైసిపి అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి తమ టార్గెట్ కానే కాదని వైయస్ షర్మిలారెడ్డి అన్నారు. పులివెందుల అరటి రైతులతో కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి సొంత నియోజకవర్గమైన పులివెందులలో ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కూడా కోల్డ్ స్టోరేజ్, ప్రాసెసింగ్ ప్లాంట్ పూర్తిగా ఏర్పాటు చేయలేకపోయారని విమర్శించారు. 2023లో పులివెందులలో ప్రాసెసింగ్ ప్లాంట్ ప్రారంభించాలని చెప్పుకుంటున్నారన్నారు. ఆయన చెప్పిన మాటల్లో నిజం లేదన్నారు. అసలు నిజం ఏమిటంటే 2024 మార్చి 11న ఎన్నికల కోడ్ వచ్చే ముందు ప్రాసెసింగ్ ప్లాంట్ పనులు పూర్తిగా కాకపోయినా జగన్మోహన్ రెడ్డి ప్రారంభించారన్నారు. ఏదైనా చెప్పితే అందులో నిజం ఉండాలన్నారు. కుటుంబ వ్యవహారాలు, ఆస్తులకు సంబంధించిన విషయం గురించి మా తల్లి విజయమ్మ ఎవరు మాట్లాడకండి అని చెప్పినా కూడా వైసిపి మాట్లాడుతుందని మండిపడ్డారు. జగన్మోహన్ రెడ్డి తమ టార్గెట్ కానే కాదని, మీరు మమ్మును టార్గెట్ చేస్తూ మాట్లాడితే మేము టార్గెట్ చేస్తామని సవాలు చేశారు. వైసీపీ జోలికి వెళ్లాల్సిన అవసరం తనకు లేదనివెల్లడించారు. కానీ తనపై విమర్శలు చేస్తే తాను కూడా స్పందించాల్సి వస్తుందని తెలిపారు. తన లక్ష్యం వైఎస్ జగన్మోహన్ రెడ్డి కాదని, అయితే వైసీపీ నేతల వ్యాఖ్యల వల్ల తరచూ వివరణ ఇవ్వాల్సి వస్తోందని అన్నారు. తాను ఎవరినీ కుక్కలతో పోల్చలేదని షర్మిల స్పష్టం చేశారు. విజయమ్మ లేఖ వచ్చిన తరువాత కూడా తమపై విమర్శలు కొనసాగుతుండటంతోనే మొరగడం కుక్కల నైజం అన్నానని వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎన్. డి. విజయ జ్యోతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటాన్ మహమ్మద్ అలీ ఖాన్, నియోజకవర్గ ఇన్చార్జ్ లు ధ్రువ కుమార్ రెడ్డి, ఇర్ఫాన్, శివ మోహన్ రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు విజరు సుశీల్ కుమార్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు మాయాన అర్షమతుల్లా ఖాన్, నగర అధ్యక్షులు సయ్యద్ గౌస్ పీర్, ఎన్ఎస్ యుఐ జిల్లా అధ్యక్షులు మామిళ్ళ బాబు, పాలగిరి శివ, పార్టీ నాయకులు పాల్గన్నారు.

## కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఖాళీ చేయండి

### అక్బర్ రోడ్డు కార్యాలయం ఖాళీకి నోటీసులు



**న్యూఢిల్లీ, మార్చి25 (ప్రజా ప్రతిభ):** దేశ రాజధానిలోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయానికి అధికారులు నోటీసు అందించారు. ల్యుటియన్స్ జోన్ ఖాళీ చేయాలని అక్బర్ రోడ్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయానికి ఎగ్జిట్ నోటీసు ఇచ్చారు. అలాగే 5వ నెంబర్ రైసినా రోడ్‌లోని యూత్ కాంగ్రెస్ ఆఫీస్‌ని కూడా ఖాళీ చేయాలని ఆదేశించారు. మార్చి 28లోపు రెండు ప్రాంగణాలను ఖాళీ చేయాలని డెడ్‌లైన్ విధించారు అధికారులు. 1978 నుంచి అంటే దాదాపు 48 ఏళ్ల నుంచి అక్బర్ రోడ్‌లోని ప్రధాన కార్యాలయం కేంద్రంగా పార్టీ కార్యకలాపాలను కాంగ్రెస్ నిర్వహిస్తోంది. అయితే, బలవంతపు తొలగింపును అడ్డుకునేందుకు న్యాయపరమైన మార్గాలను పరిశీంచి కోర్టును ఆశ్రయించనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. మరోవైపు, గతేడాది కోట్లా మార్గ్‌లో తమ కొత్త ప్రధాన కార్యాలయం ఇందిరా భవన్‌ను కాంగ్రెస్ పార్టీ ప్రారంభించింది.

అయినప్పటికీ అక్బర్ రోడ్ ప్రాంగణాన్ని ఇంకా ఖాళీ చేయలేదు. పార్టీ కార్యకలాపాలు అక్కడే కొనసాగుతున్నాయి. అక్బర్ రోడ్ కార్యాలయంతో తమకు ఎంతో భావోద్వేగ బంధం ఉందని పలువురు పార్టీ సీనియర్లు చెబుతున్నారు. ఈ భవనానికి చరిత్రలో అత్యంత ప్రాముఖ్యత ఉంది. ఒకప్పుడు బ్రిటిష్ పాలనలో వైస్రాయ్ లార్డ్ లిన్లిత్‌గో కార్యనిర్వాహక మండలి సభ్యుడైన సర్ రెజినాల్డ్ మాక్స్‌వెల్ ఇక్కడే నివసించారు. 1960ల ప్రారంభంలో భారతదేశంలో మయన్మార్ రాయబారి అయిన డా.ఖిన్ కీ నివాసంగా ఉండేది. ఆ తర్వాత నోబెల్ శాంతి బహుమతిని గెలుచుకున్న డా.ఖిన్ కీ కుమార్తె ఆంగ్ సాన్ సూకీ చాలా సంవత్సరాలు అక్కడే నివాసం ఉన్నారు. 1977 ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర పరాజయం చెందింది. దీంతో పార్టీ చీలిపోయే పలిస్థితులు వచ్చాయి. ఇందిరాగాంధీ వర్గానికి పార్టీ కార్యకలాపాలు నిర్వహించేందుకు ఓ భవనం కావాల్సి వచ్చింది. ఇందిరా గాంధీకి విధేయుడైన అప్పటి రాజ్యసభ ఎంపీ జి.వెంకటస్వామి అక్బర్ రోడ్‌లోని తన బంగ్లాను ఇచ్చారు. ఇక, అప్పటి నుంచి కాంగ్రెస్ తరఫున ప్రధానమంత్రులైన రాజీవ్ గాంధీ, పి.వి.నరసింహారావు, మన్మోహన్ సింగ్ సహా అందరూ దీన్ని ప్రధాన కార్యాలయంగా కొనసాగించారు.

## పాక్ లాగా భారత్ దళారీ దేశం కాదు

(మొదటిపేజీ తరువాయి)

వర్గాలు తెలిపాయి. పశ్చిమాసియాలో యుద్దానికి ముగింపు పలికేలా వాషింగ్టన్–టెహ్రాన్‌తో మధ్యవర్తిత్వం వహించేందుకు పాక్ ముందుకు రావడంపై అఖిలపక్ష సమావేశంలో ప్రస్తావనకు వచ్చినట్టు చెబుతున్నారు. దీనిపై జైశంకర్ స్పందిస్తూ, పాకిస్థాన్ దళారీ దేశమని అన్నారు. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయాల్లో భారత్ దళారీ దేశంగా వ్యవహరించదని చెప్పారు. ఇరాన్, అమెరికా–ఇజ్రాయెల్ మధ్య యుద్ధం నాలుగో వారానికి చేరుకోవడంతో మధ్యవర్తిత్వం వహించడానికి పాక్ ఉత్సాహం కనబరుస్తోంది. చర్చలకు ఆతిథ్యం ఇచ్చేందుకు తాము సిద్ధమని పాక్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో భారత్ ఎందుకు మౌనంగా ఉందని విపక్షాలు ప్రశ్నించినప్పుడు, భారత్‌కు ప్రత్యేక గౌరవం ఉందని, ఎన్నడూ దళారీ దేశంగా వ్యవహరించదని జైశంకర్ వ్యాఖ్యానించారు.

## స్థిరంగానే భారత్ ఇంధన భద్రత

### మరిన్ని నౌకలు భారత్‌కు చేరుకునే అవకాశం

### పశ్చిమాసియా పరిస్థితులపై అఖిలపక్షంలో ప్రభుత్వం వివరణ

### సమస్య ఎదుర్కొనేందుకు ఉమ్మడిగా సాగాలని నిర్ణయం

**న్యూఢిల్లీ,మార్చి25(ప్రజా ప్రతిభ):** భారతదేశ ఇంధన భద్రత స్థిరంగా ఉందని, అదనపు సరకుతో నౌకలు వస్తున్నాయని కేంద్ర అన్ని రాజకీయ పార్టీలకు భరోసా ఇచ్చింది. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన బుధవారం సాయంత్రం పార్లమెంటు భవనంలో అఖిల పక్ష సమావేశం జరిగింది. ఒక గంటా 45 నిమిషాల పాటు జరిగిన ఈ సమావేశంలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పురి, విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి, కాంగ్రెస్ నేతలు ముకుల్ వాస్నిక్, తారిఖ్ అన్వర్, సమాజ్‌వాదీ పార్టీ నేతలు ధర్మేంద్ర యాదవ్,జావెద్ అలీ, సీపీఎం నేత జాన్ బ్రిట్టాస్, ఎల్‌జేపీ నేత అరుణ్ భారతి, డీఎంకే నేత పి.విల్సన్, ఆప్ ఎం సంజయ్ సింగ్, జేడీయూ నేత రాజీవ్ సింగ్, సంజయ్ ఝా తదితరులు పాల్గొన్నారు. టీఎంసీ నుంచి ఎవరూ హాజరుకాలేదు. అఖిలపక్ష సమావేశానంతరం కిరణ్ రిజిజు మాట్లాడుతూ, సమావేశంలో అన్ని పార్టీలు చురుకుగా పాల్గొన్నాయని, ఇరాన్, ఇజ్రాయెల్–అమెరికా మధ్య జరుగుతున్న యుద్ధం, భారత్‌పై దాని ప్రభావంపై సమావేశంలో ఆందోళన వ్యక్తం చేశాయని తెలిపారు. ప్రభుత్వం సమగ్రంగా, సంపూర్ణంగా స్పందించిందని, విపక్షాలందరి ప్రశ్నలన్నింటికీ సంతృప్తికరంగా సమాధానాలి చ్చిందని చెప్పారు. ప్రస్తుత పరిస్థితిని సమర్ధవంతగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వానికి మద్దతుగా నిలబడతామని విపక్ష పార్టీలు హామీనిచ్చాయని చెప్పారు. 'ప్రస్తుత సంక్షోభ సమయంలో పరిస్థితికి అనుగుణంగా ప్రభుత్వం తీసుకునే చర్యలకు సమష్టిగా మద్దతు ఇస్తామని విపక్షాలు తెలిపాయి' అని రిజిజు వివరించారు. కాగా, దేశంలో ఇంధన భద్రత స్థిరంగా, దేశ ఇంధన అవసరాలకు సరిపడా ఉందని అఖిలపక్ష సమావేశంలో ప్రభుత్వం పేర్కొన్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. సరకు కోసం అడ్వాన్స్ బుకింగ్ చేసుకోవడంతో పాటు వివిధ దేశాలతో సంప్రదింపులు సాగిస్తున్నామని, నిరంతరాయ ఇంధన సరఫరాకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని ప్రభుత్వం హామీ ఇచ్చినట్టు పేర్కొన్నాయి. ఎల్‌జీపీ లభ్యత, హోర్ముజ్ జలసంధి మీదుగా షిప్‌మెంట్‌పై సమావేశంలో విపక్షాల ఆందోళన వ్యక్తం చేశాయి. అయితే పరిస్థితి అదుపులోనే ఉందని, మరో నాలుగైదు రోజుల్లో నాలుగు నౌకలు పోర్టుకు చేరుకుంటాయని ప్రభుత్వం తెలిపింది. ఎలాంటి ఇంధన కొరత లేదని, తగినన్ని నిల్వలు ఉన్నాయని వివరించింది. అఖిలపక్షానికి హాజరైన అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటామని, విపక్షాలతో ఏ సమయంలోనైనా చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపింది. దేశ ప్రజల ప్రయోజనాలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, విపక్షాలతో చర్చలకు తలుపులు తెరిచే ఉంటాయని రాజ్‌నాథ్ అఖిలపక్ష సమావేశంలో పేర్కొన్నారు. యుద్ధంతో తలెత్తిన పరిణామాలు, ఇంధన భద్రతపై ఆందోళనలు, ప్రపంచ వ్యాప్తంగా ఎదురవుతున్న సవాళ్లను విదేశాంగ కార్యదర్శి మిస్రీ అఖిల పక్ష నేతలకు వివరించారు. మొత్తం మీద.. పరిస్థితులు అదుపులోనే ఉన్నాయని, దేశీయంగా ప్రజల ఆందోళనలకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందనే సందేశాన్ని అఖిలపక్ష సమావేశం ఇచ్చింది.

## ఇరాన్‌పై యుద్ధం గెలిచాం

(మొదటిపేజీ తరువాయి)




అంగీకరించిందని కూడా ట్రంప్ పేర్కొన్నారు. 'ఇరాన్‌తో ప్రస్తుతం చర్చలు కొనసాగుతున్నాయి. అమెరికాతో ఒప్పందం కుదుర్చుకునేందుకు ఆ దేశం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ఇప్పటికే వారి నౌకాదళం, వైమానిక దళం పూర్తిగా ధ్వంసమవడం సహా రాడార్ వ్యవస్థలు కూడా దెబ్బతిన్నాయి. అమెరికా విమానాలు టెహ్రాన్ మీదుగా చక్కర్లు కొడుతున్నాయి. ఒకవేళ చర్చలు విఫలమైతే.. అమెరికా ఏదైనా చేయగలదు' అని ట్రంప్ చెప్పారు. మరోవైపు ఇరాన్.. అమెరికాకు హోర్ముజ్ జలసంధికి సంబంధించి ఓ పెద్ద గిఫ్ట్ ఇచ్చిందని ట్రంప్ తెలిపారు. అయితే.. ఆ బహుమతి ఏంటనే వివరాలను మాత్రం ఆయన వెల్లడించలేదు. అది చాలా విలువైన గిఫ్ట్ అని చెప్పుకొచ్చారు. అయితే.. ట్రంప్ వ్యాఖ్యాలను పూర్తిగా తోసిపుచ్చింది ఇరాన్. అమెరికాతో ఇప్పటివరకు ఎలాంటి ప్రత్యక్ష చర్చలు జరగలేదని ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇదిలా ఉండగా.. పాకిస్థాన్, ఈజిప్ట్, టర్కీ వంటి దేశాలతో కలిసి ఇరాన్.. అమెరికాతో మధ్య మధ్యవర్తిత్వం వహించేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు పాక్ సైన్యాధిపతి అసిమ్ మునీర్ ఇటీవల అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్‌తో మాట్లాడినట్టు పాక్ మీడియా సంస్థలు వెల్లడించినట్టు సమాచారం. మరోవైపు.. సౌదీ అరేబియా యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్.. ఇరాన్‌పై దాడులను కొనసాగించాలని ట్రంప్‌ను కోరినట్టు న్యూయార్క్ టైమ్స్ తన కథనంలో రాసుకొచ్చింది. యుద్ధానికి ట్రంప్ 5 రోజుల విరామం ప్రకటించినప్పటికీ.. గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు కొనసాగుతున్నాయి. సౌదీ అరేబియా బాలిస్టిక్ క్షిపణి ఇరాన్‌కు చెందిన 6 డ్రోన్‌లను కూల్చివేసింది. తూర్పు ప్రావిన్సులో తమ వాయు రక్షణ వ్యవస్థ ఒక బాలిస్టిక్ క్షిపణిని అడ్డుకుని ధ్వంసం చేసిందని సౌదీ రక్షణ శాఖ తెలిపింది. ఆ వివరాల ప్రకారం.. అదే ప్రాంతంలో కనీసం 6 డ్రోన్‌లను కూల్చివేసినట్టు సమాచారం. ఇజ్రాయెల్, కువైట్ దేశాలపైనా ఇరాన్ డ్రోన్ల దాడి కొనసాగిస్తున్నట్టు అంతర్జాతీయ మీడియా కథనాల ద్వారా తెలుస్తోంది.

## ఘనంగా ధూళిపాళ్ల నరేంద్ర కూతురు వివాహం

(మొదటిపేజీ తరువాయి)

శ్రీకన్వెన్షన్‌లో నాగసాయి వైదీప్తి- కెవిన్ రామ్ వివాహం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి సీఎంలు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వారితో పాటు ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, మంత్రులు నారా లోకేశ్, పయ్యావుల కేశవ్, అనిత, సంధ్యారాణి, సవిత, పలువురు ఎమ్మెల్యేలు హాజరై నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

## చంద్రబాబుకు భయపడొద్దు..

(మొదటిపేజీ తరువాయి)

చేతల్లో ఏమీ లేదని విమర్శించారు. రాబోయే రోజుల్లో పార్టీని సరికొత్తగా తీర్చిదిద్దుతామని, 'జగన్ 2.0'లో కార్యకర్తలకు అత్యంత ప్రాధాన్యత ఉంటుందని హామీ ఇచ్చారు. నేతలెవరూ చంద్రబాబును చూసి భయపడాల్సిన అవసరం లేదని, ఆ రోజులు పోయాయని ధైర్యం చెప్పారు.

నియోజకవర్గాల పునర్విభజన జరగబోతుండటం పార్టీకి మంచి పరిణామమని జగన్ అభిప్రాయపడ్డారు. దీనివల్ల మహిళా రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయని, గతంలో తాము పదవులు, కాంట్రాక్టుల్లో మహిళలకు ప్రాధాన్యత ఇచ్చామని, ఇప్పుడు చట్టసభల్లో కూడా మన మహిళలకు మరిన్ని అవకాశాలు వస్తాయని పేర్కొన్నారు.

## విద్యార్థులు వినూత్నంగా ఆలోచించాలి

(మొదటిపేజీ తరువాయి)

జాబ్‌మేళాలో సీఎం చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి పాల్గొన్నారు. యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు జాబ్‌మేళా నిర్వహించడం అభినందనీయమని ఈ సందర్భంగా ఆమె అన్నారు. 'నాడు విజన్ 2020.. నేడు విజన్ 2047. ఈ లక్ష్యంతో సీఎం చంద్రబాబు పనిచేస్తున్నారు. ఒక నాయకుడిని నమ్మి ఓటేస్తే ఏం జరిగిందో గత ఐదేళ్లలో మనం చూశాం. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాట తప్పరు. ఓట్ల కోసం హామీలు ఇవ్వరు. ప్రజల కోసం నిలబడతారు. నేను ఏమి చేయగలనో అదే హామీ ఇస్తానని చంద్రబాబు నాతో ఎల్లప్పుడూ చెబుతూ ఉంటారు. ప్రజలకు ఇచ్చినమాట ప్రకారం రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు తీసుకొస్తున్నారు. 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నారు' అని భువనేశ్వరి పేర్కొన్నారు. ఇక తాను గృహిణిగా ఉంటూనే హెరిటేజ్ బాధ్యతలను సవాల్‌గా స్వీకరించానని భువనేశ్వరి చెప్పుకొచ్చారు.

## ఒంటిమిట్టలో హరిద్ర ఘటనం

(మొదటిపేజీ తరువాయి)

రాములోరి కల్యాణానికి మంగళవారం హరిద్రా ఘటనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం బ్రహ్మోత్సవాలు మరియు శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాలకు శ్రీకారం చుట్టే తొలి ఆచారంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు, శ్రీవారి సేవకులు, టీటీడీ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని పసుపు కొమ్ములను దంచే పవిత్ర కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. హరిద్ర ఘటనంలో సిద్ధం చేసిన తాజా పసుపును స్వామివారికి నిర్వహించే స్నపన తిరుమంజనం కార్యక్రమంలో ఉపయోగిస్తారు. అలాగే శ్రీ సీతారాముల కల్యాణోత్సవానికి అవసరమైన తలంబ్రాలు సిద్ధం చేయడానికి కూడా దీనిని వినియోగిస్తారు. ముందుగా పసుపు కొమ్ములు ఇతర పరికరాలను గర్భాలయంలో ప్రతిష్టించి పూజలు నిర్వహించారు. అనంతరం మహాలక్ష్మి ఆరాధన చేశారు. శ్రీ సూక్తం పఠనానంతరం హరిద్ర ఘటనం నిర్వహించారు. పసుపు నూరిన తరువాత సమర్పణ చేసి తాంబూలం అందజేయడంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

## ఐదు టవర్లుగా సెక్రెటేరియట్

# ఐకానిక్ టవర్

(మొదటిపేజీ తరువాయి)



వీటి నిర్మాణం జరుగుతోందన్నారు. బుధ వారం రాజధానిలో నిర్మిస్తున్న హెచ్ఓడీ టవర్ -3 కార్నర్ నోడ్ అమర్చే పనులకు మంత్రి నారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. గత ఏడాది వర్షాలు అధికంగా కురవడంతో 4 నెలల పాటు ఈ పనులకు ఆటంకం కలిగిందని పేర్కొన్నారు. ఐకానిక్ భవనాలు, ప్రజాప్రతినిధులు, అధికారుల నివాసాలు, మౌలిక వసతుల పనులు వేగంగా జరుగుతున్నాయని మంత్రి నారాయణ వివరించారు. అమరావతి నిర్మాణానికి సీఎం చంద్రబాబు నాయుడు ప్రత్యేక ఫైనాన్స్ మోడల్ ఇచ్చారని చెప్పారు. ప్రజలు చెల్లించే పన్నుల నుంచి ఒక్క రూపాయి కూడా రాజధాని అమరావతికి ఖర్చు పెట్టడం లేదని పేర్కొన్నారు. అమరావతి సెల్ఫ్ ÷నాన్స్ సిటీ అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కానీ కొంతమంది అమరావతిపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అమరావతిలో సోమవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంపై సీఎం చంద్రబాబు సమీక్షించారన్నారు. ప్రస్తుతం ఈ ప్రమాద ఘటనపై విచారణ జరుగుతోందని తెలిపారు. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా ఈ పని చేస్తే.. ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏజీఐసీఎల్ ఎండీ శ్రీనివాస్‌తో పాటు ఇంజనీర్లు పాల్గొన్నారు.

# దేశంలో పెట్రో కొరత లేదు

(మొదటిపేజీ తరువాయి)



నేపథ్యంలో ఎల్పీజీ, ఇంధనం కొరతపై ఆందోళనలను ప్రస్తావిస్తూ, ప్రజలు ఎలాంటి వదంతులు నమ్మవద్దని, ప్యానిక్ బైయింగ్‌కు పాల్పడవద్దని కోరారు. రిఫైనరీలు గరిష్ట సామర్థ్యంతో పనిచేస్తున్నాయని, ఏటా 26 కోట్ల టన్నుల రిఫైనరీ సామర్థ్యం మనకు ఉందని చెప్పారు. గత రెండు రోజులుగా రిటైల్ ఔట్‌లెట్‌లు, పెట్రోల్ బంకుల వద్ద పెద్దఎత్తున జనం క్యూలు కడుతుండటం తమ దృష్టికి వచ్చిందని, అయితే ఆందోళన అవసరం లేదని, దేశంలో తగినన్ని పెట్రోల్, డీజిల్ నిల్వలు ఉన్నాయని చెప్పారు. పెట్రోల్, డిజిల్ ధరలు కూడా పెరగబోవడం లేదని వివరించారు. వలస కార్మికులకు ప్రాధాన్యతా క్రమంలో 5 కిలోల సిలెండర్లు అందిస్తామని సుజాతా శర్మ తెలిపారు. 26 రాష్ట్రాలకు 22,000 టన్నుల ఎల్పీజీ కేటాయించామన్నారు. మంగళవారంనాడు 30,000 ఐదు కేజీల సిలెండర్లు ఇచ్చామని చెప్పారు. బ్లాక్‌మార్కెటింగ్, అక్రమ నిల్వలకు కళ్లెం వేసేందుకు 2,700 దాడులు జరిపామని, 2,000 సిలెండర్లు స్వాధీనం చేసుకున్నామని అన్నారు. గ్యాస్ రీఫిల్ బుకింగ్ గడువు పెంపుపై వస్తున్న వార్తలు నిజం కాదనీ, గ్యాస్ బుకింగ్ సమయాల్లో ఎలాంటి మార్పులూ లేవనీ సుజాత శర్మ వివరించారు. కనెక్షన్‌తో సంబంధం లేకుండా పట్టణ ప్రాంతాల్లో రీఫిల్ బుకింగ్‌కు 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల గడువు ఎప్పటిలాగానే కొనసాగుతుందని సుజాత శర్మ స్పష్టం చేశారు. ఇదిలావుంటే పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో ఎల్పీజీ కొరతను అధిగమించడం సహా గ్యాస్ పంపిణీ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకువచ్చే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పైప్డ్ న్యాచురల్ గ్యాస్(పీఎన్‌జీ) సరఫరా అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో వెంటనే దానికి మారాలని ఆయా వినియోగదారులకు సూచించింది. లేనిపక్షంలో లిక్విడ్ పెట్రోలియం గ్యాస్(ఎల్‌పీజీ) సరఫరాను నిలిపివేస్తామని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ ఉత్తర్వులిచ్చింది. దేశంలో పీఎన్‌జీని ప్రోత్సహించే దిశగా ముందడుగు వేస్తున్న కేంద్రం.. ఈ మేరకు 3 నెలల గడువు నిర్దేశిస్తూ ఆదేశాలు జారీచేసింది. పీఎన్‌జీ సౌకర్యం అందుబాటులో ఉన్న ప్రాంతాల్లోని ఎల్‌పీజీ సిలిండర్లను మౌలిక సదుపాయాలు లేని ఏరియాలకు మళ్లించడమే ఈ చర్య ప్రధాన ఉద్దేశమని కేంద్రం స్పష్టం చేసింది. పీఎన్‌జీకి మారడం వల్ల రీఫిల్ బుక్‌చేసే అవసరముండదు. దీంతోపాటు నిరంతర గ్యాస్ సరఫరా అందుబాటులో ఉంటుంది. అయితే.. పీఎన్‌జీ సరఫరాలో సాంకేతిక సమస్యలు, ఇంటికి పైప్‌లైన్ కనెక్షన్ ఇవ్వడం అసాధ్యమైన సందర్భంలో మాత్రమే ఎల్‌పీజీ సరఫరా కొనసాగుతుంది.కానీ.. దానికి పీఎన్‌జీ గ్యాస్ కంపెనీ నుంచి నిరభ్యంతర పత్రంతప్పనిసరి.

మేరకు పీఎన్‌జీ నిర్మాణాలను వేగవంతం చేసేందుకు పలు చర్యలు చేపట్టింది కేంద్రం. పైప్డ్ గ్యాస్ లైన్‌కు నిర్ణీత గడువులోగా అధికారులు అనుమతులు మంజూరు చేయాలి. నిర్దేశిరచిన ఫీజుకంటే ఎక్కువ వసూలు చేయకూడదు. హౌసింగ్ సొసైటీలు లేదా భూయజమానులు కూడా పైపులైన్ సరఫరాకు ఎలాంటి ఆటంకాలు కలిగించరాదు. అలాంటి సందర్భాలేమైనా తలెత్తితే ఆ ప్రాంతానికి ఎల్‌పీజీ సరఫరాను నిలిపివేయడం సహా సంబంధిత వ్యక్తులపై అధికారులు చర్యలు తీసుకునేందుకు వీలుంటుందని ఉత్తర్వుల్లో పేర్కొంది ప్రభుత్వం. వీటి అమలును పర్యవేక్షించడం సహా సమ్మతిని నిర్ధారించేందుకు పెట్రోలియం, సహజ వాయువు నియంత్రణ బోర్డ్ నోడల్ అథారిటీకి బాధ్యతలు అప్పగించింది.

## వైఎస్ జగన్‌ను కలిసిన వై.సి.పి రాష్ట్ర కార్యదర్శి పైల శ్రీనివాసరావు



**పరవాడ మార్చి 25 (ప్రజా ప్రతిభ):**

విజయవాడ తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మాడుగుల నియోజకవర్గ పరిశీలికులు పైల శ్రీనివాసరావు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు ఇటీవేల మాడుగుల నియోజకవర్గ పరిశీలికులు గా నియమించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పార్టీ పరిస్థితులు మాడుగుల నియోజకవర్గంలో జరుగుతున్న పార్టీ అభివృద్ధి కార్యక్రమాల నూతన కమిటీ లు పై చర్చించారు రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేయడంలో తన వంతు పాత్ర పోషిస్తానని పైల శ్రీనివాసరావు పేర్కొన్నారు పార్టీ కార్యకర్తలు నాయకులతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు మరింత చేరువ కావాలని వైఎస్ జగన్ సూచించారు.

## నవజీవన్ శ్రీ ఎల్.ఐ.సి ప్రీమియం సద్వినియోగం చేసుకోండి...




**వెంకటగిరి, మార్చి 25(ప్రజా ప్రతిభ ):**

జీవిత భద్రతతో పాటు భవిష్యత్ ఆర్థిక స్థిరత్వాన్ని లక్ష్యంగా పాలసీదారులు నవజీవన్ శ్రీ ఎల్.ఐ.సి సింగిల్ ప్రీమియం పాలసీను వినియోగించుకోవాలని వెంకటగిరి ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ భాస్కరరావు తెలిపారు. బుధవారం వెంకటగిరిలో నవజీవన్ శ్రీ పాలసీపై ప్రచారంలో భాగంగా ఆర్టీసీ బస్టాండ్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఈ పాలసీ ద్వారా కుటుంబానికి రక్షణతో పాటు ఆదాయం కూడా పొందే అవకాశముందని తెలిపారు.ఎల్ఐసి ఆధ్వర్యంలో అందిస్తున్న ఈ పథకం ద్వారా పాలసీదారులు తమ వెసులుబాటుకు అనుగుణంగా ప్రీమియంలను చెల్లించి, దీర్ఘకాలంలో మంచి లాభాలను పొందవచ్చని పేర్కొన్నారు. ముఖ్యంగా పిల్లలకు విద్య, వివాహం, పెద్దలకు రిటైర్మెంట్ వంటి అవసరాలకు ఈ పథకం ఉపయోగపడుతుందని చెప్పారు. ఇటీవలి కాలంలో ప్రజల్లో బీమా అవగాహన పెరుగుతున్న నేపథ్యంలో, సరైన ప్లానింగ్‌తో ప్రీమియంలను చెల్లించడం ద్వారా ఆర్థిక భద్రతను మరింత పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్.ఐ.సి డెవలప్మెంట్ అధికారులు,ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 1న ముఖ్య మంత్రి నెల్లూరు జిల్లా పర్యటన

- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు
- నాయుడు పర్యటనకు పక్కాగా ఏర్పాట్లు.
- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అధికారులను ఆదేశించారు





**నెల్లూరు బ్యూరో మార్చి 25(ప్రజా ప్రతిభ):**

బుధవారం వింజమూరులో సీఎం పర్యటన ఏర్పాట్లను ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. వింజమూరు బైపాస్ రోడ్ లో ఏర్పాటు చేస్తున్న హెలీపాడ్, వింజమూరు చెరువు ఆధునీకరణ, ప్రజా వేదిక ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి త్వరలో వింజమూరు పర్యటనకు రానున్న నేపథ్యంలో ఆయా శాఖ అధికారులకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు.కలెక్టర్ వెంట ఆర్డీఓ పావని, డిఆర్డిఏ, డ్వామా పీడీలు నాగరాజకుమారి, గంగా భవాని, విద్యుత్ శాఖ ఎస్ ఈ రాఘవేంద్రన్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

# ప్రజా సేవలోనే పుట్టినరోజు వేడుక

## - ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి



**శృంగవరపు కోట, మార్చి 25.(ప్రజా ప్రతిభ -ఎం.రమణ )**

వేపాడ: తన జన్మదినం నాడూ కూడా ప్రజా సమస్యల పరిష్కారమే పరమార్థంగా ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఆదర్శంగా నిలిచారు. విజయనగరం, అనకాపల్లి జిల్లాలను అనుసంధానిస్తూ గతంలో కూలిపోయిన కీలకమైన కల్వర్టు వల్ల వేపాడ, దేవరాపల్లి మండలాల ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన ఆమె, యుద్ధప్రాతిపదికన సుమారు రూ. 1 కోటి జీవీఎంసీ నిధులు మంజూరు చేయించారు. వేగంగా పూర్తి చేసిన ఈ కల్వర్టును బుధవారం మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తితో కలిసి ఆమె ప్రారంభించి జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా బండారు సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ.. పదవుల కంటే ప్రజా క్షేమమే ముఖ్యమని భావించే లలితకుమారి లాంటి నాయకులు ఉండటం గర్వకారణమని కొనియాడారు. అనంతరం ఈ రోజు ఆమె పుట్టినరోజు సందర్భంగా అక్కడే కేక్ కట్ చేసి కార్యకర్తలు, అభిమానుల మధ్య ఆమె పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు. తరువాత వేపాడ మండలంలోని బల్లంకి గ్రామస్తుల దశాబ్దాల కల నెరవేరుస్తూ రైవాడ కాల్వపై నూతనంగా నిర్మించిన వంతెనను ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ప్రారంభించారు. సుమారు రూ. 43.65 లక్షల వ్యయంతో 6 మీటర్ల వెంట్ సామర్థ్యంతో నిర్మించిన ఈ వంతెన ద్వారా స్థానిక రైతులు, ప్రజల రవాణా కష్టాలు తీరనున్నాయి. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ప్రజల సమస్యలను గుర్తించి త్వరితగతిన నిధులు మంజూరు చేయించి పనులు పూర్తి చేస్తున్నామని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జనసేన-టీడీపీ కూటమి నేతలు, కార్యకర్తలు మరియు పెద్ద ఎత్తున





స్థానిక ప్రజలు పాల్గొని ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వేపాడ మరియు దేవరాపల్లి కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్వర్ణ కుప్పం సాకారమే లక్ష్యం

- కుప్పానికి పరిశ్రమల రాకతో పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- 20 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా సీఎం చంద్రబాబు అడుగులు
- యువత స్వశక్తితో ఎదగాలి, కష్టాన్ని నమ్ముకుంటే ఏదైనా సాధించవచ్చు
- 2వ రోజు కుప్పం పర్యటనలో నారా భువనేశ్వరి







**కుప్పం, మార్చి 25(ప్రజా ప్రతిభ):**

స్వర్ణ కుప్పం లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి స్పష్టం చేశారు. కుప్పం నియోజకవర్గంలో నాలుగు రోజుల పర్యటనలో భాగంగా 2వ రోజు పలు గ్రామాల్లో నారా భువనేశ్వరి పర్యటించారు. కుప్పం డిగ్రీ కాలేజ్ లో నిర్వహించిన జాబ్ మేళాలో పాల్గొన్నారు. గుడిపల్లి మండలం పెద్ద కోటమకనపల్లి గ్రామంలో పర్యటించిన మహిళలతో సమావేశమయ్యారు.

**వినూత్న ఆలోచనలతోనే నూతన ఆవిష్కరణలు**

కుప్పం డిగ్రీ కాలేజీలో నిర్వహించిన జాబ్ మేళాలో నారా భువనేశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ...యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు జాబ్ మేళా నిర్వహించడం అభినందనీయం. విద్యార్థులు వినూత్నంగా ఆలోచించాలి. భవిష్యత్ పై స్పష్టత ఉండాలి. యువత స్వశక్తితో ఎదగాలి. కష్టాన్ని నమ్ముకోవాలి. లక్ష్యం ఉంటే ఏదైనా సాధించవచ్చు. నాడు విజన్ 2020, నేడు విజన్ 2047 లక్ష్యంతో సీఎం చంద్రబాబు పనిచేస్తున్నారు. ఒక నాయకుడిని నమ్మి ఓటేస్తే ఏం జరిగిందో గత ఐదేళ్లలో మనం చూశాం. ముఖ్యమంత్రి చంద్రబాబు గారు ఇచ్చిన మాట తప్పరు. ఓట్ల కోసం హామీలు ఇవ్వరు. ప్రజల కోసం నిలబడతారు. నేను ఏం చేయగలనో అదే హామీ ఇస్తానని చంద్రబాబు గారు నాతో చెబుతూ ఉంటారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు తీసుకొస్తున్నారు. 20 లక్షల ఉద్యోగ కల్పన లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నారు. గృహిణిగా ఉన్న నేను హెరిటేజ్ బాధ్యతలను సవాల్ గా తీసుకున్నాను. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలి. ప్రతి దానికీ అసంతృప్తికి లోను కాకూడదు. కష్టపడి పనిచేస్తే ఎన్నో అవకాశాలు వస్తాయి. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి పిల్లలను చదివిస్తారు. ప్రయోజకులు కావాలని , భవిష్యత్ బాగుండాలని తాపత్రయపడతారు. పిల్లలు జీవితంలో ఉన్నతంగా స్థిరపడితే ముందుగా సంతోషించేది తల్లిదండ్రులే. చంద్రబాబు గారు రాజకీయాల్లో బిజీగా ఉండటంతో నా కుమారుడు లోకేష్ పెంపకం, చదువు బాధ్యత నేనే చూసుకున్నాను. ఏది మంచి, ఏది చెడు అనేది చెప్పి పెంచానని నారా భువనేశ్వరి అన్నారు. జాబ్ మేళా సందర్భంగా పలు కంపెనీల ప్రతినిధులతో భువనేశ్వరి సమావేశమాయ్యారు.




**పరిశ్రమల రాకతో స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు**

గుడిపల్లి మండలం పెద్ద కోటమకనపల్లి గ్రామంలో పర్యటించిన నారా భువనేశ్వరి గారు మహిళలతో సమావేశమయ్యారు. మహిళలను ఉద్దేశించి మాట్లాడారు. చంద్రబాబు గారిని 8 సార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన కుప్పం ప్రజలకు రుణపడి ఉంటాం. ముఖ్యమంత్రి చంద్రబాబు గారు బిజీగా ఉండటంతో ప్రతి మూడు నెలలకు ఒకసారి నేను కుప్పం నియోజకవర్గంలో పర్యటిస్తున్నాను. ప్రజల సమస్యల పరిష్కారానికి నా వంతు కృషి చేస్తున్నాను.రాష్ట్రాన్ని బాగుచేయడం చంద్రబాబు గారి వల్లే సాధ్యమని ప్రజలు నమ్మి ఓటేశారు. కుప్పం నియోజకవర్గానికి రూ. 7,121 కోట్ల విలువైన పెట్టుబడులతో 17 పరిశ్రమలు తీసుకొచ్చారు. వీటి ద్వారా పెద్ద ఎత్తున ఉపాధి లభిస్తుంది. కుప్పంలో అడిడాస్ కంపెనీ ఫుట్ వేర్ తయారీ ప్లాంట్ ఏర్పాటు చేస్తోంది. కుప్పంలో సోలార్ ఎనర్జీ వినియోగం పెంచేందుకు చర్యలు చేపట్టారు. 20 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. కుప్పం డిగ్రీ కాలేజ్ లో జాబ్ మేళా సందర్భంగా 5 వేల ఉద్యోగాల కల్పనకు పలు కంపెనీలు ముందుకొచ్చాయి. నియోజకవర్గంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పథకం కింద 37, 824 మంది లబ్ధి పొందుతున్నారు. 42, 232 మందికి తల్లికి వందనం అందుతోంది. స్వచ్ఛ కుప్పంలో భాగంగా చెత్త నుంచి సంపద సృష్టించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో రహదారుల నిర్మాణం చేపట్టారు. స్వర్ణ కుప్పంలో భాగంగా సీసీ, బీటీ రోడ్లు వేస్తున్నారు. సంజీవని హెల్త్ క్లినిక్స్ ద్వారా పేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్నారు. కుప్పానికి హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలను తీసుకొచ్చారు. గతంలో కొందరు చంద్రబాబు గారిపై నిందలు మోపారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు గారిని అక్రమంగా అరెస్ట్ చేశారు. యావత్ రాష్ట్ర ప్రజలు చంద్రబాబు గారికి అండగా నిలబడ్డారు. మద్దతుగా మహిళలు పెద్ద ఎత్తున బయటకు వచ్చి పోరాడారని నారా భువనేశ్వరి అన్నారు. అంతకుముందు స్థానిక మహిళలతో కలిసి నారా భువనేశ్వరి కోలాటం ఆడారు.

# 1.4 నెలల పాప నోబెల్ బుక్ అఫ్ వరల్డ్ రికార్డ్

- ఇండియా బుక్ అఫ్ రికార్డ్,
- ఇంటర్నేషనల్ బుక్ అఫ్ వరల్డ్ రికార్డ్ సాధించిన సమయాల శ్రేష్టిత ఒలివియా.
- శ్రేష్టిత ఒలివియా ను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపి, తల్లితండ్రులను అభినందించిన ఎం ఎల్ ఎ డాక్టర్ పాశిం సునీల్ కుమార్.





నెల్లూరు బ్యూరో మార్చి 25(ప్రజా ప్రతిభ):

గూడూరు పట్టణం శాంతి నగర్ కు చెందిన 1.4 నెలల పాప నోబెల్ బుక్ అఫ్ వరల్డ్ రికార్డ్, ఇండియా బుక్ అఫ్ రికార్డ్, ఇంటర్నేషనల్ బుక్ అఫ్ వరల్డ్ రికార్డ్ సాధించిన సమయాల శ్రేష్టిత ఓలివియా ను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపి, తల్లితండ్రులను ఎం ఎల్ ఎ డాక్టర్ పాశిం సునీల్ కుమార్ అభినందించారు.గూడూరు పట్టణం 1వ వార్డు శాంతి నగర్ కు చెందిన సమయాల వెంకటసాయి, స్పందన కుమార్తె 1 సంవత్సరం 4 నెల వయసులో ఇటువంటి రికార్డ్ లు సాధించడం చాలా గొప్పతనం.హైదరాబాద్ లో నివాసం ఉంటూ అక్కడ అవార్డు ప్రతినిధులు జూమ్ కాల్ ద్వారా ఏర్పాటు చేసిన సమావేశంలో పాప పలు అంశాలు చెప్పడం, వాటి ద్వారా ఆ పాప సెలెక్ట్ అవడం, వాటికి ప్రతినిధులు పాపకి అవార్డులు పంపడం చాలా ఆనందం.అంత చిన్న వయసులో కలర్స్ ని చెప్పడంలో ను, బైబిల్ వాక్యాలు చెప్పడంలోనూ పాపం కనబరిచిన తీరు చాలా ఆశ్చర్యం వేస్తుంది. ఇప్పటి పిల్లలు చాలా ఫాస్ట్ గా నేర్చుకుంటున్నారు అనేదానికి మన గూడూరు పాపే నిదర్శనం. ఇంత చిన్న వయసులో మన గూడూరు కు చెందిన పాప ఇలాంటి రికార్డ్ ను సొంతం చేసుకోవడం చాలా ఆనందం.పాప ని అంతలా ప్రోత్సహించిన ఆ తల్లి, తండ్రులకు అభినందనలు.ఆ పాప భవిష్యత్తులో ఇంకా ఎన్నో రికార్డ్ లు సొంతం చేసుకోవాలని పాపని ఆశీర్వధించారు.

# అత్యంత వైభవముగా శ్రీ కోదండరామ స్వామి వారి బ్రహ్మోత్సవాలు

- ఈ నెల 25 నుండి 31 వరకు తమ్మినపట్నం శ్రీ రామ మయం.
- 27న సీతారాముల వారి కళ్యాణం
- భక్తులకు పిలుపునిచ్చిన చైర్మన్ కోట సతీష్ యాదవ్, కార్యనిర్వహణాధికారి గిరికృష్ణ



నెల్లూరు బ్యూరో మార్చి 25(ప్రజా ప్రతిభ):

చిల్లకూరు మండలం తమ్మినపట్నం గ్రామంలో వెలసియున్న ఎంతో పురాతనమైన శ్రీ కోదండరామ స్వామి దేవాలయం లో శ్రీరామ నవమి సందర్భంగా అత్యంత వైభవముగా బ్రహ్మోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని శ్రీ కోదండరామ స్వామి దేవాలయం చైర్మన్ కోట సతీష్ యాదవ్ తెలిపారు. దేవాలయం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సతీష్ యాదవ్ మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి 31 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని, శ్రీ సీతారాముల వారి కళ్యాణం 27వ తేదీన జరుగుతుందని, కావున భక్తులందరూ బ్రహ్మోత్సవాలలో పాల్గొని స్వామివారి కృప కటాక్షములు పొందాలని అన్నారు. బ్రహ్మోత్సవాలు ఇంత వైభవంగా జరగడానికి సహకరిస్తున్నటువంటి గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్ కి ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కార్యనిర్వహణాధికారి గిరి కృష్ణ మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ బ్రహ్మోత్సవాలు ప్రతిరోజు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలతో వైభవంగా నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు భక్తనా రామయ్య, కొప్పుల సుబ్రమణ్యం,పాముల రవి తదితరులు పాల్గొన్నారు.

# 11కేవీ ట్రాన్స్ ఫార్మర్ వద్ద చెలరేగిన మంటలు

- త్రుటిలో తప్పిన పెను ప్రమాదం
- సకాలంలో సమాచారం అందించిన సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి
- స్పందించిన అగ్నిమాపక, విద్యుత్ శాఖ అధికారులు
- ఊపిరి పీల్చుకున్న ప్రజలు.







నెల్లూరు బ్యూరో మార్చి 25(ప్రజా ప్రతిభ):

నిత్యం వాహన రాకపోకలతో రద్దీగా ఉండే ప్రాంతం అది. ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఆ మంటల పక్కనే 11 కేవీ ట్రాన్స్ ఫార్మర్ ఉంది. ఎదురుగా అనేక దుకాణాలున్నాయి. వారందరూ మంటలు వ్యాపిస్తుంటే తమాషా చూస్తున్నారు. అప్పుడే ఆ ప్రాంతానికి బైక్ రిపేర్ కోసం సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి షేక్ జమాలుల్లా అక్కడికి వచ్చారు. పరిస్థితిని గమనించారు. అగ్నిమాపక శాఖ కార్యాలయానికి సమాచారం అందించారు. ఐదు నిమిషాల్లో అగ్నిమాపక శాఖ వాహనం సంఘటన స్థలానికి వచ్చేసింది. వెంటనే మంటలను అదుపుచేశారు. అలాగే విద్యుత్ శాఖ ఏఈకి చరవాణిలో సమాచారం అందించగా ఐదుమంది సిబ్బందిని పంపించి కొద్దిసేపు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఈ సందర్భంగా సీపీఐ సహాయ కార్యదర్శి షేక్ జమాలుల్లా మాట్లాడుతూ 11 కేవీ ట్రాన్స్ ఫార్మర్ వద్ద పరిసర ప్రాంతాల దుకాణదారులు వ్యర్థాలు పడవేయడం, దారినపోయే వారు బహుశా సిగరెట్ ముక్క ఆ చెత్తపై విసిరేయడం వలన మంటలు వ్యాపించి ఉండొచ్చన్నారు. వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులు స్పందించి మంటలను ఆర్పేయడంతో పెను ప్రమాదం తపిందన్నారు. ఈ ప్రాంతం నిత్యం వాహన రాకపోకలతో రద్దీగా ఉంటుందని, విద్యుత్ వైర్లు తెగి పడి ఉన్నా, ట్రాన్స్ ఫార్మర్ పేలి ఉన్నా పెను ప్రమాదమే సంభవించి ఉండేదన్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి ఈ ప్రాంతంలో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. జమాలుల్లా వెంట స్థానిక దినపత్రిక పాత్రికేయులు నరసింహారావు ఉన్నారు. సమాచారం ఇచ్చిన వెంటనే స్పందించిన అగ్నిమాపక శాఖ అధికారులకు, విద్యుత్ శాఖ ఏఈ శ్వేతకు కృతజ్ఞతలు తెలిపారు. మంటలు ఆర్పిన వారిలో గూడూరు అగ్నిమాపక శాఖ అధికారి డివి. రమణయ్య, ఎల్ఎఫ్ డి. విజయ్ కుమార్,పి. ప్రదీప్, డ్రైవర్ శ్రీ హరి, ఆపరేటర్ కె.రవీంద్ర రెడ్డి, ఫైర్ మెన్ సిబ్బంది పాల్గొన్నారు.

## సచివాలయాలకు యుపీఎస్‌లు పంపిణీ



పెద్దపంజాణి మార్చి 25(ప్రజాప్రతిభ).

ప్రభుత్వం నుండి మంజూరైన యుపీఎస్ లను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ రెడ్డప్ప చేతుల మీదుగా పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా 19 సచివాలయాలు ఉండగా 15 సచివాలయాలకు ఈ యూపీఎస్ లు మంజూరైనట్లు తెలిపారు. ఈ మేరకు ఆయా పంచాయతీ కార్యదర్శులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాలాజీ, డిప్యూటీ ఎంపీడీవో శారదా దేవి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## జలమే జీవన వేదం - నీటి భద్రతే గ్రామ ప్రగతికి మార్గం

### పెద్దపంజాణిలో 'గ్రామ నీటి భద్రతపై శిక్షణా కార్యక్రమం




పెద్దపంజాణి, మార్చి 25(ప్రజాప్రతిభ).

మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం గ్రామ నీటి భద్రత మరియు ప్రజల భాగస్వామ్యం అనే అంశంపై మండల స్థాయి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని సర్పంచులు, వార్డు సభ్యులు మరియు ఎంపీటీసి సభ్యులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ గారు మాట్లాడుతూ, మారుతున్న కాలానికి అనుగుణంగా గ్రామాల్లో నీటి వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు . భూగర్భ జలాల పెంపుదల, నీటి వృధాను అరికట్టడం మరియు ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందించడంలో ప్రజలను భాగస్వాములను చేయడమే ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశమని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శారదా దేవి, శిక్షణ పొందిన పంచాయతీ అభివృద్ధి అధికారులు రామానుజులు, జయకృష్ణ బాలాజీ, పద్మానాభ రెడ్డి శిక్షణ ఇచ్చారు. ఉపాధి హామీ ఎపిఓ మురుగేషన్, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది మరియు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. శిక్షణ అనంతరం ప్రజా ప్రతినిధులు తమ గ్రామాల్లో నీటి భద్రతపై ప్రతిజ్ఞ చేశారు.

## మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవు



పెద్దపంజాణి మార్చి 25(ప్రజాప్రతిభ).

పెద్దపంజాణి మండలంలోని ముత్తుకూరు క్రాస్ వద్ద ఎస్ ఐ మారెప్ప ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేసి.వాహదారులకు మద్యం తాగి వాహనాలు నడిపే కఠిన చర్యలు తప్పవు అని హెచ్చరించారు.వాహనదారులకు రోడ్డు భద్రత,హెల్మెంట్ అవగాహన కల్పించారు.టూ వీలర్ నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.అలాగే మైనర్ల చేతికి వాహనాలు ఇవ్వరాదని తల్లి తండ్రులకు సూచించారు. అలాగే కారు నడుపు వారు సీట్ బెల్టు ధరించాలని చెప్పారు.వాహనాలకు అన్ని రకాల రికార్డులు కలిగి ఉండాలని సూచించారు.

## పోలీస్ బృందాలతో కార్డెన్ సెర్చ్



నెల్లూరు బ్యూరో మార్చి 25(ప్రజా ప్రతిభ):

నెల్లూరు జిల్లా ఆత్మకూరు లోని ఏ సి ఎస్ ఆర్ ప్రాంతంలో జిల్లా ఎస్పీ అజిత వాజెండ్ల సూచనల మేరకు ఆత్మకూరు డిఎస్పి వేణుగోపాలరావు సలహాతో ఆత్మకూరు సిఐ గంగాధర్ రావు పలువురు ఎస్సైలు పోలీస్ బృందాలతో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు.స్థానిక ప్రజలు పరిచయం లేని వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా అనుమానంగా ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై పోలీసులకు సమాచారం అందిస్తే వెంటనే స్పందిస్తామని తెలిపారు.

# రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం...

## ప్రజలు భయపడవద్దు గ్యాస్ కొరత లేదు : తాసిల్దార్ రామయ్య

- ప్రజల సమక్షంలో గ్యాస్ గోడౌన్ తనిఖీ పారదర్శకతకు నిదర్శనం
- ప్రతి ఖాతాదారుకు సమయానికి సిలిండర్ అందుతుంది అధికారుల భరోసా
- తహసిల్దార్ తనిఖీతో ప్రజలకు నమ్మకం





**చిట్టమూరు మార్చి 25 ప్రజా ప్రతిభ**

తిరుపతి జిల్లా చిట్టమూరు మండల తాసిల్దార్ రామయ్య ఆధ్వర్యంలో బుధవారం ఉదయం భారత్ గ్యాస్ ఏజెన్సీ గోడౌన్ తనిఖీ జరిగింది.ప్రోప్రైటర్ మధు యాదవ్ సమక్షంలో గ్యాస్ సిబ్బందిని ప్రశ్నించి ఓపెనింగ్ స్టాక్, క్లోజింగ్ స్టాక్, ఎమ్మార్పీ రేటు వంటి వివరాలను ప్రజల ముందే సవివరంగా తెలుసుకున్నారు.గోడౌన్ బయట స్టిక్కర్ బోర్డులు అమర్చాలని ఆదేశించి, ప్రజలకు ఎప్పటికప్పుడు సరఫరా జరుగుతోందా అని విచారించారు.ప్రజలతో నేరుగా మాట్లాడి,గ్యాస్ డెలివరీ సమయానికి జరుగుతోందా అని అడిగి తెలుసుకున్నారు.ఎవరైనా అదనపు వసూళ్లు చేస్తున్నారా అని ప్రజలతో స్వయంగా ప్రశ్నించారు.ప్రజల సమస్యలను విని,తక్షణమే స్పందించడం ఆయన ప్రజాస్వామ్య ధోరణిని ప్రతిబింబించింది.ప్రజల సమక్షంలోనే సిబ్బందిని విచారించడం పారదర్శకతకు నిదర్శనమైంది.ప్రజలతో మమేకమై,వారి సమస్యలను స్వయంగా విన్న ఆయన ధోరణి ప్రజల్లో విశ్వాసాన్ని కలిగించింది.ప్రజల కోసం,ప్రజలతోనే పరిపాలన సాగించాలనే సంకల్పాన్ని ఆయన చూపించారు.ప్రజలతో మాట్లాడుతూ ఎమ్మార్వో రామయ్య స్పష్టంగా చెప్పారు.ప్రజలు భయపడవద్దు.గ్యాస్ కొరత లేదు. ప్రతి ఖాతాదారుకు సమయానికి సిలిండర్ అందుతుంది.ఎవరూ అదనపు వసూళ్లు చేయరాదు.ఈ భరోసా మాటలు ప్రజల్లో నమ్మకాన్ని కలిగించాయి.మండల ప్రజలు ఈ పారదర్శక విచారణ పట్ల ఎమ్మార్వోకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వీఆర్వో శివయ్య, గ్యాస్ సిబ్బంది, మండల ప్రజలు పాల్గొన్నారు.ప్రజల సమస్యలపై స్వయంగా స్పందించడం ఆయన ప్రజా సేవా తపనను ప్రతిబింబించింది.మండల ప్రజలు ఇదే నిజమైన పరిపాలన అని అభినందించారు.

## మండలంలో పేద కుటుంబానికి అండగా నిలుస్తున్నవర్ధినేని చారిటబుల్ ట్రస్ట్



**నెల్లూరు బ్యూరో మార్చి 25(ప్రజా ప్రతిభ):**

రామవరపాడు టిడిపి నాయకులు వర్ధినేని మురళి తనయులు వెంకట వినయ్ కుమార్ చౌదరి, వెంకట అభినయ్ చౌదరి లు మండలంలో ఆరోగ్య పరంగా బాధపడుతున్న కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. మండలంలోని అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు వారు అండగా నిలబడుతున్నారు. తమ వంతు సాయం చేస్తూ అందరి మన్నులను పొందుతున్నారు. కమ్మవారిపాలెం గ్రామానికి చెందిన భీమవరపు గురవమ్మకు కళ్ళు కానరాక ఇబ్బందులు పడుతుంటే ఆ కుటుంబానికి బుధవారం పదివేలు ఆర్థిక సహాయం చేశారు. కళ్ళు కనరాని పరిస్థితుల్లో ఉన్న భీమవరపు గురవమ్మని ఆదుకోవడం పట్ల పలువురు హర్ష వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా వర్తినేని మురళి మాట్లాడుతూ ఆ భగవంతుని దయతో తమ కుటుంబములోని వారు పలు రంగాల్లో మంచి స్థాయిలో ఉన్నారని యువకులైన తమ కుమారులు పదిమందికి సాయం చేయాలని దృక్పథంతో ముందుకు వెళుతున్నారు.,అని అన్నారు. ఈ సేవలు ఒక గ్రామానికి మాత్రమే పరిమితం కాకుండా జలదంకి మండలంలోని 17 పంచాయతీల్లో పేద కుటుంబాలకు అండగా నిలుస్తామని అన్నారు. మా కుటుంబాన్ని ఎంతో ప్రోత్సహిస్తున్న ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిల ను ఆదర్శంగా తీసుకొని తమ కుమారులు ఈ కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలోరామావర్పాడు టీడీపి సీనియర్ నాయకులు కంచర్ల రామచంద్రయ్య, కావలి మాజీ ఏఎంసి డైరెక్టర్, ఉదయగిరి నియోజకవర్గ ఐటీడీపీ జనరల్ సెక్రెటరీ పచ్చా పెంచులు నాయుడు,సాగునీటీ సంగం ప్రెసిడెంట్ పరిమి శ్రీహరి నాయుడు, ఉదయగిరి నియోజకవర్గ మహిళ జనరల్ సెక్రెటరీ పచ్చా మనీషా చౌదరి,బొడ్డు వాసుదేవా రాజు, గన్నవరపు వెంకట రమణ్య, రజక సంఘం ప్రెసిడెంట్ చుండూరి మాలకొండయ్య, అవుల వెంకట్రావు, చోప్పరా వెంకట్రావు,చింతకాయ ల రాము, చింతకాయల శ్రీను, కొంజెటి శ్రీను, కొంజెటి వెంకటేశ్వర్లు,కమ్మవారపాలెం గ్రామస్తులు తదితరులు పాలుగోన్నారు.

## - రైతన్న మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే కురుగొండ్ల...



**వెంకటగిరి , మార్చి 25(ప్రజా ప్రతిభ ):**

రైతుల సమస్యలకు ప్రత్యక్షంగా పరిష్కారాలు చూపించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అన్నదాత సుఖీభవ - పీయం కిసాన్ వారోత్సవాలల్లో భాగంగా 'రైతన్న మీకోసం' కార్యక్రమం బుధవారం బాలాయపల్లి మండలంలోని మన్నూరు గ్రామంలో జరిగింది. ఈ సందర్భంగా వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ స్వయంగా రైతుల ఇళ్లకు వెళ్లి వారితో సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కురుగొండ్ల మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. రైతులు ఎదుర్కొంటున్న సాగునీరు, ఎరువులు, విత్తనాల సరఫరా, పంటల మార్కెటింగ్ వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. రైతులకు అవసరమైన సదుపాయాలు అందించడమే 'రైతన్న మీకోసం' కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి వెంటనే పరిష్కరించేలా ఈ కార్యక్రమం అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు . వ్యవసాయం లాభసాటిగా మారాలంటే రైతులకు సాంకేతిక పరిజ్ఞానం, సరైన సూచనలు అందాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇందుకోసం వ్యవసాయ శాఖ అధికారులు రైతులతో



నిరంతరం సంప్రదింపులు జరపాలని సూచించారు.ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా సాగునీటి కొరత, ఎరువుల సరఫరా, పంటలకు గిట్టుబాటు ధరలు వంటి అంశాలపై అభిప్రాయాలు వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులతో చర్చించి తక్షణ చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే రైతులకు హామీ ఇచ్చారు.ప్రభుత్వం రైతులకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఆయన తెలిపారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసి రైతులకు స్థిరమైన ఆదాయం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తే దిగుబడులు పెరిగి ఆదాయం కూడా పెరుగుతుందని వివరించారు.'రైతన్న మీకోసం' కార్యక్రమం ద్వారా గ్రామస్థాయిలోనే సమస్యలు పరిష్కారం కావడంతో రైతులకు ఉపశమనం కలుగుతుందని స్థానిక రైతులు అభిప్రాయపడ్డారు.అదేవిధంగా రైతులతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకునే ఈ తరహా కార్యక్రమాలు వ్యవసాయ రంగ అభివృద్ధికి దోహదం చేస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ నిర్ణయాలు గ్రామస్థాయిలో అమలైతేనే రైతులకు నిజమైన ప్రయోజనం కలుగుతుందని అధికారులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏ. యం. సి చైర్మన్ పునుగోటి మురుగ , మండల అధ్యక్షులు రాయి సత్యం నాయుడు , మండలం మాజీ అధ్యక్షులు రాయి మస్తాన్ నాయుడు , అగ్రికల్చర్ ఏ. వో లు, తహసీల్దార్ , ఎంపీడీఓలు, మండల పి. ఏ. సి. యస్ అధ్యక్షులు, తిరుపతి పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి, మండల క్లస్టర్, యూనిట్ ఇంచార్జీలు, ఎంపీటీసీ సభ్యులు, మండలం నాయకులు, సర్పంచ్ లు, స్థానిక నాయకులు, మన్నూరు గ్రామ నాయకులు, కార్యకర్తలు , వ్యవసాయ శాఖ అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## బడుగుమాకులపల్లె వారపు సంత బహిరంగ వేలం

- పంచాయతీకి భారీ ఆదాయం
- కెనమాకులపల్లె పంచాయతీకి రూ. 32,73,000 ఆదాయం
- గత సంవత్సరం కంటే రూ. 6.13 లక్షలు అదనం



**శాంతిపురం, మార్చి 25 (ప్రజా ప్రతిభ):**

మండల పరిధిలోని బడుగుమాకులపల్లె వారపు సంత బహిరంగ వేలం ద్వారా కెనమాకులపల్లె గ్రామపంచాయతీకి రూ. 32,73,000 ఆదాయం లభించింది. బుధవారం కెనమాకులపల్లె గ్రామ సచివాలయంలో పంచాయతీ అభివృద్ధి అధికారి ఎ.ఆర్. స్వాతి, గ్రామ సర్పంచ్ ఏ.వి. జయరాం ఆధ్వర్యంలో ఈ వేలం నిర్వహించారు.వివరాల ప్రకారం, పశువుల సంత (అవుపేడతో సహా) హక్కులను కెనమాకులపల్లెకు చెందిన ఇ. ఆనందప్ప రూ. 13,00,000లకు దక్కించుకున్నారు. వారపు సంత అంగళ్ల గేటును శివకురుబూరుకు చెందిన శివప్ప రూ. 6,07,000లకు పొందగా, ఆటోలు మరియు ప్రైవేట్ వాహనాల రుసుముల గేటును శివకురుబూరుకు చెందిన హరికుమార్ రూ. 7,00,000లకు స్వాధీనం చేసుకున్నారు.అలాగే గొర్రెలు, కోళ్ల సంత హక్కులను గడ్దూరుకు చెందిన ఇ. రమేష్ రూ. 6,66,000లకు పొందారు.ఈ వేలం ద్వారా గత సంవత్సరంతో పోలిస్తే ఈసారి రూ. 6 లక్షల 13 వేల అదనపు ఆదాయం గ్రామపంచాయతీకి సమకూరింది.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఎం. ఈశ్వరన్న, ఎస్సై ఇ. నరేష్, ఈవోపీఆర్డి బి.ఆర్. రవి నాయక్, గ్రామ సచివాలయ సిబ్బంది, వేలంపాట దారులు పాల్గొన్నారు.

## వేట నిషేధానికి ముందే లైసెన్స్‌ల తనిఖీ

- మత్స్యకారులకు అవగాహన



**నక్కపల్లి, మార్చి 25, (ప్రజా ప్రతిభ) :**

రాష్ట్ర హోం విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత ఆదేశాల మేరకు, ఏప్రిల్ 15 నుండి జూన్ 15 వరకు అమలు కానున్న వేట నిషేధ సమయానికి ముందుగానే మత్స్యకారుల బోట్ల లైసెన్స్‌ల వెరిఫికేషన్ కార్యక్రమం నిర్వహించారు.రాజయ్యపేట సచివాలయం సిబ్బంది శివాజీ తో పాటు సాగర మిత్ర టీం సభ్యులు నాగమణి, రజిని, జ్యోతి ఆధ్వర్యంలో ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ అధికారుల సమక్షంలో రాజయ్యపేట, బోయపాడు గ్రామాల్లో ఈ తనిఖీలు జరిగాయి.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పిక్కి సత్తియ్య, సొసైటీ ప్రెసిడెంట్ పిక్కి కోదండరావు, తెలుగుదేశం పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పిక్కి గంగరాజు, యూనిట్ ఇంచార్జ్ వాసుపల్లి శివాజీ, నక్కపల్లి మండలం ప్రధాన కార్యదర్శి బొంది గుర్రన్న, ఐటీడీపీ అనకాపల్లి జిల్లా కమిటీ సభ్యులు మడదా రాంబాబు, మైలపల్లి సత్యరావు, బోట్ల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణరాయుడుపేట కల్వర్టును ప్రారంభించిన ఎమ్మెల్యే





**మాడుగుల/కె.కోటపాడు మార్చి 25 ప్రజాప్రతిభ**

దేవరాపల్లి- కొత్తవలస రోడ్డు మార్గం మధ్యలో కృష్ణారాయుడు పేట దగ్గర 91 లక్షలతో నిర్మించిన బ్రిడ్జి ప్రారంభోత్సవంలో మాడుగుల నియోజకవర్గం శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి మరియు ఎస్ కోట నియోజకవర్గం శాసనసభ్యురాలు శ్రీమతి కోళ్ళ లలిత కుమారి కలిసి ప్రారంభించడం జరిగింది. అలాగే ఈ సందర్భంగా ఎస్.కోట నియోజకవర్గం శాసనసభ్యురాలు శ్రీమతి కోళ్ల లలిత కుమారీ జన్మదిన సందర్భంగా కేక్ కటింగ్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పివిజి కుమార్, జీవీఎంసీ అధికారులు, మండలం ఎన్డీఏ కూటమి నాయకులు తదితరులు పాల్గొనడం జరిగింది.

## దాసరి సతీష్ బాబు గృహప్రవేశానికి హాజరైన తోట



**గోకవరం మార్చి 25 (ప్రజా ప్రతిభ న్యూస్)**

మండల కేంద్రమైన గోకవరం గ్రామానికి చెందిన సతీష్ కాంప్లెక్స్ అధినేత దాసరి సతీష్ బాబు నూతన గృహప్రవేశ కార్యక్రమంలో మాజీ మంత్రి, మాజీ పార్లమెంటు సభ్యులు, జగ్గంపేట నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోట నరసింహం, ఉభయగోదావరి జిల్లాల విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తోట రాంజీలు పాల్గొన్నారు. అదేవిధంగా గోకవరం గ్రామానికి చెందిన పొట్టి బాబ్జి మనవరాలు వివాహ కార్యక్రమానికి హాజరై వధూవరులను దీవించి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ శ్రామికులకు
# వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన

నాతవరం, మార్చి 25,(ప్రజా ప్రతిభ)

ఉపాధి శ్రామికులు అందరూ ఈ వేసవి కాలం లో పనులకు వచ్చేటపుడు ఎండ తీవ్రత పెరగక ముందే ఉదయం 6 గంటల నుండి 11 గంటల వరకుఅలాగే సాయంత్రం 3 జూఎ నుండి 6 జూఎ వరకు పనులకు హాజరు కావాలిప్రతి ఒక్క వేతనదారులు 2 లీటర్ ల వాటర్ బాటిల్ లేదా ద్రావణాలు తీసుకొని రావాలిపని ప్రదేశం లో ఏఎన్ఎం, ఆశ వర్కర్ ల తో ,వడగాల్పు మరియు ఆరోగ్య నియమాలు అవగాహన కల్పించాలి

.పని ప్రదేశం లో నీడ ఏర్పాటు చేసుకోవాలి అన్ని కుటుంబాలు నికి హాజరయ్యి 100 రోజుల పనిని సద్వినియోగం చేసుకోవాలిగ్రామం లో ఉన్న పశువుల తొట్టె లలో నీరు నింపి పశు వులకు నీరు అందుబాటులో ఉంచాలి.కార్యక్రమం లో ఏపీవో, డి, కొండాజి, అన్ని గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్ లు పాల్గొన్నారు



## రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలి
### డిప్యూటీ తహసిల్దార్ టీవీ, ఎల్, రాజు



నాతవరం, మార్చి,25,(ప్రజా ప్రతిభ)

భూ రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలని నాతవరం డిప్యూటీ తహసిల్దార్ టీవీ ఎల్ రాజు అన్నారు బుధవారం సరుగుడు పంచాయతీ సుందరకాట పంచాయతీ లో రి సర్వే ప్రారంభోత్సవం చేస్తావని ఈ సర్వేల ద్వారా భూ సమస్యలు పరిష్కారం అవుతాయని దీన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షులు సాగిన లక్ష్మణమూర్తి, మండల సర్వేయర్ వి, సత్యనారాయణ, సర్పంచ్ గొల్లపల్లి గంగరాజు, ఉప సర్పంచ్ బండి శివరామకృష్ణ నర్సీపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ పట్టిం రాజబాబు,, వీఆర్వో హరిబాబు, కొండపల్లి రాజబాబు, మద్దెల గంగాధర్, సిహెచ్ కొండబాబు గోము రమణ, గిరిజనులు తదితరులు పాల్గొన్నారు

## మాజీ సీఎం జగన్‌ను కలిసిన బూడి, అనురాధ



దేవరాపల్లి, మార్చి 25(ప్రజా ప్రతిభ)

వైఎస్సార్సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయంలో మాజీ డిప్యూటీ సిఎం, వైఎస్సార్సీపీ రీజనల్ కోఆర్డినేటర్ బూడి ముత్యాలనాయుడు, వైఎస్సార్సీపీ మహిళా విభాగం జోన్-1 వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్లె అనురాధ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల వైఎస్సార్సీపీ రీజనల్ కోఆర్డినేటర్ గా నియమించినందుకు మాజీ సిఎం జగన్మోహన్రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేసినట్లు ముత్యాలనాయుడు స్పష్టం చేశారు.

## మామిడిపల్లి సర్పంచ్
## 'సూరి నాయుడు'కు ఘన సత్కారం



దేవరాపల్లి, మార్చి 25(ప్రజా ప్రతిభ):

మండలంలోని మామిడిపల్లి గ్రామం బహిరంగ మలమూత్ర విసర్జన రహిత (ఓడిఎఫ్) గ్రామంగా ఎంపిక కావడంతో సర్పంచ్ 'కర్రి సూరి నాయుడు'ను బుధవారం ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు. గ్రామంలో మరుగుదొడ్ల వినియోగాన్ని విస్తృతంగా ప్రోత్సహిస్తూ, పరిశుభ్రతపై ప్రజల్లో చైతన్యం కల్పించిన ఆయన కృషి ఫలితంగానే ఈ గుర్తింపు సాధ్యమైందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా గ్రామాన్ని పరిశుభ్రతలో ముందంజలో నిలబెట్టడంతో పాటు, ఓడిఎఫ్ స్థితిని నిరంతరం కొనసాగించే బాధ్యత గ్రామ ప్రజలపై ఉందని సూచించారు. సమిష్టి కృషితో మామిడిపల్లి ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మీ, జెడ్పిటిసి కర్రి సత్యం తదితరులు పాల్గొని సర్పంచ్ సేవలను ప్రశంసించారు.

## సర్పంచులకు ఘన సన్మానం
### - గ్రామోన్నతికి కృషి అభినందనీయం
### - ఎంపీపీ బుల్లిలక్ష్మి, జెడ్పిటిసి సత్యం







దేవరాపల్లి, మార్చి 25(ప్రజా ప్రతిభ):

గ్రామాల సమగ్ర అభివృద్ధిలో సర్పంచుల పాత్ర అమోఘమని ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మీ, జెడ్పిటిసి కర్రి సత్యం అన్నారు. ఏప్రిల్ 2తో సర్పంచుల పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం అనంతరం వారికి ఘన సన్మానం నిర్వహించారు. గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో వారి కృషిని కొనియాడుతూ శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు సర్పంచుల సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు పంచాడ సింహాచలం నాయుడు, ఉగ్రోకుల గంగాభవాని,ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఎంపీడీవో కిరణ్ వరప్రసాద్ హాజరయ్యారు.

## పాత్రికేయ రంగంలో
## 25 ఏళ్ల సేవలకు మరో గుర్తింపు
### - ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ కౌన్సిల్ సభ్యుడిగా
### నాతవరం సీనియర్ జర్నలిస్ట్ ఏడీ బాబు ఎన్నిక

నాతవరం, మార్చి, 25,(ప్రజా ప్రతిభ)



నాతవరం : మండలానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ ఏడీ బాబు ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ ఐజేయు కౌన్సిల్ కార్యవర్గ సభ్యుడిగా ఎన్నిక కావడం పాత్రికేయ వర్గాల్లో హర్షణీయంగా మారింది.దాదాపు 25 సంవత్సరాలుగా పాత్రికేయ వృత్తిలో కొనసాగుతున్న ఆయన, తన నిబద్ధత,నిజాయితీతో వార్తా రంగంలో విశిష్ట గుర్తింపు సంపాదించారు.పాత్రికేయుల సమస్యల పరిష్కారంలో ఎప్పుడూ ముందుండే ఏడీ బాబు, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ ఏపీడబ్ల్యు జేయు రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా పనిచేస్తూ జర్నలిస్టుల హక్కుల కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారు.గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు జర్నలిస్టుల సంక్షేమం కోసం ఆయన చేసిన కృషి విశేషమైనది. తాజాగా ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నిక కావడం ఆయన సేవలకు మరింత గౌరవాన్ని తెచ్చిపెట్టింది. ఈ సందర్భంగా జిల్లాలోని పలువురు జర్నలిస్టులు,ప్రజా ప్రతినిధులు ఆయనను అభినందించారు.ఈ నెల 28న విజయవాడలో నిర్వహించనున్న జాతీయ స్థాయి ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ సమావేశాల్లో ఏడీ బాబు పాల్గొననున్నారు.ఈ సమావేశాల్లో దేశవ్యాప్తంగా జర్నలిస్టుల సమస్యలు,మీడియా రంగ అభివృద్ధిపై కీలక చర్చలు జరగనున్నాయి.

## ఓబులేసు కలిసిన బహుజన స్టూడెంట్ అసోసియేషన్
### - రాష్ట్ర అధ్యక్షులు పాలుట్ల రమణ




నంద్యాల, మార్చి 25,(ప్రజా ప్రతిభ )

నంద్యాల జిల్లా ఆత్మకూరు పట్టణంలోని స్థానిక మున్సిపల్ కార్యాలయం నందు మున్సిపల్ ఇన్చార్జి కమిషనర్ అవుకు ఓబులేసును బహుజన స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు, ఆత్మకూరు బహుజన స్టూడెంట్ అసోసియేషన్ అధ్యక్షులు వరుణ్, వినయ్ లు మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకేలు అందజేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## పలు కార్యక్రమాల్లో పాల్గొన్న వైయస్సార్
## రాష్ట్ర కార్యదర్శి "వీసం రామకృష్ణ"





నక్కపల్లి, మార్చి 25, (ప్రజా ప్రతిభ) :

నక్కపల్లి ఆర్ అ ఆర్ కాలనీలో గెడ్డమూరి గోవిందరావు బంధువులు నిర్మించనున్న గృహ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వీసం రామకృష్ణ కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన కార్యక్రమాన్ని ప్రారంభించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు, అభిమానుల కుటుంబాల అభివృద్ధికి వైఎస్ఆర్‌సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు.అనంతరం నక్కపల్లి మండలం గునిపూడి గ్రామంలో అయినంపూడి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీ రామాలయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ ప్రారంభోత్సవం అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామ ప్రజలతో కలిసి స్వామివారి దర్శనం చేసుకున్నారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొందించేలా ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని ఆయన కొనియాడారు.ఈ కార్యక్రమాల్లో స్థానిక వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జానకయ్య పేటలో సిసి రోడ్డు శంకుస్థాపన



నక్కపల్లి, మార్చి 25, (ప్రజా ప్రతిభ):

మండలంలో జానకయ్య పేట గ్రామంలో బుధవారం నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డుకు కూటమి నాయకులు శంకుస్థాపన చేశారు. కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు.
ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కురుందాసు సింహాచలం, మాజీ జెడ్పీటీసీ కురుందాసు నూకరాజు, జనసేన పార్టీ జిల్లా జాయింట్ సెక్రెటరీ కురుందాసు అప్పలరాజు, దేవర బాబుజి, మొలి శ్రీను, కురుందాసు నానాజీ, దేవర రామకృష్ణ, దేవర అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.గ్రామ అభివృద్ధికి దోహదపడే ఈ రోడ్డు నిర్మాణంతో రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని నాయకులు తెలిపారు. కూటమి నాయకుల సమన్వయంతో చేపట్టిన ఈ కార్యక్రమానికి గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

## ఇలాంటి సేవా
## కార్యక్రమాలు చేయడం ప్రశంసనీయం
### - స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు



నాతవరం, మార్చి,25,(ప్రజా ప్రతిభ)

నర్సీపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెలగా వెంకటకృష్ణారావు మరోసారి తన సేవా దృక్పథాన్ని చాటుతూ నాతవరం పోలీస్ స్టేషన్, ఎంపీడీవో కార్యాలయాలకు రూ.25 వేల విలువైన ప్యూరిఫై కూలింగ్ వాటర్ యంత్రాలను అందజేశారు. ఈ యంత్రాలను స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, జనసేన నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర చేతుల మీదుగా అందించారు.ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు శుద్ధమైన, చల్లని తాగునీరు అందించేందుకు ఇటువంటి యంత్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేపట్టడం సమాజానికి మేలు చేస్తుందని పేర్కొన్నారు. జనసేన ఇంచార్జ్ సూర్యచంద్ర మాట్లాడుతూ వెలగా వెంకటకృష్ణారావు ఇటువంటి సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల్లో మంచి పేరు సంపాదించుకున్నారని కొనియాడారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎం, సత్య శ్రీనివాస్, ఎస్సై వై, తారకేశ్వరరావు తాండవ ప్రాజెక్ట్ చైర్మన్ కరక సత్యనారాయణ, నాతవరం మండలం టీడీపీ అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణతో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ఆధునిక సాగు పద్ధతులపై రైతులకు అవగాహన

**- మారేపల్లిలో ఆత్మ పథకం అవగాహన కార్యక్రమం**

**- నువ్వుల దిగుబడికి శాస్త్రవేత్తల మార్గదర్శకం**





**దేవరాపల్లి, మార్చి 25(ప్రజా ప్రతిభ):**

మారేపల్లి గ్రామంలో ఆత్మ పథకం ఆధ్వర్యంలో 'వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు' అంశంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డా. రాజ్‌కుమార్, శాస్త్రవేత్త డా. సత్తిబాబు పాల్గొని రైతులకు పలు కీలక సూచనలు అందించారు. ముఖ్యంగా నువ్వుల పంటలో అధిక దిగుబడికి 13:0:45 మల్టీ-కే లేదా 19:19:19 ద్రావణాన్ని పిచికారీ చేయాలని సూచించారు. మొక్కలు వేరుకుళ్లతో చనిపోతున్న సందర్భాల్లో కాపర్ ఆక్సీక్లోరైడ్ మందును సరైన మోతాదులో వినియోగించడం ద్వారా పంటను రక్షించవచ్చని వివరించారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా భూసారాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరాన్ని ప్రస్తావిస్తూ, మట్టి పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం చేయాలని సూచించారు. సేంద్రియ వ్యవసాయం ప్రాధాన్యతను తెలియజేసారు. ద్రవ జీవామృతం తయారీ విధానం, దాని ప్రయోజనాలపై రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి ఎల్. వై.కాంతమ్మ, వ్యవసాయ విస్తరణ అధికారి కిరణ్ వ్యవసాయ తదితరులు పాల్గొన్నారు.

# సమన్వయంతోనే సమగ్రాభివృద్ధి

**- దేవరాపల్లి మండల పరిషత్**

**సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ బుల్లిలక్ష్మి**

**- శాఖల పనితీరుపై సమీక్ష**





**దేవరాపల్లి, మార్చి 25(ప్రజా ప్రతిభ):**

మండల అభివృద్ధి దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేస్తేనే ఫలితాలు సాధ్యమవుతాయని ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం ఉండకూడదని స్పష్టం చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. వివిధ శాఖల అధికారులు తమ తమ విభాగాల ద్వారా అమలవుతున్న కార్యక్రమాల ప్రగతిని వివరించగా, వాటిపై ఎంపీపీ సమగ్రంగా సమీక్షించారు. గ్రామాల్లో నెలకొన్న తాగునీరు, రహదారులు, పారిశుధ్యం తదితర సమస్యలను ప్రజాప్రతినిధులు ప్రస్తావించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా వాటి పరిష్కారానికి అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ఆదేశించారు. ప్రభుత్వ పథకాల అమలులో నిర్లక్ష్యం లేకుండా పని చేయాలని సూచించారు. మండలంలో స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇస్తూ ఐదు గ్రామాలను బహిరంగ మలమూత్ర విసర్జన రహిత (ఓడీఎఫ్) గ్రామాలుగా అభివృద్ధి చేయడానికి ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ లక్ష్య సాధనలో గ్రామస్థుల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ కర్రి సత్యం, వైస్ ఎంపీపీలు పంచాడ సింహాచలం నాయుడు, ఉగ్రోకుల గంగాభవాని,ఎంపీడీఓ కిరణ్ వరప్రసాద్, ఎంపీడీవో కార్యాలయం పరిపాలన అధికారి డి.వి. లక్ష్మీనారాయణ, పిఆర్ ఏఈ సుమతి, ఎంఈఓ-1 ఈశ్వరరావు, మండల వ్యవసాయ అధికారిని ఎల్.వై. కాంతమ్మ, ఇతర శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎనిమిది నెలల కష్టాలకు ముగింపు

**- ఎమ్మెల్యేల చేతుల మీదుగా**

**కృష్ణరాయుడుపేట కల్వర్టు ప్రారంభం**

**- దేవరాపల్లి-విశాఖ మార్గంలో మళ్లీ సజావుగా రాకపోకలు**





**దేవరాపల్లి, మార్చి 25 (ప్రజా ప్రతిభ):**

ఎనిమిది నెలలుగా ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేసిన కృష్ణరాయుడుపేట కల్వర్టు సమస్యకు బుధవారం శాశ్వత పరిష్కారం లభించింది. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ళ లలితకుమారి సంయుక్తంగా నూతన కల్వర్టును ప్రారంభించడంతో దేవరాపల్లి--విశాఖపట్నం మార్గంలో రాకపోకలు మళ్లీ సాధారణమయ్యాయి. గత ఏడాది జూలై 21న పాత కల్వర్టు దెబ్బతినడంతో ఈ కీలక రహదారి మార్గంలో రవాణా పూర్తిగా దెబ్బతింది. ఆర్టీసీ బస్సులు కృష్ణరాయుడుపేట వరకే పరిమితమవగా, నిత్య ప్రయాణికులు, విద్యార్థులు, ఉద్యోగులు ప్రత్యామ్నాయ మార్గాలను ఆశ్రయించాల్సి వచ్చి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అదనపు సమయం, ఖర్చు భరించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ సమస్యపై ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ప్రత్యేక దృష్టి సారించి జీవీఎంసీ మేయర్, అధికారులతో చర్చలు జరిపి రూ.91 లక్షల నిధులు మంజూరు చేయించారు. నవంబర్ 26న శంకుస్థాపన చేసి పనులను వేగవంతంగా పూర్తి చేయించారు. నూతన కల్వర్టు అందుబాటులోకి రావడంతో దేవరాపల్లి--కొత్తవలస మార్గంలో బస్సు సేవలు సహా సాధారణ రాకపోకలు పునరుద్ధరించబడ్డాయి. ఎనిమిది నెలలుగా కొనసాగిన ప్రయాణికుల కష్టాలకు పూర్తిగా చెక్ పడింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. ప్రజల సమస్యల పరిష్కారం తమ ప్రాధాన్యత అని, అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేసే దిశగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, దేవరాపల్లి మండల టిడిపి, బిజెపి, జనసేన నాయకులు పెద్దాడ వెంకటరమణ, అవగడ్డ సత్యవేణి, గొర్రెపోటు రామ్మూర్తి నాయుడు, కె.కోటపాడు మండల టిడిపి అధ్యక్షుడు రొంగలి మహేష్, రైవాడ జలాశయ చైర్మన్ పోతల పాత్రునాయుడు, వేపాడ మాజీ ఎంపీపీ చిన రామనాయుడు, జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ధూళిపాళ్ల కుమార్తె వివాహం.. హాజరైన సీఎం చంద్రబాబు

- పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్తె వివాహం
- నూతన జంటను ఆశీర్వదించిన సీఎం చంద్రబాబు
- ఈ వేడుకకు హాజరైన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి
- ఒకే వేదికపై సందడి చేసిన రేవంత్ రెడ్డి, నారా లోకేశ్





**గుంటూరు జిల్లా ప్రతినిధి, మార్చి 25 (ప్రజా ప్రతిభ):**

తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ కుమార్తె వివాహ వేడుక గుంటూరులో వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.గుంటూరులోని శ్రీ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ పెళ్లి వేడుకలో పాల్గొన్న సీఎం చంద్రబాబు.. వధూవరులు నాగసాయి వైదీప్తి, కెవిన్ రామ్‌లకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. వారి వైవాహిక జీవితం ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు.ఈ వివాహ వేడుకకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా హాజరుకావడం విశేషం. ఇదే వేదికపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ కలిసి సందడి చేశారు. ఇద్దరు నేతలు ఒకే వేదికపై కనిపించడంతో కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణ నెలకొంది. ఈ పెళ్లి వేడుక పలువురు రాజకీయ ప్రముఖుల కలయికకు వేదికగా నిలిచింది.

# కలుషిత ఆహార ఘటన

**- బాధితులను పరామర్శించిన**

**మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి**







**నంద్యాల, మార్చి 25,(ప్రజా ప్రతిభ )**

నంద్యాల పట్టణ శివారులోని వైఎస్సార్ నగర్ బుడగ జంగాల కాలనీలో చోటుచేసుకున్న విషాద ఘటన స్థానికంగా కలకలం రేపుతోంది. ఇటీవల ఓ విందు భోజనం ఆరగించిన సుమారు 80 మంది బుడగ జంగాల సామాజిక వర్గానికి చెందిన వారు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. బాధితులు ప్రస్తుతం వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి, స్థానిక నాయకులు రమణ మరియు మాజీ కౌన్సిలర్లతో కలిసి బాధితులను పరామర్శించారు.అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు: వైసీపీ హయాంలో కాలనీ అభివృద్ధికి టెండర్లు వేస్తే, ప్రస్తుత పాలకులు కాంట్రాక్టర్లను బెదిరించి పనులు ఆపేశారని ఆరోపించారు. వైఎస్సార్ కాలనీ ఏర్పాటుకు దివంగత వైఎస్సార్, శిల్పా మోహన్ రెడ్డి ఎంతో కృషి చేశారని, కానీ నేడు అధికారులు కనీస మౌలిక సదుపాయాలను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఘటన జరిగి మూడు రోజులు గడుస్తున్నా బాధితులు ఇంకా సాధారణ స్థితికి రాకపోవడం ఆందోళనకరమని, వారికి మెరుగైన వైద్యం అందించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. బాధితులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చిన శిల్పా రవి, ఈ ఘటనపై తక్షణమే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు దాల్మిల్ అమీర్ 38వ వార్డు ఇన్చార్జి టీవీ రమణ, మాజీ కౌన్సిలర్ మేస చంద్రశేఖర్, వైసీపీ నాయకులు జయప్రకాశ్ రెడ్డి, సోమశేఖర్,అంకాలయ్య,రామకృష్ణారెడ్డి, అన్వర్ భాష,సాయి,కిరణ్, నాయక్,బాబు,చిరు,ప్రసాద్ రెడ్డి,గీతా రాణి,సాయి,వెంకీ,వెంకటస్వామి శెట్టి,సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలపైనే..తర్జనభర్జన

- ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతున్న ఆశావహులు
- మున్సిపాలిటీల్లో రిజర్వేషన్లపైనా
- నేతల సమాలోచనలు
- వచ్చే నెల 2న ముగియనున్న పంచాయతీల పాలన
- ప్రత్యేక అధికారులను నియమించేందుకు ప్రభుత్వం ఏర్పాటు






**నంద్యాల బ్యూరో మార్చి 25, ప్రజా ప్రతిభ :**
నంద్యాల జిల్లా స్థానిక సంస్థల పాలకవర్గాలకు ఒక్కొక్కటిగా గడువు ముగుస్తోంది. ఇప్పటికే కార్పొరేషన్, మున్సిపాల్టీల్లో పాలకవర్గాల గడువు ముగిసిన సంగతి తెలిసిందే. అధికారుల పాలన మొదలైంది. ఎన్నికల వెంటనే జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేయలేదు. వచ్చే ఆరు నెలల్లో స్థానిక ఎన్నికలు నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. ఈ క్రమంలో ఎన్నికల బరిలో నిలిచేందుకు అభ్యర్థులు సన్నాహాలు చేసుకుంటున్నారు. పురపాలక సంఘాలు, నగర పంచాయతీల పాలకవర్గాల పదవీకాలం ఇప్పటికే ముగిసింది. పంచాయతీల పదవీకాలం వచ్చే నెల 6న ముగియనుంది. సెప్టెంబర్లో మండల, జిల్లా ప్రజా పరిషత్తుల పదవీకాలం పూర్తికానుంది. వరుసగా జరిగే స్థానిక ఎన్నికల్లో మహిళలు కీలకం కాబోతున్నారు. పదవుల్లో వారికి 50 శాతం సీట్లు కేటాయించడంతో రాజకీయంగా ముందడుగు వేయనున్నారు. మహిళకు రిజర్వు అయ్యే అవకాశాలపై చర్చనడుస్తోంది. ఇంకా ఎన్నికలపై ఆలోచన చేయలేదు. దీంతో ప్రత్యేక అధికారులను నియమించారు. ఇక పంచాయతీల్లోనూ వచ్చే నెల 2న పాలకవర్గాల గడువు ముగియనుంది. సర్పంచుల పదవీకాలం అయిపోతోంది. స్థానిక సంస్థలన్నింటిలోనూ పాలకవర్గాలకు ఐదేళ్లు నిండినట్లే.. పంచాయతీల గడువు పూర్తయ్యే లోపు రాష్ట్ర ప్రభుత్వం ఏదైనా ఎన్నికలు పెట్టే ఆలోచన చేస్తుందా? లేదా? అనే దానిపై తర్జనభర్జనలు సాగుతున్నాయి. ఇక స్థానిక సంస్థల్లో పోటీ చేసేందుకు అనేకమంది ఆశావహులు తెరపైకి వస్తున్నారు. రిజర్వేషన్లు కూడా మారిపోయే అవకాశాలున్నాయి. వాటిపై ఎన్నికల ప్రక్రియ మొదలైతే నిర్ణయాలు ఏమిటన్నదీ తేలనుంది. స్థానిక సంస్థల్లో ముఖ్యంగా ఒంగోలు కార్పోరేషన్తో పాటు దశాబ్దాల క్రితం

ఏర్పాటైన మున్సిపాల్టీల్లో చైర్మన్లుగా పోటీ చేసేందుకు పలువురు నేతలు ఇప్పటినుంచే వ్యూహాల్లో ఉన్నారు. గ్రౌండ్ వర్క్ చేసుకుంటున్నారు. మంత్రులున్న నియోజకవర్గాల్లో వారిదే నిర్ణయం, ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతున్న ముఖ్య అనుచరులు ఎన్నికల్లో పోటీకి సిద్ధమవుతున్నారు. ఎమ్మెల్యేలను ప్రసన్ననం చేసుకునో దిశగా నిత్యం వారి వెంటే కొందరు తిరుగుతున్నారు. వేగం పెంచారు. ఇక ఎమ్మెల్యేలు కూడా ఎవరిని పోటీకి దింపాలనే దానిపై ఇప్పటి నుంచే ఆలోచన చేస్తున్నారు.. ఎవరికీ మాట ఇవ్వకపోయినా ఆఖరు నిమిషంలో నిర్ణయం తీసుకోవడం సహజం. ఒంగోలు కార్పొరేషన్లో మేయర్, డిప్యూటీ మేయర్ పదవులు కీలకం. వీటి కోసం పలువురు నేతలు ఇప్పటి నుంచే ఓటర్లను వలలో వేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

## టీవీ5 హిందూ ధర్మ పంచాంగాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ..





**గోకవరం మార్చి 25 (ప్రజా ప్రతిభ న్యూస్)**
యుగాలు తరాలు మారినా ప్రపంచానికి హిందూ ధర్మమే దిక్సూచిగా నిలుస్తుందని జగ్గంపేట శాసనసభ్యులు టిటిడి పాలకమండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ అన్నారు. ఆధునిక కాలంలో టెక్నాలజీ ఎంత ప్రభావితం చేసినా సృష్టికి అసలు మూలం హిందూ ధర్మమేనని పేర్కొన్నారు ఉగాదిని పురస్కరించుకుని బుధవారం గోకవరం గ్రామ దేవతగా ప్రసిద్ధి చెందిన శ్రీ మాతృశ్రీ గుబ్బలమ్మ అమ్మవారి ఆలయ సన్నిధిలో టీవీ5 హిందూ ధర్మ పంచాంగాన్ని తన చేతులు మీదుగా ఆవిష్కరించారు...ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ: టీవీ5, హిందూ ధర్మం ఛానల్లు హిందూమత ప్రచారంలో ప్రముఖ పాత్ర పోషిస్తూ, ధర్మం పరిరక్షణ కోసం మరి ఎంతో కట్టుబడి పనిచేయడాన్ని తాను ఎంతగానో అభినందిస్తున్నానన్నారు ముఖ్యంగా టీవీ5 ఛానల్ అధినేత బి.ఆర్ నాయుడు నేతృత్వంలో దినదిన అభివృద్ధి చెందుతూ, ప్రపంచానికి వాస్తవాలను వెలికి తీయడంతో పాటు ,హిందూ ధర్మ ప్రచారంలో ఈ సమాజానికి టీవీ5 ఛానల్ చేస్తున్న సేవలు ఎనలేనిదని కొనియాడారు హిందూ ధర్మ పరిరక్షణలో భాగంగా ప్రత్యేకించి పరాభవ నామ సంవత్సర 2026-28 ఉగాది పంచాంగాన్ని ముద్రించడం శుభదాయకమిని బ్రాహ్మణులు చెబితే తప్ప ముహూర్తాలు తెలియని వారికిపంచాంగం అర్థమయ్యే విధంగా మాసాల వారీగా ప్రచురించడం జరుగుతుందన్నారు..ఈ సందర్భంగా టీవీ5,హిందూ ధర్మం ఛానల్ యాజమాన్యానికి సిబ్బందికి రిపోర్టర్లకు ప్రత్యేకమైన శుభాకాంక్షలు తెలియజేశారు..

## కోటికేశవరం కనక దుర్గమ్మ తల్లి అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొన్న రామసేన సభ్యులు



**గోకవరం మార్చి 25 (ప్రజా ప్రతిభ న్యూస్)**
తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గం కోరుకొండ మండలం కోటికేశవరం గ్రామంలోని కనక దుర్గమ్మ తల్లి ఏడోవ వార్షికోత్సవ సందర్భంగా బుధవారం నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమంలోవిశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు ఆదేశాల మేరకు, రామసేన సభ్యులు బీజేపీ నాయకులు పాల్గొన్నారుతొలిత వారు ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని, అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొని, అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించి భక్తులకు వడ్డించారుఈ అన్న సమారాధన కార్యక్రమానికి కంబాల శ్రీనివాసరావు గారు 1,50,000 రూపాయలు విలువచేసే బియ్యం కిరణా సామాన్లు, కూరగాయలను విరాళంగా అందజేశారుఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు, కరిబండి వెంకటేశ్వరరావు, మంగ రౌతు పద్దరాజు, తుమ్మల బుజ్జి, నెల్లి శ్రీను, రాఘవ నందూరి దుర్గారావు, రామసేన సిబ్బంది కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## పలువురికి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పరామర్శ





**గోకవరం మార్చి 25 (ప్రజా ప్రతిభ న్యూస్)**
గోకవరం మండలంలోని పలువురి కుటుంబాలను పరామర్శించిన స్థానిక శాసనసభ్యులు, టిటిడి బోర్డు మెంబర్ జ్యోతుల నెహ్రూ. ఇటీవల కాలంలో గోకవరం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రౌతుపండు అకాల మరణం చెందినారు.వారి కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. గోకవరం సంజీవయ్య నగరకు చెందిన టిడిపి నాయకులు సామంతుల ఏసు ఇటీవల కాలంలో స్వర్గస్తులైనారు వారి కుటుంబాన్ని నెహ్రూ పరామర్శించారు. తెదేపా నాయకులు మెపెల్లి జయరాజు అనారోగ్యానికి గురై గుండెకు స్టంట్ వేయించుకోవడం జరిగింది. అదే గ్రామంలో తెదేపా నాయకులు చింతాటి వెంకన్న ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదానికి గురైనారు. వారి ఇరువురిని ఎమ్మెల్యే జ్యోతులు నెహ్రూ పరామర్శించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వెదురుపాక గ్రామంలో టిడిపి నాయకులు , సొసైటీ మెంబర్ కత్తుల వీర అప్పారావు తల్లి నాగమణి మరణించినారు. వారి కుటుంబాన్ని నెహ్రూ పరామర్శించి ఓదార్పునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఎమ్మెల్యే తో పాటు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే నెహ్రూ చేతుల మీదుగా బస్సు ప్రమాద బాధితురాలికి చెక్కు అందజేత




**గోకవరం మార్చి 25 (ప్రజా ప్రతిభ న్యూస్)**
జగ్గంపేట ఆర్టీసీ బస్టాండ్ నందు జరిగిన బస్సు ప్రమాదంలో కాలు పోగొట్టుకున్న గోకవరం వాస్తవ్యరాలు రేవాడ రాజేశ్వరికి 10 లక్షల రూపాయలు చెక్కు అందించిన జగ్గంపేట శాసనసభ్యులు, టిటిడి బోర్డు మెంబర్ జ్యోతుల నెహ్రూ. బుధవారం నాడు రాజేశ్వరి స్వగృహమునందు సోలా ఇన్సూరెన్స్ కంపెనీ, ఇండియన్ బ్యాంక్ మేనేజర్, డ్వాక్రా సంఘాల సమక్షంలో చెక్కును అందించడం జరిగింది. గతంలో రాజేశ్వర్ కి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సాయం అందించడం జరిగింది. అదేవిధంగా అవిటితనానికి గురైన రాజేశ్వర్ కి కృత్రిమ కాలు ఏర్పాటుకు పూర్తి సహాయ సహకార అందిస్తానని హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్ కుమార్, సూరంపాలెం ప్రాజెక్ట్ చైర్మన్ ఉంగరాల రాము, సొసైటీ చైర్మన్ గాజింగం సత్తిబాబు, మండల కన్వీనర్ పిల్లా చంటిబాబు, కూటమి నాయకులు,బ్యాక్ ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బి సూర్య అనుదీప్ కుమార్,ఇన్సూరెన్స్ ఆఫీసర్ బి లోకేశ్వర్ రెడ్డి, మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు అల్లాడ అరుణకుమారి,ఏపీఎం జయంత్ రాజు,సిసి కనకదుర్గ వివో ఏలు కనక రత్నకుమారి భాగ్యలక్ష్మి, మాధురి, సరోజినీ, చంద్రావతి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సుంకర వెంకటేశ్వరరావు(రమణ) జన్మదిన వేడుకలు



**గోకవరం మార్చి 25 (ప్రజా ప్రతిభ న్యూస్)**
మండల కేంద్రమైన గోకవరం గ్రామానికి చెందిన కాకినాడ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తూర్పు కాపు సంఘాల అధ్యక్షులు, ఎస్ వి ఆర్ వ్యాపార సంస్థల అధినేత, సీనియర్ రాజకీయ నేత సుంకర వెంకటేశ్వరరావు(రమణ) 81వ జన్మదిన వేడుకలు వారి తనయులు గోకవరం మండలం ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ జన్మదినం వేడుకలకు ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి, పార్లమెంట్ సభ్యులు, జగ్గంపేట నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోట నరసింహం, ఉభయగోదావరి జిల్లాల విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తోట రాంజీలు పాల్గొని కేకు కట్ చేసి నాయకులు కార్యకర్తలు తినిపించుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంకట రమణ గారు వారి కుటుంబం నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో కలకాలం వర్ధిల్లాలని ఉన్నత పదవులు పొందాలని మనసారా దీవిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## రాజుపేటలోది గ్రామం బాపనమ్మ తల్లి జాతర ఉత్సవాలకు కంబాల విరాళం



**గోకవరం మార్చి 25 (ప్రజా ప్రతిభ న్యూస్)**
పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గం, గంగవరం మండలం రాజుపేటలోది గ్రామంలోని బుధవారం ప్రారంభమైన బాపనమ్మ తల్లి జాతర ఉత్సవాలకువిశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ నాయకులు కంబాల శ్రీనివాసరావు 20,000 రూపాయలు విరాళం అందించారు. ఆ నగదును రామసేన పోలవరం జిల్లా ఇంచార్జ్ కడబాల సుధా ఆలయ కమిటీ సభ్యులకు ఆన్లైన్ ద్వారా చెల్లించారు.

# దళితులను కించపరిచిన కేసు నమోదు చేయాలి

**-తెలుగుదేశం పార్టీ నుండి బహిష్కరించాలి**

**-దళితులకు క్షమాపణ చెప్పాలి**

**-ఆదిరెడ్డి దళితవ్యతిరేక వైఖరి పై**

**అంబేద్కర్ విగ్రహం వద్ద వైఎస్ఆర్సిపి శ్రేణులు నిరసన**




**రాజమహేంద్రవరం, మార్చి 25 (ప్రజా ప్రతిభ) :**

ఒక కుటుంబ వివాదం సందర్భంగా దళితులను అవమానపరిచిన మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలని, తెలుగుదేశం పార్టీ నుండి చంద్రబాబు బహిష్కరించాలని, దళితులకు భేషరతుగా క్షమాపణలు చెప్పాలని వైఎస్ఆర్సిపి జాతీయ అధికార ప్రతినిధి రాజమండ్రి మాజీ ఎంపీ మార్గాని భరత్ వారి తో పాటు దళిత నాయకులు, డిమాండ్ చేశారు. దళితులను కించపరిచారన్న ఆడియో ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అయిన సందర్భంగా దళితుల మనోభావాలను దెబ్బతీసిన ఆదిరెడ్డి అహంకార పూరిత వైఖరి ని ఖండిస్తూ వైఎస్ఆర్సిపి శ్రేణులు, దళిత వర్గాలు సంయుక్తంగా బుధవారం స్థానిక గోకవరం బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి ఘనంగా నివాళులు అర్పించారు. కూటమి ప్రభుత్వం డౌన్ డౌన్, ఆదిరెడ్డి అరాచకాలు నశించాలని, దళితులకు క్షమాపణ చెప్పాలి, ఆదిరెడ్డి పై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలి, చేయాలని తెలుగుదేశం పార్టీ నుంచి బహిష్కరించాలని ఆందోళనకారులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు టిజిఆర్ సుధాకర్ బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో దళితులపై దాడులు, దౌర్జన్యాలు మితిమీరి పోతున్నాయని, నిత్యం రాష్ట్రంలో ఏదో ఒక చోట దళితులపై అని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక ఎమ్మెల్యే తండ్రి గా, ప్రజా ప్రతినిధిగా పనిచేసిన మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు దళితులను కించపరిచిన చేసిన వ్యాఖ్యలు అహంకారపూరితమని , వివక్షతతో కూడుకున్నవని ఆయనపై ఎస్సీ ఎస్టీ ఎట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దళితులను బేషరతగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వంలో దగా పడిన దళితులకు వైఎస్ఆర్సిపి, న్యాయం జరిగేంత వరకు అండగా నిలుస్తుందన్నారు. జడ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీలో చాలామంది ఎంపీలు, ఎమ్మెల్యేలు, నాయకులు దళిత వర్గాలను వేధిస్తున్నాయని, అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. పార్టీలు మారిన, ప్రభుత్వాలు మారినా దళితులపై దాడులు మాత్రం ఆగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు . సామాజికంగా రాజకీయంగా విద్యాపరంగా చైతన్యవంతమైన తూర్పుగోదావరి జిల్లాలో ఎమ్మెల్సీ గా చేసిన అప్పారావు దళితులను అవమానకరంగా మాట్లాడటం అంబేద్కర్ రాజ్యాంగాన్ని ధిక్కరించినట్లేనని ఆయనపై తప్పనిసరిగా ఎస్సీ ఎస్టీ కేసు పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేయని యెడల న్యాయపరంగా ఏ స్థాయికి వరకు అయినా వెళ్లి కేసు పెట్టేలా అంటే చర్యలు తీసుకుంటామని అన్నారు. దళితులను కించపరిచిన అప్పారావు పై సొంత తెలుగుదేశం పార్టీలోని దళిత నాయకులు ఆత్మ పరిశీలన చేసుకోవాలని అన్నారు. దళితుని మృతదేహాన్ని ఒక వీధిలోకి రాకుండా అడ్డుకున్న సంఘటన సిగ్గుచేటు అన్నారు. ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడిన విధంగా వైసిపి పార్టీ వారు మాట్లాడితే ఈపాటికి కేసులు పెట్టి జైలుకు పంపించేవారని అన్నారు . కూటమి ప్రభుత్వంలో దళితుల ఆత్మగౌరవం, రక్షణ కోసం పోరాటం చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే తలారి వెంకటరావు మాట్లాడుతూ కూ టమి ప్రభుత్వం వచ్చిన రెండు సంవత్సరాలు నుంచి దళితులపై దాడులు జరుగుతూనే ఉన్నాయని ప్రధానంగా ప్రజాప్రతినిధుల పాత్ర ఎక్కువగా ఉందన్నారు, ఒక వివాదంలో పెద్దమనిషిగా ఉన్న మాజి ప్రజా ప్రతినిధి దళితులను కులం పేరుతో దూషించడం, చంపేస్తానని బెదిరించడం దాడులు చేయడం గర్హనీయం అన్నారు. మాజీ ఎంపీ భరత్ మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సంచలనం కలిగించిన దళితులపై దూషణ, దాడుల సంఘటనలో మాజీ ఎమ్మెల్సీ అప్పారావును తెలుగుదేశం పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనలో ఆదిరెడ్డి అప్పారావుకు తెలుగుదేశం పార్టీ అధిష్టానం షోకాజు నోటీసు ఇవ్వలేదని దళితుల రక్షణ పట్ల ఆ పార్టీ అధిష్టానానికి ఆలోచన లేదా అని ప్రశ్నించారు , దళితుడిని కొట్టి హత్యాయత్నం చేసిన ఆయనపై కేసు కట్టని పోలీస్ అధికారులు బాధితునీ పైన కేసు పెట్టడం దారుణం అన్నారు. టిడిపి దళితులు ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. కేసు కట్టేంతవరకు ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. దళిత వర్గాలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో వైసిపి శ్రేణులు నాయకులు, మహిళలు, దళిత వర్గాలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## ఆంధ్రప్రదేశ్‌లో ఆప్ దూకుడు: స్థానిక ఎన్నికల పోటీకి 'గ్రీన్ సిగ్నల్'




**విశాఖపట్నం, మార్చి 25 (ప్రజా ప్రతిభ) :**

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తమ ముద్ర వేయడమే లక్ష్యంగా ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కీలక అడుగు వేసింది. రాష్ట్రంలో జరగనున్న రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు పార్టీ అధిష్టానం పచ్చజెండా ఊపింది. ఈ మేరకు ఢిల్లీ నుండి విచ్చేసిన పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల ఇంచార్జ్ మణినాయుడు అధికారికంగా ప్రకటించారు. ఘనంగా జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశం. అప్ రాష్ట్ర కన్వీనర్ శీర రమేష్ కుమార్ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో ఈ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మణినాయుడు మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి మరియు స్థానిక సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో అభ్యర్థులను సిద్ధం చేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర కార్యదర్శి బాలసుబ్రమణ్యం, మాజీ అధ్యక్షులు కాటా వరప్రసాద్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు శీతల్ మదన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు చలపతి, జిల్లా అధ్యక్షులు రవిభాస్కర్ వీరితో పాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ అభ్యర్థులు పోటీ చేసేందుకు అవకాశం కల్పించినందుకు ఢిల్లీ ఇంచార్జ్ మణినాయుడుకు రాష్ట్ర కన్వీనర్ శీర రమేష్ కుమార్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. దూర ప్రాంతాల నుండి తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి కార్యకర్తకు, నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ నిర్ణయంతో ఆంధ్రప్రదేశ్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.

## అక్రమ మట్టి తవ్వకాలను అడ్డుకున్న వై.సి.పి నాయకులు



**రాజమహేంద్రవరం, మార్చి 25 (ప్రజా ప్రతిభ) :**

రాజమండ్రి రూరల్ నియోజవర్గం కడియం మండలం పొట్టిలంక గ్రామంలోని అక్రమంగా తరలిస్తున్న మట్టి లారీలని అడ్డుకున్న తూర్పు గోదావరి జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ. పొట్టిలంక గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ 147 లో అక్రమంగా నది గర్భంలోని నల్లమట్టిని తవ్వుతూ నిబంధనలకు పాతర వేస్తూ తరలిస్తున్న మట్టి లారీలను జెసిబిలను ఈరోజు స్థానిక మండల నాయకులతో కలిసి సంఘటన ప్రాంతానికి వెళ్లి అడ్డుకున్న నియోజకవర్గ కోఆర్డినేటర్ మరియు జిల్లా పార్టీ అధ్యక్షులు చెల్లుబోయిన వేణు, ఆయన మాట్లాడుతూ ఎన్జీటీ ప్రమాణికాల ప్రకారం నది తీర ప్రాంతాల్లో మట్టిని తవ్వకూడదని దాన్ని తరలించకూడదని నదీ తీర ప్రాంతాల్లో బాటలు వేసివాహనాల ప్రయాణాలు చేయకూడదని నిబంధనలు ఉన్న అవన్నీ తుంగలో తొక్కుతూ ఈరోజు కూటమి ప్రభుత్వం అన్యాయాలకు పాల్పడుతుందని బ్యాంకుల్లో లోన్లు పొంది ఉన్న పొలాలను సైతం దొంగ పట్టాలు సృష్టించి, అధికారులపై ఒతీళ్ళు చేసి అనుమతులు పొంది అక్రమంగా ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని మీటర్ తవ్వడానికి పర్మిషన్ తీసుకుని రెండు మీటర్ల పైచిలుకు మట్టిని దోచేసారని తవ్విన మట్టిని 14 వేలకు పైగా బయట విచ్చలవిడిగా అమ్ముతున్నారని వందల లారీల కొద్దీ మట్టిని పంట పొలాలను తవ్వి యదేచ్ఛగా తరలిస్తున్నారని గతంలో ఏనాడూ లేని విధంగా లంక ప్రాశీతాల్లో అక్రమాలకు పాల్పడుతూ ప్రజల సొమ్మును కోల్లగోడుతున్నారని తద్వారా వారి జేబులు నింపుకోవడానికి ఇలాంటి దుశ్చర్యకు పాల్పడుతున్నారని అన్నారు, అనేక పర్యయాలు నేను నీతిమంతుడిని అంటూ సీనియర్ శాసనసభ్యులు అయినటువంటి గోరంట్ల బుచ్చయ్య చౌదరి గారు ఎన్నోసార్లు ప్రకటించుకున్నారని, ఈరోజు మీ నియోజకవర్గ పరిధిలో మట్టి మాఫియా చెలరేగిపోయి నది తీర ప్రాంతాల్లో ఉన్నటువంటి మట్టిని దోచుకుంటుంటే మీరు చర్యలు చేపట్టకుండా ఇప్పటివరకు ఈ విషయంపై నోరు మెదపకుండా ఉండటం చాలా ఆశ్చర్యమని, ఈ మట్టి తవ్వకాల్లో మీ ప్రమేయం లేకపోతే వెంటనే మీరు ఈ ప్రాంతాన్ని పరిశీలించి అధికారులకు ఆదేశాలు జారీ చేసి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, మండల పార్టీ అధ్యక్షులు యాదల స్టాలిన్, కొత్తపల్లి శివాజీ, ఈలి గోపాలం, తిరుమలశెట్టి శ్రీను, తాడాల చక్రవర్తి, సింగంశెట్టి శ్రీను, బోడపాటి సత్తిబాబు, గాద రామకృష్ణ, కొత్తపల్లి మూర్తి, రత్నం కృష్ణ, ముత్యం జగదీశ్, గాద సాయిరాం, మార్గాని బలరాశీ, చీకట్ల మాచరయ్య, అయితిరెడ్డి అయ్యప్ప, ఆకుల సుధాకర్, సాపిరెడ్డి సూరిబాబు, దాసరి శ్రీను, తిరికోటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద బొమ్మలాపురంలో ఆరోగ్య ఉప కేంద్రానికి శంకుస్థాపన

**యర్రగొండపాలెం ఆర్ సి ఇంచార్జ్/ డి ప్రసాద్ రెడ్డి, మార్చి25,(ప్రజా ప్రతిభ).**

దోర్నాల మండలంలోని పెద్ద బొమ్మలాపురం గ్రామంలో రూ. 42 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఆరోగ్య ఉప కేంద్రానికి టీడీపీ యర్రగొండపాలెం నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజలకు సమీపంలోనే నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణం పూర్తయిన తర్వాత గర్భిణీ స్త్రీలు, వృద్ధులు, చిన్నారులు సహా గ్రామ ప్రజలందరికీ సమయానికి వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. పెద్ద బొమ్మలాపురం గ్రామ ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఈ ప్రాజెక్ట్ ప్రారంభం కావడం సంతోషకరమని, ఇలాంటి



అభివృద్ధి కార్యక్రమాలు గ్రామాల అభివృద్ధికి బలమైన పునాది వేస్తాయని ఆయన పేర్కొన్నారు. ప్రజల సహకారంతో నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేసి త్వరలోనే కేంద్రాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. గ్రామ ప్రజలు కూడా ఈ కార్యక్రమంపై సంతోషం వ్యక్తంచేస్తూ, ఆరోగ్య ఉపకేంద్రం త్వరగా పూర్తవ్వాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు, గ్రామ పార్టీ కార్యకర్తలు, అధికారులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# కుటుంబ గొడవలను రాజకీయాల్లోకి లాగారు

**- ఈ విధానం భరత్ కు అలవాటు**

**- పేద దళిత వర్గాలను గౌరవించి సహాయపడే వ్యక్తిత్వం నాది**

**- మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు**



**రాజమహేంద్రవరం, మార్చి 25 (ప్రజా ప్రతిభ) :**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వారు కుటుంబ గొడవలను రాజకీయాల్లోకి లాగారని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు మండిపడ్డారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న ఆడియోలపై ఆయన స్పందించారు. అవన్నీ వైకాపా వారు చేసిన ఫేక్ ఆడియోలని ఖండించారు. గత 40 సంవత్సరాల తన రాజకీయ జీవితంలో నగర ప్రజలకు, బడుగు బలహీన వర్గాలకు, ముఖ్యంగా దళిత వర్గాలకు తన వ్యక్తిత్వం సహాయ పడగలను తెలుసు అని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు అన్నారు. ఆపదలో ఉన్న వారికి కష్టాల్లో ఉన్నవారికి ఎంతో సహాయ పడ్డానని, ఒక కుటుంబం వివాదంలో కుల పెద్దమనిషిగా సహాయపడేందుకు తమ మధ్య జరిగిన సంభాషణను వక్రీకరించి తనకున్న రాజకీయ పరపతిని మాజీ ఎంపీ భరత్ కుట్రలు చేస్తున్నాడనీ విమర్శించారు. ఎన్నికల ముందు అతని తండ్రి వయసు గల తనను వయసు కూడా గౌరవం ఇవ్వకుండా చెప్పు తీసి కొడతానని అహంకారపూరితంగా మాట్లాడినప్పుడే తాను గట్టిగా బుద్ధి చెప్పి ఉండాల్సిందని, ఈరోజు మళ్లీ తన వైపు చూసే సాహసం చేసేవాడు కాదని అన్నారు. ఒక అభాగ్యురాలి కష్టాన్ని అర్థం చేసుకుని ఆమె కాపురాన్ని సరిదిద్దే ప్రయత్నం తాను చేస్తుంటే భరత్ అనుచరులు రంగ ప్రవేశం చేసి ఆ మహిళా కుటుంబ సభ్యులను మభ్యపెట్టి, తమ మధ్య జరిగిన సంభాషణ ఆడియోను అతుకులతో ఎడిట్ చేసి తన వ్యక్తిత్వం పై దుష్ప్రచారం పాల్పడుతున్నాడని భరత్ పై చర్యలు తీసుకోవాలని, ఆడియోలో నిజానిజాలు నిర్ధారణ చేయాలని కోరుతూ జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ప్రస్తుత సమాజంలో కుల విద్వేషాలను వైసిపి పార్టీవారు రాజకీయ ఉనికి కోసం రెచ్చగొడుతున్నారని ప్రజలు, దళిత వర్గాలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. దళితుల పట్ల తాను ఎప్పుడూ వ్యతిరేకంగా మాట్లాడలేదని, అంటే తాను తన కుటుంబము దళితుల అభ్యున్నతి కోసం ఎంతో చేస్తున్నామని అన్నారు. దళిత సామాజిక వర్గంలో తమ కుటుంబానికి ఉన్న ఆదరణ చూసి మాజీ ఎంపీ భరత్ ఓర్వ లేకపోతున్నాడని, ఈ రెండేళ్లు తమ కుటుంబంపై ఎన్నో లేనిపోని అసత్య ఆరోపణలు చేస్తూ రాజకీయ పబ్బం గడుపుకుంటున్నాడని ప్రజలు నమ్మే స్థితిలో లేరని అన్నారు. వివాదం పడిన కుటుంబంలోనీ బంధువులు జాన్ అనే వ్యక్తిని అనుచితంగా ప్రవర్తించడంతో కొట్టారని, రాజానగరం పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయిందన్నారు. అతనిపై దాడిని తాను, తన వర్గీయులు చేసినట్లుగా భరత్ దుష్ప్రచారం చేయడం భరత్ వక్రబుద్ధికి నిదర్శనం అన్నారు. దాదాపు సంవత్సరంనర క్రితం మా దగ్గరికి వచ్చిన ఒక కుటుంబ వ్యవహారానికి సంబంధించిన సమస్య సందర్భంలో జరిగిన సంభాషణలోని కొన్ని భాగాలను ఇప్పుడు వక్రీకరించి ఆడియోల రూపంలో వైకాపా వారు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఆ సంభాషణలో వచ్చిన విషయాలను ఎడిట్ చేసి, అసలు విషయాన్ని మార్చి, మత విద్వేషాలు, కుల విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా వైసీపీ నాయకులు రాజకీయ ప్రయోజనాల కోసం ప్రచారం చేస్తున్నారు. ఇది పూర్తిగా దురుద్దేశపూర్వక చర్యని అన్నారు. తమకు దళితులపై ఎప్పుడూ ఎంతో గౌరవం ఉంది, ఈ రోజు రాజమహేంద్రవరంలో టిడిపి బలంగా ఉండటానికి దళిత సోదర సోదరీమణుల సహకారం ఎంతో ఉందన్నారు. తాము ఎప్పుడూ వారికి తోడుగా ఉన్నాం, వారు ఎప్పుడూ మాకు అండగా ఉన్నారు అలాంటి వారిని మేమెందుకు కించపరుస్తాం? వైకాపా వారు చేస్తున్న ప్రచారం పూర్తిగా అబద్ధ ప్రచారమని ఆరోపించారు. ఇప్పటికే సంబంధిత వ్యక్తులు మీడియా ముందుకు వచ్చి వాస్తవాలు వివరించారని గుర్తు చేశారు. అయినా కూడా వాస్తవాలను వక్రీకరించి ఒక ఆడబిడ్డ జీవితాన్ని రోడ్డుపైకి లాగిన విధానం చాలా బాధాకరమన్నారు. ఈ దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని, వాస్తవాలను గుర్తించాలనీ కోరారు. ఇలాంటి దుష్ప్రచారం, పరువు నష్టం కలిగించే చర్యలపై మేము చట్టపరమైన చర్యలు ఖచ్చితంగా తీసుకుంటాము. వైకాపా వారిని వదిలేదే లేదు, చట్టపరంగా కఠినంగా వ్యవహరిస్తాం. దీనిపై మా లీగల్ టీమ్ పని చేస్తోందన్నారు. మీడియా సమావేశంలో తెలుగుదేశం నాయకులు మజ్జి రాంబాబు, కాశీ నవీన్ కుమార్, వర్రే శ్రీనివాసరావు, మొకమాటి సత్యనారాయణ, కప్పల వెలుగు కుమారి, తురకల నిర్మల, చాపల చిన్న రాజు, బొర్రా చిన్ని, బుడ్డిగ రవి, కీలపర్తి శ్రీను, నీలాపు వెంకటేశ్వరరావు, ఈతలపాటి రవి, సలాది ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# అరకు పంచాయతీ కేంద్రంలో దర్జాగా అక్రమ కట్టడాలు

**- పట్టించుకొని రెవెన్యూ అధికారులు**

**ఆలూరి జిల్లా/ దుంబ్రిగూడ,మార్చి25(ప్రజా ప్రతిభ)**

ఆలూరి సీతారామరాజు జిల్లా దుంబ్రిగూడ, మండలం అరకు పంచాయతీ అరకు గ్రామంలో భినామి పేర్లమీద అనుమతులు మంజూరు చేస్తున్న పంచాయతీ, రెవెన్యూ అధికారులు. 1/70చట్టాలను తూట్లు పొడుస్తున్న గిరిజనేతరులు. అడ్డగోలుగా అనుమతులు మంజూరు చేసి అక్రమ కట్టడాలకు ప్రోత్సహిస్తున్న పంచాయతీ సెక్రటరీ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసిన ఆదివాసీ గిరిజన సంఘం దుంబ్రిగూడ మండల కార్యదర్శి తామర్ల. సూర్యనారాయణ, అధ్యక్షులు పాంగి. సత్యనారాయణ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అరకు పంచాయతీ కేంద్రంలో ఇటీవల కాలంలో అక్రమ కట్టడాలు బాగా పెరిగిపోయిందనీ చెప్పారు. గ్రామ కంఠం భూములు, అలాగే ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురిఅవుతుందనీ ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన చట్టాలు కాపాడవలసిన అధికారులు చట్టాన్ని తూట్లు పొడిచి అక్రమ కట్టాడాలను దగ్గర ఉండి ప్రోత్సహించడం విచారకరం అన్నారు. నేషనల్ హైవేను ఆనుకోని పంచాయితీ కార్యాలయ సమీపం నుండి నేరేడు వలస చివర వరకు ఉన్న గ్రామ కంఠం భూములు, అలాగే ప్రభుత్వ స్థలాలు రోజు రోజుకి కబ్జాకు గురవతుందనీ చెప్పారు. వెల్డర్ నంధీశ్వరావు అలాగే కొంతమంది గిరిజనేతరులు దర్జాగా నిర్మాణ పనులు చేస్తున్న పంచాయతీ అధికారులు మౌనంగా ఉండటం వెనకాల అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. వెంటనే అక్రమ కట్టడాలు ఆపాలని, అలాగే పంచాయతీ సెక్రటరీ, వీఆర్వో మీద కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. చాలా మంది గిరిజనులకు ఇళ్ల స్థలాలు లేక ఇబ్బంది పడుతున్నారనీ, ఇళ్ళు స్థలాలు లేని పేద గిరిజనులకు స్థలాలు కేటాయించాలనీ ఈ సందర్భంగా చెప్పారు. అక్రమ కట్టడాలపై జిల్లా కలెక్టర్ గారికి పిర్యాదు చేస్తామని చెప్పారు.





# సొలభం పంచాయతీ సర్పంచ్ ఆధ్వర్యంలో ఆదివాసి సత్య గ్రహ యాత్ర....

**జి మాడుగుల మార్చి 25 (ప్రజా ప్రతిభ)**

అల్లూరి జిల్లా జిమాడుగుల మండలం సొలభం గ్రామం నుంచి ఆదివాసి సత్యగ్రహ యాత్రను ఐసారం హనుమంతరావు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జె ఎస్ సి ప్రారంభించింది, ఈ కార్యక్రమంలో రామారావు దొర మాట్లాడుతూ సత్యాగ్రహ యాత్ర ఈరోజుతో 136వ రోజుకు చేరుకుందని రాష్ట్రంలో అనేక గ్రామాలను పర్యటిస్తూ, షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామకాల చట్టం చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేస్తున్నామని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదివాసి నిరుద్యోగులకు న్యాయం చేయడం కోసం ఆదివాసి ప్రాంత ఉద్యోగాలన్నీ స్థానిక ఆదివాసీలకే కల్పించేలా చట్టం చేస్తామని పలు సందర్భంలో ఆదివాసి ప్రాంతాల పర్యటనలో హామీ ఇచ్చి ఇప్పుడు మర్చిపోయారు అన్నారు, 2025 ఆగస్టు 9న పాడేరులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వచ్చినప్పుడు ఈ చట్టం చేస్తామని ఆదివాసి జేఏసీకి ఆదివాసులకు హామీ ఇచ్చారు అన్నారు, షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామక చట్టం చేసేంతవరకు ఆదివాసులందరూ ఉద్యమాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు, ఈ చట్టం చేయడం ఆదివాసులకు చారిత్రక అవసరమే కాదు, కూటమి ప్రభుత్వం యొక్క గురుతర బాధ్యత కూడా అని రామారావు దొర అన్నారు, అలాగే, అలాగే ఏజెన్సీ ఏజెన్సీ చట్టాలు రాజ్యాంగ పరిధిలో పరిగణలోకి తీసుకొని షెడ్యూల్ ప్రాంత ఉద్యోగాల నియామక చట్టం కూర్పులో స్టేట్ కేడర్ పోస్టులలో 30 శాతం జోనల్ కేడర్ పోస్టులలో 50 శాతం లోకల్ కేడర్ పోస్టులు అన్నిటిని స్థానిక ఆదివాసులతో భర్తీ చేసే విధంగా సమగ్రమైన చట్టం చేయాలని పలుదపాలుగా ప్రభుత్వంతో జరిపిన చర్చలలో ఆదివాసి జేఏసీ స్పష్టం చేసింది, ఇప్పటికైనా షెడ్యూల్ ప్రాంత ఉద్యోగాల నియామక చట్టం చెయ్యకపోతే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రకటించిన మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా మరో మారు ఆదివాసులకు తీవ్ర అన్యాయం జరగనుందని ఆదివాసి జేఏసీ హెచ్చరిస్తుంది కావున కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చుకుంటే షెడ్యూల్ ప్రాంత ఉద్యోగాల నియామక చట్టం చేయకపోతే ఆదివాసి జేఏసీ ఉద్యమాలు తీవ్రతరం చేసి ప్రభుత్వానికి డిమాండ్ చేస్తామని హెచ్చరించారు, ఆదివాసి జెఎస్సి రాష్ట్ర వైస్ చైర్మన్ ముట్టడం రాజబాబు మాట్లాడుతూ జీవో నెంబర్ 3 రద్దు చేయడంతో ఆదివాసులకు తీవ్ర నష్టం జరిగిందని, గిరిజన సలహా మండలి (టి ఏ సి) ద్వారా షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామకాలు చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసి చట్టాలైన భూ బదలాయింపు నిషేధ చట్టం, పేసా చట్టం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాలను సక్రమంగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాన్నిదని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జేఏసీ నాయకులు పార్ధు స్వామి, గంగరాజు, జెఎస్సి మీడియా ప్రతినిధి మరియు గిరిజన విద్యార్థి సంఘం, డివిజన్ అధ్యక్షుడు మణుగూరు బాబూజీ, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అన్ని గ్రామాలకు ఆదివాసీ సత్యాగ్రహ యాత్ర రథం వెళ్లి ఏప్రిల్ 3వ తారీఖున పాడేరులో జరిగే ర్యాలీ విజయవంతం చేయాలని ప్రచారం చేశారు.



## రహదారుల నిర్మాణానికి అటవీ శాఖ,

## పర్యావరణ అనుమతులు త్వరితగతిన మంజూరు చేయాలి

### - జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్





**అల్లూరి జిల్లా బ్యూరో మార్చి 25 ప్రజా ప్రతిభ**

జిల్లా సమగ్ర అభివృద్ధికి, పర్యాటకానికి మరింత ఊతమిచ్చేందుకు రహదారుల, సెల్ టవర్ల నిర్మాణానికి అటవీ, పర్యావరణ అనుమతులు త్వరితగతిన మంజూరు చేయాలని అటవీ, రెవెన్యూ ఇంజనీరింగ్ శాఖ అధికారులను జిల్లా స్థాయి కమిటీ మీటింగ్ లో జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరం నుండి అల్లూరి సీతారామరాజు, పోలవరం జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అనుమతులకై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్ లో ఉన్నటువంటి రహదారుల నిర్మాణాలకు అటవీ అధికారులు అనుమతులు మంజూరు చేయాలన్నారు. అనుమతులు మంజూరైన వెంటనే పనులు త్వరగా చేపట్టాలని పంచాయతీరాజ్, పి ఐ యు, గిరిజన సంక్షేమ శాఖ అధికారులకు సూచించారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేయడం వల్ల పనులు త్వరగా పూర్తవుతాయన్నారు. రహదారుల నిర్మాణాలు చేపట్టేటప్పుడు తక్కువ దూరాలకు అటవీ అనుమతులు రాని ప్రాంతాలలో రెవెన్యూ భూములను అందుబాటులో ఉంచాలన్నారు. పర్యావరణ ప్రాజెక్టులకు రహదారులను అనుసందానించేటప్పుడు అటవీ శాఖ పరిమితులకు లోబడి అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. జాతీయ రహదారుల నిర్మాణాలు , రాష్ట్ర రహదారులు, అంతర్గ రహదారుల నిర్మాణాలు చేపట్టడం వల్ల జిల్లా మరింతగా అభివృద్ధి చెందుతుందని మారుమూల ప్రాంతాల్లో ఉన్నటువంటి ప్రజలకు రవాణా సదుపాయాలు కల్పించడంతోపాటు, మౌలిక వసతులు, విద్య, ఆరోగ్యం, సంక్షేమం త్వరగా అందించగలుగుతామన్నారు. ముఖ్యంగా కిటుమల నుండి చెరువుల వేనం వరకు రహదారి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలన్నారు. రేవెల్ల కోట నుండి గుమ్మకోట వరకు, గాలికొండ నుండి పెదలంకల వరకు రహదారుల నిర్మాణానికి అటవీ శాఖ భూములకు ప్రత్యామ్నాయంగా రెవెన్యూ భూములను చూపించాలనీ రెవెన్యూ అధికారులకు సూచించారు. జిల్లాలో సిగ్నలింగ్ వ్యవస్థను మెరుగుపరచుటకు బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్ల నిర్మాణానికి అరకు, జి. మాడుగుల మండలాల్లో భూ సేకరణ చేపట్టాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అటవీ, రెవెన్యూ, ప్రైవేట్ భూములు అయితే అయా శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలని బిఎస్ఎన్ఎల్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్, పాడేరు ఐటిడిఏ పివో తిరుమాని శ్రీ పూజ, జిల్లా రెవెన్యూ అధికారి నూకరాజు, రంపచోడవరం జిల్లా రెవెన్యూ అధికారి అంబేద్కర్, పాడేరు ఇంచార్జ్ డిఎఫ్ వో ఉమామహేశ్వరీ, చింతపల్లి డిఎఫ్ వో నర్సింగరావు, అటవీ శాఖ అధికారులు, బి ఎస్ ఎన్ ఎల్ , పంచాయతీ రాజ్, పి ఐ యు, ట్రైబల్ వెల్ఫేర్, ఇంజనీరింగ్ అధికారులు, వివిధ మండలాల మండల రెవెన్యూ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో జర్నలిస్టులకు "ఉచిత" వైద్య పరీక్షలు

## జిల్లా కలెక్టర్ ఏ ఎస్ దినేష్ కుమార్






**అల్లూరి జిల్లా బ్యూరో మార్చి 25 ప్రజా ప్రతిభ**

జిల్లాలో ఉన్న జర్నలిస్టులు , వారి కుటుంబం సభ్యుల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ, వారి కోసం పాడేరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో అల్లూరి జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహించుచున్న ఈ మెడికల్ క్యాంపు నందు ఉచితంగా నిర్వహించే ఈ ఆరోగ్య పరీక్షలు, వైద్య పరీక్షలు సద్వినియోగం చేసుకోవడం మంచి శుభతరుణమని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ అన్నారు.బుధవారం ఉదయం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి పాడేరు నందు జర్నలిస్టులకు ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ ఎస్ దినేష్ కుమార్ పాల్గొని జ్యోతి ప్రజ్వల గావించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు రక్తపోటు, షుగర్, ఈసీజీ, మరియు ఈ.ఎన్.టి వంటి ప్రత్యేక పరీక్షలు నిర్వహించడం, ప్రతి జర్నలిస్ట్ పాల్గొని పరీక్షలు చేయించుకోవడం, జర్నలిస్ట్ ల ఆరోగ్య స్పృహను తెలియజేస్తుందన్నారు.జిల్లాలోని పని చేస్తున్న జర్నలిస్టులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.నిరంతరం ప్రజా క్షేత్రంలో ఉంటూ వార్తా సేకరణలో నిమగ్నమయ్యే జర్నలిస్టులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలనే ఉద్దేశంతో ఈ ఉచిత వైద్య పరీక్షల శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అర్హులైన జర్నలిస్టులు నిర్ణీత సమయానికి ఆసుపత్రికి చేరుకుని ఈ సేవలను పొందాలని సూచించారు.అలాగే జర్నలిస్టుకు హెల్త్ కార్డు ద్వారా నిర్వహించే వైద్యం కోసం ఆరోగ్య మిత్ర కోఆర్డినేటర్ ని అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి వైద్య పరీక్షలు అక్రిడేటెడ్ జర్నలిస్టులతో పాటు నాన్ అక్రిడేటెడ్ జర్నలిస్టులు కూడా నిర్వహించాలని జర్నలిస్టులు జిల్లా కలెక్టర్ వారికి కోరగా ఆయన జిల్లాలో అలాంటివారు ఎంతమంది ఉంటారని, వారి వివరాలను అక్రిడేషన్ కమిటీ సభ్యులు, జిల్లా కమిటీకి సూచించాలని, జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కమిటీ నిర్ణయం అనంతరం వైద్య పరీక్షలు నిర్వహిస్తామని అలాంటి వారిని అక్రిడేషన్ కమిటీ ద్వారా వారి పేర్లను నమోదు చేసి జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి వారి ద్వారా జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ లో పెట్టాలని కలెక్టర్ సూచించారు.ఈ వైద్య పరీక్షలు నిర్వహించటకు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి పాడేరు నుండి సూపరిండెండెంట్ డాక్టర్ కె శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కృష్ణమూర్తి నాయక్, అసిస్టెంట్ ప్రొఫెసర్, జనరల్ మెడిసిన్ డాక్టర్ ఐశ్వర్య, ఆప్తమాలజిస్ట్ డాక్టర్ అమూల్య, అసిస్టెంట్ ప్రొఫెసర్,పెడియట్రిక్స్ డాక్టర్ అశోక్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఆర్థోపేడిక్స్ డాక్టర్ విజయ కుమారి, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఈఎన్టి డాక్టర్ నాగేంద్ర, అసిస్టెంట్ ప్రొఫెసర్ గైనకాలజిస్ట్ డాక్టర్ సృజన, డాక్టర్ ఎల్లయ్య, డాక్టర్ టి ఎస్ ఎన్ రాజు, లేప్ టెక్నీషియన్ శంకర్రావు, ఫార్మటిస్ట్ ప్రసాద్, మహేష్ బాబు,రక్త పరీక్ష నిర్వహించే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పొగాకు రైతు నిలువు

## దోపిడీ, తొలిరోజే కుదేలైన ధరలు!








**మార్కాపురం జిల్లా ప్రతినిధి/ కొంద్రు వెంకటేశ్వర్లు,మార్చి 25, ( ప్రజా ప్రతిభ):**

పొగాకు రైతులకు ఈ ఏడాది వేలం ప్రారంభం కోలుకోలేని దెబ్బ తీసింది. ఎంతో ఆశతో ఎదురుచూసిన రైతులకు మార్కెట్ ధరలు షాక్ ఇచ్చాయి. మార్కాపురం జిల్లా పొదిలి పొగాకు వేలం కేంద్రాన్ని గుంటూరు పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి. విశ్వశ్రీ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ ఏడాది వాతావరణం అనుకూలించి పంట అత్యంత నాణ్యమైన దిగుబడి వచ్చిందని, రైతులకు ఖచ్చితంగా గిట్టుబాటు ధర లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే, వేలం పాటలు ప్రారంభమైన కొద్దిసేపటికే సీన్ రివర్స్ అయ్యింది.గత ఏడాది కంటే తక్కువ ధర.నాణ్యమైన పంట వచ్చినప్పటికీ, బయ్యర్లు కేవలం కిలోకు రూ. 250 మాత్రమే పలకడంతో రైతులు తీవ్ర నిరాశకు గురయ్యారు. గత ఏడాది వేలం ప్రారంభంలో కిలో పొగాకు ధర రూ. 280 పలికిందని, కానీ ఈసారి పెట్టుబడి ఖర్చులు పెరిగిన తరుణంలో ధర తగ్గడం దారుణమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నాణ్యత బాగుందని స్వయంగా అధికారులే చెబుతున్నా, ధర విషయంలో మాత్రం బయ్యర్లు సిండికేట్‌గా మారి తమ నడ్డి విరుస్తున్నారని రైతులు మండిపడుతున్నారు.అధికారులు, బయ్యర్లు కుమ్మక్కు,వేలం కేంద్రం వద్ద రైతులు అధికారులను నిలదీశారు. అధికారులు, బయ్యర్లు కుమ్మక్కై రైతులకు అన్యాయం చేస్తున్నారని బహిరంగంగానే ఆరోపించారు. గతేడాది కంటే రూ. 30 తక్కువగా ధర నిర్ణయించడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని, ఇది రైతులను అప్పుల ఊబిలోకి నెట్టడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రస్తుత మార్కెట్ పరిస్థితులు, పెరిగిన సాగు ఖర్చులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కనీసం కిలోకు రూ. 300 ధర లభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో వేలం ప్రక్రియను అడ్డుకుంటామని, తమకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. నాణ్యమైన పంటకు సరైన ధర కల్పించి తమను ఆదుకోవాలని వేలం కేంద్రం వద్ద రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

# సీలేరు నిర్వాసిత సమస్యపై చర్చ..!

### -సీలేరు యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్..

### - ఆ తర్వాతే ప్రాజెక్ట్ నిర్మాణానికి అంగీకారం.

### - తెగేసి చెప్పిన పంప్డ్ స్టోరేజ్ నిర్వాసిత జేఏసీ.

**అల్లూరి జిల్లా గూడెం కొత్త వీధి మార్చి 25 ప్రజా ప్రతిభ**

ఏపీ జెన్ కో విద్యుత్ కాంప్లెక్స్ సీలేరులో నూతనంగా నిర్మించబోయే పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు లో సీలేరు గ్రామాన్ని నిర్వాసిత గ్రామంగా చేర్చాలని జరుగుతున్న ఆందోళనలకు జెన్ కో అధికారులు స్థానిక జేఏసీ నాయకులతో బుధవారం చర్చలు చేపట్టారు.ఈ చర్చలకు జెన్కో చీఫ్ ఇంజనీర్ కె.వి రాజారావు, సూపరెంటెండెంట్ ఇంజనీర్ జాకీర్ హుస్సేన్, డి ఈ బాలకృష్ణ, స్థానిక జేఏసీ నాయకులు సర్పంచ్ దుర్జో, ఎంపీటీసీ సాంబమూర్తి,ఉప సర్పంచ్ వల్లి ప్రసాద్, మాజీ వైస్ సర్పంచ్ కారే.శ్రీనివాస్ ఇతర పార్టీ నాయకులు, గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఇందులో చీఫ్ ఇంజినీర్ మాట్లాడుతూ తొలివిడత గా పార్వతి నగర్ శాండి కోరి, బూసుకొండ గ్రామాల్లో ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ నిబంధన ద్వారా వారికి ఇంటికొక ఉద్యోగం ఇచ్చిన తర్వాత స్థానిక సీలేరు యువతకు మెగా కంపెనీలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని అలాగే గ్రామంలో మౌలిక సదుపాయాలు చేపడతామని చెప్పారు. దానికి అంగీకరించని జేఏసీ నాయకులు పూర్తిస్థాయిలో సీలేరు గ్రామాన్ని నిర్వాసిత గ్రామంగా చేర్చి సంబంధిత అధికారులు ప్రకటన చేయాలని, అలాగే స్థానికంగా ఉన్న యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, గ్రామ అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహకరించాలని, ప్రస్తుతం సీలేరులో ఉన్న స్మశాన వాటిక ప్రాజెక్టు నిర్మాణం వల్ల పోతుందని, వేరే ప్రాంతంలో జెన్కో నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. దానికి అంగీకరించిన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా చీఫ్ ఇంజనీర్ రాజారావు మాట్లాడుతూ నిర్వాసిత గ్రామంలో సీలేరు చేర్చే అంశంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని వారి నుంచి వచ్చే ఆదేశాల ప్రకారం ప్రకటన చేపడతామని అన్నారు.

**డిమాండ్లు పరిష్కరించాకే ప్రాజెక్టు పనులు ప్రారంభించాలి..**

ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా సీలేరు రెగ్యులేటర్ డ్యామ్ ప్రస్తుతం ఉన్న స్మశాన వాటిక ప్రదేశంలో కొత్త ప్రాజెక్టు సంబంధించి ఇంటెక్ డ్యామ్ నిర్మాణం కోసం మెగా ఇంజనీరింగ్ కంపెనీ పనులు ప్రారంభించేందుకు పది రోజుల కిందట ఏర్పాటు చేసింది. దీన్ని అడ్డుకున్న గ్రామస్తులు పూర్తిస్థాయిలో నిర్వాసిత గ్రామంగా ప్రకటించాకే పనులు ప్రారంభించాలని స్మశాన వాటిక కొత్తది అన్ని సదుపాయాలతో నిర్మించాలని, స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్స్ జేఏసీ నాయకులు ఆందోళన చేపట్టారు. దీనిపై ఇప్పటికే జిల్లా అధికారులకు స్పందన కార్యక్రమంలో వినతి పత్రం అందజేయడం తో వారు స్పందించి బుధవారం జెన్ కో అధికారులు జిల్లా అధికారులు ఈ విషయంపై చర్చించారు. అనంతరం స్థానిక జేఏసీ నాయకులతో కలిసి మాట్లాడారు. అధికారులు వారి నుంచి పూర్తి వివరాలు తీసుకొని జెన్కో ఎండికి తెలియజేస్తామన్నారు. ప్రాజెక్టు పనులకు సహకరించాలని కోరినప్పటికీ డిమాండ్స్ నెరవేర్చాక పనులు ప్రారంభించాలని తేల్చి చెప్పారు.



## గూడెం కొత్త వీధి ఎంపీడీవో కార్యాలయంలో

## వైద్య సిబ్బందికి మాతృ శిశు సంరక్షణపై అవగాహన

**అల్లూరి జిల్లా గూడెం కొత్త వీధి మార్చి 25 ప్రజా ప్రతిభ**

గూడెం కొత్త మండలం, యం.పి.డి.ఓ. కార్యాలయం, అల్లూరి సీతారామరాజు జిల్లా

ఈరోజు గూడెం కొత్త మండలంలోని యం.పి.డి.ఓ. కార్యాలయంలో ఆర్జె .పాలెం, .చీడిపాలెం, ఆర్ వి .నగర, జీకే .వీధి, సప్పర్ల, దారకొండ, సీలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బందికి సమావేశం నిర్వహించబడింది.ఈ సమావేశంలో మాతృ మరియు శిశు సంరక్షణ కార్యక్రమంపై అవగాహన కల్పించబడింది. ముఖ్యంగా మాతృ మరణాలు మరియు శిశు మరణాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, వ్యాధి నివారణ టీకాలు, హెచ్.పి.పి. వెక్సిన్ "14", సంవత్సరాలు నుండి "15" సంవత్సరాల ఆడ పిల్లలు అందరికి 100% పూర్తి చేయడం, అలాగే రిప్రొడాక్టివ్ చైల్డ్ హెల్త్ ( ఆర్ సి హెచ్ ) పోర్టల్ నిర్వహణపై వివరించారు.అదేవిధంగా, ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులు ( ఈ హెచ్ ఆర్ ) కు సంబంధించిన అన్ని లాగిన్‌లు 100% పూర్తిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి పసుపులేటి నారాయణ రావు ఈ హెచ్ ఆర్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ పూజారి.హరిప్రియ , జి కే వీధి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ ఎం. రుషశ్రీ శ్రీ ఎస్.ఓ. జయంతి కైలాసరావు డి పి హెచ్ ఎన్ ఓ శ్రీమతి జి. భూలోకమ్మ డిపిఓ ఎస్. సతీష్ ఎం పి హెచ్ లు కె. వెంకటేశ్ ఎం. జాన్సన్ సీలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర హెల్త్ సూపర్వైజర్ శ్రీ ఎన్. త్రినాధ్ దారకొండ పీహెచ్ఎన్ శ్రీమతి బత్తుల విక్టోరియా మహారాణి , హెల్త్ సూపర్వైజర్ శ్రీమతి ఎల్. రాజులమ్మ అలాగే ఆర్జె .పాలెం, యు.చీడిపాలెం, ఆర్.బి .నగర, జీకే .వీధి, సప్పర్ల, దారకొండ, సీలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఎం ఎల్ హెచ్ పి లు మరియు ఏ ఎన్ ఎం ఈ సమావేశంలో పాల్గొన్నారు.



### 40 సంవత్సరాల కల సాకారం...

# రైతులకు జీవనాధారం అయిన గండిచెరువు నుండి నీరు విడుదల





**యర్రగొండపాలెం ఆర్ సి ఇంచార్జ్/ డి ప్రసాద్ రెడ్డి, మార్చి 25,(ప్రజా ప్రతిభ).**

దోర్నాల మండలం, పెద్ద బొమ్మలాపురం గ్రామంలో జలవనరుల శాఖ ఆధ్వర్యంలో యర్రగొండపాలెం నియోజకవర్గం టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు పెద్దబొమ్మలాపురం గండిచెరువు నుండి వెన్నా పాపిరెడ్డి చెరువుకు సప్లై ఛానల్ ద్వారా నీటిని విడుదల చేయడం జరిగింది.అనంతరం చెరువు వద్ద నీటికి ఎరిక్షన్ బాబు జలహారతి ఇచ్చారు.ఈ సందర్భంగా ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ పెద్దబొమ్మలాపురం ప్రాంత రైతులు దాదాపు 40 సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న నీటి సమస్యకు నేడు పరిష్కారం లభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.ఈ చెరువుల మధ్య సప్లై ఛానల్ ద్వారా నీటిని విడుదల చేయడం వల్ల ఈ ప్రాంతంలోని రైతులకు సాగునీటి సౌకర్యం మెరుగుపడి, పంటల సాగు విస్తరించేందుకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.అలాగే ఈ నీరు అందుబాటులోకి రావడం వల్ల వ్యవసాయానికి మాత్రమే కాకుండా పశువులకు తాగునీరు, గ్రామ ప్రజలకు అవసరమైన త్రాగునీటి వనరులు కూడా మెరుగుపడతాయని ఆయన పేర్కొన్నారు. రైతులు బాగుంటేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని, రైతు సంక్షేమం కోసం ఎల్లప్పుడూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండలం టీడీపీ కూటమి, బొమ్మలాపురం గ్రామ పార్టీ నాయకులు, రైతులు, మరియు అధికారులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గూడెం కొత్త వీధి సమస్యలపై రాష్ట్ర జానపద కళలు సృజనాత్మక అకాడమీ చైర్మన్ కు వినతిపత్రం



**అల్లూరి జిల్లా గూడెం కొత్త వీధి మార్చి 25 ప్రజా ప్రతిభ**

గూడెం కొత్తవీధి మండలంలో అనేక సమస్యల మీద ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జానపద కళలు మరియు సృజనాత్మక అకాడమీ చైర్మన్ డాక్టర్ వంపూరు గంగులయ్య కి వినతి పత్రం అందించడం జరిగింది. మండలంలో ఉన్నటువంటి రోడ్లు,డ్రైనేజ్ పలు అనేక సమస్యల మీద అరకు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొర్లె వీరవెంకట్ ఆధ్వర్యంలో గడుతురి పరమేశ్వర రావు, గబులంగి గణేష్ గంగులయ్య కి అందించడం జరిగింది. కూటమి ప్రభుత్వం దృష్టిలో అలాగే జనసేన పార్టీ అధినేత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టిలో పెట్టి సమస్యల పరిష్కారం కోసం కృషి చెయ్యాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి ఉల్లి సీతారాం, సీదేరి రామమూర్తి, వసుపరీ ప్రసాద్ రఘునాథ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## 28న కొనకలమిట్ల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

**మార్కాపురం జిల్లా ప్రతినిధి / కొండ్రు వెంకటేశ్వర్లు, మార్చి 25 ( ప్రజా ప్రతిభ)**

కొనకనమిట్ల మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 28న ఉదయం 10 గంటలకు ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో డి ఈశ్వరమ్మ తెలిపారు. గ్రామాల అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలు, పనుల పురోగతిపై సమావేశంలో సమీక్షిస్తామని పేర్కొన్నారు.ప్రభుత్వ అధికారులు తమ శాఖల నివేదికలతో సమావేశానికి హాజరుకావాలని సూచించారు. ఈ కార్యక్రమానికి జెడ్పిటిసి సభ్యులు, వైస్ ఎంపీపీలు, సర్పంచులు,ఎంపీటీసీ సభ్యులు పాల్గొనాలని ఎంపిడిఓ కోరారు

## గొట్లగట్టు రామాలయంలో నయనానందకరంగా సీతారాముల అలంకరణ



**మార్కాపురం జిల్లా ప్రతినిధి / కొండ్రు వెంకటేశ్వర్లు, మార్చి 25,( ప్రజా ప్రతిభ)**

గొట్లగట్టు గ్రామంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం భక్తి భావంతో పులకించిపోయింది. శ్రీరామనవమి సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారిని మరియు అమ్మవారిని అత్యంత రమణీయంగా ముస్తాబు చేశారు. ఈ అలంకరణను తిలకించడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో వేద పండితుల మంత్రోచ్ఛారణలు, భజన మండలి వారి కీర్తనలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ వారు అన్ని ఏర్పాట్లు చేశారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు ఆయన కృపకు పాత్రులై తన్మయత్వం చెందారు.

# గిద్దలూరులో బంపర్ అవకాశం

### - ఆస్తి పన్ను వడ్డీపై సగం రాయితీ, మార్చి 31లోపు చెల్లించండి




**మార్కాపురం జిల్లా బ్యూరో / లుంజల శేఖర్ , మార్చి 25 (ప్రజా ప్రతిభ):**

మార్కాపురం జిల్లా, గిద్దలూరు పట్టణంలోని ఆస్తి పన్ను బకాయిదారులకు ప్రభుత్వం అరుదైన అవకాశాన్ని కల్పించింది. ఏళ్లుగా పేరుకుపోయిన పన్ను బకాయిలపై వడ్డీకి 50 శాతం రాయితీ ప్రకటించడంతో ప్రజల్లో ఆసక్తి నెలకొంది.ఈ అవకాశాన్ని తప్పక వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఈవి రమణబాబు తెలిపారు.మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మార్చి 31లోపు పాత బకాయిలతో పాటు ప్రస్తుత సంవత్సర పన్నును ఒకేసారి చెల్లిస్తేనే ఈ రాయితీ వర్తిస్తుందని స్పష్టం చేశారు. గడువు దాటిన తర్వాత ఎలాంటి రాయితీ ఉండదని, పూర్తి వడ్డీతోనే పన్నులు చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు.ఈ రాయితీ ద్వారా పన్ను చెల్లింపుదారులు గణనీయమైన వడ్డీ భారం నుంచి ఉపశమనం పొందవచ్చని తెలిపారు. దీన్ని సువర్ణావకాశంగా భావించి ప్రతి బకాయిదారు వెంటనే స్పందించాలని సూచించారు.అలాగే కుళాయి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు, వ్యాపార అనుమతి ఫీజులు కూడా ఆలస్యం చేయకుండా చెల్లించాలని పిలుపునిచ్చారు.గిద్దలూరు పట్టణ అభివృద్ధి కోసం ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని కమిషనర్ పేర్కొన్నారు. ప్రజలు చెల్లించే పన్నులతోనే రహదారులు, కాలువలు, తాగునీరు, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయని వివరించారు.ప్రస్తుతం లభిస్తున్న ఈ రాయితీని వినియోగించుకుని బకాయిలను క్లియర్ చేసుకోవడం ద్వారా వ్యక్తిగతంగా ప్రయోజనం పొందడమే కాకుండా, పట్టణ అభివృద్ధికి కూడా తోడ్పడాలని ప్రజలను కోరారు. రేపటి తరాలకు మెరుగైన గిద్దలూరును అందించాలంటే ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.

# దశాబ్దాల భూ సమస్యకు ముగింపు

### - ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి చొరవ ఫలితం



**మార్కాపురం జిల్లా బ్యూరో / లుంజల శేఖర్ , మార్చి 25 (ప్రజా ప్రతిభ):**

మార్కాపురం జిల్లా, గిద్దలూరు పట్టణంలోని రేడియో బావి సెంటర్ వాసులు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న భూ సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి చొరవతో సర్వే నెంబర్ 435/1లో ఉన్న ప్రైవేటు ఆస్తులపై ఉన్న ఆంక్షలు తొలగించబడటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.గిద్దలూరు పట్టణంలోని రేడియో బావి సెంటర్ పరిధిలో అనేక ఇళ్ల, స్థలాలు సర్వే నెంబర్ 435/1 కింద ఉన్నాయి. అయితే గతంలో జరిగిన సాంకేతిక పొరపాట్ల వల్ల ఈ భూములు స్థానిక అభయ ఆంజనేయ స్వామి ఆలయానికి చెందిన భూముల జాబితాలో నిషేధిత ఆస్తులుగా నమోదు కావడంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.ఈ కారణంగా తమ సొంత ఆస్తులను అమ్మడం, కొనుగోలు చేయడం, రిజిస్ట్రేషన్ చేయించుకోవడం వంటి విషయాల్లో ఏళ్ల తరబడి ఆటంకాలు ఎదురయ్యాయి. ఆస్తి పత్రాలు ఉన్నప్పటికీ వాటిపై పూర్తి హక్కులు వినియోగించుకోలేని పరిస్థితి నెలకొంది. అత్యవసర పరిస్థితుల్లో కూడా ఆస్తులను వినియోగించుకోలేక ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు.ఈ సమస్యను స్థానిక ప్రజలు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి పరిష్కారానికి కృషి ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ ను పలుమార్లు కలిసి సమస్య తీవ్రతను వివరించారు.రెవెన్యూ, దేవాదాయ శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహించి భూముల అసలు స్వరూపంపై సమగ్ర పరిశీలన చేపట్టేలా చర్యలు తీసుకున్నారు.ప్రైవేటు ఆస్తులని నిరూపించే పత్రాలను సేకరించడంలో ప్రజలకు అండగా నిలిచి, సంబంధిత అధికారులకు ఆధారాలు సమర్పించారు. సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వ స్థాయిలో నిరంతరంగా ప్రయత్నాలు కొనసాగించారు. ఈ కృషి ఫలితంగా సర్వే నెంబర్ 435/1లో ఉన్న ఆస్తులపై ఉన్న ఆంక్షలను తొలగిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ అయ్యాయి.కలెక్టర్ ఉత్తర్వుల మేరకు తహసీల్దార్ కార్యాలయం ఆన్లైన్ రికార్డుల్లో అవసరమైన మార్పులు చేయడంతో ఇకపై ఆ ప్రాంత ప్రజలు తమ ఆస్తులను ఎలాంటి ఆటంకాలు లేకుండా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. అలాగే క్రయవిక్రయాలు స్వేచ్ఛగా జరుపుకునే వీలుకూడా కలిగింది.ఏళ్ల తరబడి వెంటాడిన సమస్య పరిష్కారం కావడంతో రేడియో బావి సెంటర్ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమకు న్యాయం జరిగేలా కృషి చేసిన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. దశాబ్దాలుగా ఉన్న సమస్యను పరిష్కరించి తమ కుటుంబాలకు భరోసా కల్పించిన చర్యలను కొనియాడుతున్నారు.

## శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి

# దేవస్థానం హుండీ లెక్కింపు

### - 91 రోజుల్లో 10 లక్షల 81,510 రూపాయల ఆదాయం.



**మార్కాపురం జిల్లా బ్యూరో / లుంజల శేఖర్ , మార్చి 25,(ప్రజా ప్రతిభ):**

మార్కాపురం పట్టణంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానంలో,హుండీల లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ లెక్కింపు కార్యక్రమం కార్య నిర్వహణ అధికారి గొలమారి శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో, దేవాలయ ఇన్స్పెక్టర్ ఆర్ కే చైతన్య పర్యవేక్షణలో సాగింది.ఈ సందర్భంగా అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం, గతంలో 84 రోజుల వ్యవధిలో హుండీ ద్వారా 6 లక్షల 33,012 రూపాయల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. అయితే తాజా లెక్కింపులో 91 రోజుల వ్యవధికి గాను 10 లక్షల 81,510 రూపాయలు వచ్చినట్లు వెల్లడించారు.భక్తుల నుంచి పెరుగుతున్న ఆదరణతో దేవస్థానానికి వచ్చే హుండీ ఆదాయం గణనీయంగా పెరిగినట్లు అధికారులు పేర్కొన్నారు. పండుగలు, ప్రత్యేక పూజలు, వారాంతాల్లో భక్తుల రద్దీ పెరగడం దీనికి ప్రధాన కారణమని తెలిపారు.దేవస్థాన అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ఈ నిధులను వినియోగించనున్నట్లు కార్య నిర్వహణ అధికారి వెల్లడించారు.

# రోడ్డు ప్రమాదాల నియంత్రణే లక్ష్యం

### - శబ్ద ప్రకటనల ద్వారా విస్తృత అవగాహన.

**ప్రకాశం జిల్లా బ్యూరో / కుందురు శ్రీనివాసరెడ్డి, మార్చి 25 (ప్రజా ప్రతిభ):**






ప్రకాశం జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించడం ప్రధాన లక్ష్యంగా జిల్లా ఎస్పీ పలు వినూత్న చర్యలను అమలు చేస్తున్నారు. ముఖ్యంగా శబ్ద ప్రకటనల వ్యవస్థ ద్వారా వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలపై విస్తృతంగా అవగాహన కల్పించడం ప్రారంభించారు. ఈ కార్యక్రమం జిల్లాలోని ప్రధాన ప్రాంతాల్లో వేగంగా అమలు అవుతోంది.ఒంగోలు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, చర్చి సెంటర్, మంగమూరు రోడ్డు, టంగుటూరు టోల్ గేట్ వంటి రద్దీ ప్రదేశాలతో పాటు జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్ పరిధుల్లో శబ్ద ప్రకటనల ద్వారా ప్రజలకు సూచనలు అందిస్తున్నారు. వాహనదారులను ప్రత్యక్షంగా నిలిపి మాట్లాడటం, ప్రమాదాల కారణాలు వివరించడం, జాగ్రత్తలు చెప్పడం వంటి చర్యలతో పోలీసులు అవగాహన పెంచుతున్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, రోడ్డు మీద వాహనం నడిపే ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ కట్టుకోవాలని తెలిపారు. డ్రైవింగ్ చేస్తూ ఫోన్ మాట్లాడటం అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు. అలాంటి నిర్లక్ష్యం వల్ల ప్రాణ నష్టం మాత్రమే కాకుండా కుటుంబాలు తీవ్రంగా దెబ్బతింటాయని వివరించారు.సర్వీస్ రోడ్డు నుంచి జాతీయ రహదారిపైకి చేరే సమయంలో వాహనదారులు తప్పనిసరిగా వాహనాన్ని ఆపి, ఇరువైపులా పరిశీలించి మాత్రమే ముందుకు సాగాలని సూచించారు. నిర్లక్ష్యంగా రోడ్డు దాటడం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఎడమ వైపునే ప్రయాణిస్తూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు.మద్యం సేవించి వాహనం నడపడం అత్యంత ప్రమాదకరమని, అలాంటి ఘటనలు కుటుంబాలకు అపారమైన విషాదాన్ని మిగులుస్తాయని అన్నారు. జాతీయ రహదారులపై నిర్దేశిత ప్రదేశాల్లోనే వాహనాలను నిలపాలని, ఇతరులకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.డ్రైవింగ్ సమయంలో కుటుంబ సభ్యులను గుర్తు చేసుకుంటూ నిదానంగా ప్రయాణించాలని, ప్రతి ప్రయాణం సురక్షితంగా ముగియాలని కోరారు. శబ్ద ప్రకటనల ద్వారా ప్రజలకు నిరంతరం అవగాహన కల్పిస్తున్నామని, ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెరిగితేనే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించగలమని తెలిపారు.భవిష్యత్తులో కూడా ఇలాంటి అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. జిల్లాలో రోడ్డు భద్రతపై ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు పోలీస్ శాఖ కట్టుబడి ఉందని వెల్లడించారు.

# ప్రతి ఆర్టిసి బస్టాండ్‌లో రక్షిత మంచినీరు

### - జోనల్ చైర్మన్ ఓ.సురేష్ కుమార్



**మార్కాపురం జిల్లా ప్రతినిధి / కొండ్రు వెంకటేశ్వర్లు, మార్చి 25,( ప్రజా ప్రతిభ)**

నెల్లూరు జోనల్ పరిధిలోని ప్రతి ఆర్టిసి బస్టాండ్‌లో ప్రయాణికులకు మెరుగైన రక్షిత మంచినీటి సౌకర్యం కల్పించడమే తమ లక్ష్యమని ఆర్టిసి జోనల్ చైర్మన్ ఓ.సురేష్ కుమార్ అన్నారు. బుధవారం పొదిలి బస్టాండ్‌లో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన నూతన ఆర్.ఓ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు ఆర్టిసి నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ముఖ్యంగా రాబోయే ఏప్రిల్ నెల నాటికి జోనల్ పరిధిలోని అన్ని బస్టాండ్లలో దాతల సహకారంతో ఆర్.ఓ ప్లాంట్లను అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'స్త్రీ శక్తి' పథకం కారణంగా బస్సులలో ప్రయాణికుల రద్దీ గణనీయంగా పెరిగిందని సురేష్ కుమార్ పేర్కొన్నారు. ఈ పెరిగిన రద్దీకి అనుగుణంగా ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా త్వరలోనే కొత్త బస్సులను ప్రవేశపెట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. బస్టాండ్లలో మౌలిక సదుపాయాల కల్పనకు తమ ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్టిసి రీజనల్ మేనేజర్ సత్యనారాయణ, బిజెపి నాయకులు బెల్లంకొండ విజయలక్ష్మి, బాషా, మరియు పొదిలి, కనిగిరి, గిద్దలూరు ప్రాంతాలకు చెందిన ఆర్టిసి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కంభంలో ప్రైవేట్ ఆసుపత్రుల దారుణ నిర్లక్ష్యం

## ఎల్లో మీడియా కథనాలతో అధికారులపై కక్షసాధింపా

### చంద్రబాబు తీరుపై తాటిపర్తి చంద్రశేఖర్ తీవ్ర విమర్శలు.




ప్రకాశం జిల్లా బ్యూరో / కుందురు శ్రీనివాసరెడ్డి, మార్చి 25, (ప్రజా ప్రతిభ):

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పాలన పూర్తిగా ఎల్లో మీడియా కట్టుకథల ఆధారంగా నడుస్తోందని, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను లక్ష్యంగా చేసుకుని కక్షసాధింపులకు దిగుతోందని వైయస్ఆర్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన, ఆధారంలేని కథనాలను నమ్ముకుని ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేయడం రాష్ట్రానికి మంచిది కాదని స్పష్టం చేశారు. ఒక ఎల్లో మీడియా కథనాన్ని ఆధారంగా చేసుకుని అధికారులను బదిలీ చేయడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. మాజీ సీఎస్ జవహర్ రెడ్డి నెల్లూరుకు వెళ్లకపోయినా, ఆయన అక్కడ ఐఏఎస్ అధికారులతో సమావేశం నిర్వహించారనే తప్పుడు వార్తను ప్రచారం చేశారని తెలిపారు. ఆ వార్తను నిజమని నమ్మి నీలకంఠారెడ్డి వంటి నిజాయితీ గల అధికారులను, బదిలీ చేయడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఉన్నప్పటికీ, నిజానిజాలు తెలుసుకోకుండా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవడం బాధాకరమని వ్యాఖ్యానించారు. నెల్లూరులో జరగని సమావేశంపై ప్రభుత్వం ఉలిక్కిపడటం, అనుమానాలతో వ్యవహరించడం పాలనలో అస్థిరతను చూపుతోందని అన్నారు. ఒక వివాహ కార్యక్రమానికి హాజరైన అధికారిపై కూడా ఆధారంలేని కథనాలు సృష్టించి, వాటిని కారణంగా చూపించి చర్యలు తీసుకోవడం సరికాదని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో పనిచేసిన అధికారులను మాత్రమే లక్ష్యంగా చేసుకోవడం రాజకీయ ప్రతీకార ధోరణికి నిదర్శనమని చెప్పారు. అధికారుల సేవలను గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సూచించారు. వైఎస్ జగన్ హయాంలో ప్రతిపక్ష భావజాలం ఉన్న అధికారులను కూడా పదవుల్లో కొనసాగించి, వారికి కీలక బాధ్యతలు అప్పగించిన విషయాన్ని గుర్తు చేశారు. పరిపాలనలో నిష్పక్షపాత ధోరణి పాటించడం అప్పటి ప్రభుత్వ లక్షణమని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం మాత్రం మీడియా కథనాలను ఆధారంగా చేసుకుని జీఓలు మార్చుతూ, అధికారులను వేధిస్తోందని ఆరోపించారు. నివేదికలను పక్కనపెట్టి, ఇంటి చాడీలు ఆధారంగా నిర్ణయాలు తీసుకోవడం పరిపాలనా వ్యవస్థకు ప్రమాదకరమని హెచ్చరించారు. పాలనలో పారదర్శకత లేకపోవడం, అనుమానాల వాతావరణం నెలకొనడం వల్ల అధికార యంత్రాంగం సైతం అసౌకర్యానికి గురవుతోందని చెప్పారు. పాలనలో కక్షసాధింపులు పెరిగాయని, ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదని వ్యాఖ్యానించారు. గతంలో ప్రతి ఇంటికి రేషన్ డోర్ డెలివరీ అందించిన ప్రభుత్వం, ప్రజల సంక్షేమాన్ని ప్రధానంగా తీసుకువెళ్లిందని చెప్పారు. ఇప్పుడు మాత్రం ప్రతి గడపకూ కక్ష రాజకీయాలు తీసుకువస్తోందని విమర్శించారు. భారీ మెజార్టీ ఉన్నప్పటికీ ప్రభుత్వం ధైర్యంగా ముందుకు సాగలేకపోతోందని, అధికార యంత్రాంగం పైనే కాకుండా భాగస్వామి నేతలపైనా అనుమానాలతో వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. ఇది పాలనా వైఫల్యానికి సంకేతమని, ప్రజల విశ్వాసాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం పక్కనపడి, రాజకీయ ప్రతీకార చర్యలు ప్రధాన అజెండాగా మారడం ఆందోళనకరమని చంద్రశేఖర్ అన్నారు. ప్రభుత్వం తక్షణమే తన విధానాలను మార్చుకుని, వాస్తవాల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలని, అధికారులపై అనవసర ఒత్తిడి, వేధింపులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

## 2029లో మహిళా రిజర్వేషన్ అమలు స్వాగతం

### - మహిళా సాధికారతే లక్ష్యం అని వైయస్ జగన్ స్పష్టం.



ప్రకాశం జిల్లా బ్యూరో / కుందురు శ్రీనివాసరెడ్డి, మార్చి 25,(ప్రజా ప్రతిభ):

మహిళలకు రాజకీయాల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పించే దిశగా తీసుకొచ్చిన మహిళా రిజర్వేషన్ చట్ట అమలును 2029 నాటికి అమల్లోకి తీసుకురావడం పట్ల వైయస్ఆర్సీపీ అధినేత, మాజీ సిఎం వైయస్ జగన్ హర్షం వ్యక్తం చేశారు. మహిళా సాధికారతే తమ పార్టీ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్ చట్టం 2023లో ప్రతిపాదించిన సవరణలను హృదయపూర్వకంగా సమర్థిస్తున్నట్లు తెలిపారు. అసెంబ్లీ, లోక్‌సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే ఈ నిర్ణయం దేశ ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు. మహిళలు రాజకీయాల్లో కీలక పాత్ర పోషించే దిశగా ఇది చారిత్రాత్మక ముందడుగు అని అభిప్రాయపడ్డారు. మహిళల సాధికారతకు వైయస్ఆర్సీపీ ఎప్పటి నుంచో ప్రాధాన్యత ఇస్తోందని గుర్తు చేశారు. స్థానిక సంస్థల్లో, నామినేటెడ్ పదవుల్లో, అలాగే నామినేషన్ ఆధారంగా ఇచ్చే పనులు, సేవా కాంట్రాక్టుల్లో 50 శాతం రిజర్వేషన్లు అమలు చేసి దేశానికి ఆదర్శంగా నిలిచామని వివరించారు. ఈ విధానం ద్వారా మహిళలు సామాజిక, ఆర్థిక రంగాల్లో ముందుకు వచ్చినట్లు తెలిపారు. దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీసుకొచ్చిన ఈ నిర్ణయం మహిళల శక్తివంతీకరణకు దోహదపడుతుందని పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలని, సమాన హక్కులతో రాజకీయాల్లోనూ సక్రియ పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ప్రతి స్థాయిలో మహిళలకు నాయకత్వ అవకాశాలు కల్పించడం ద్వారానే సమగ్ర అభివృద్ధి సాధ్యమని వైయస్ జగన్ తెలిపారు. మహిళల భాగస్వామ్యం పెరిగితే పాలనలో పారదర్శకత, బాధ్యత పెరుగుతాయని అన్నారు. మహిళా రిజర్వేషన్ అమలు దేశ రాజకీయ వ్యవస్థలో కొత్త మార్పులకు నాంది పలుకుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

## మార్కాపురంలో ఎల్ఐసీ అవగాహన ర్యాలీ

### - 'నవజీవన్ శ్రీ' గడువు ఈ నెల 31తో ముగింపు




మార్కాపురం జిల్లా ప్రతినిధి / కొండ్రు వెంకటేశ్వర్లు, మార్చి 25 ( ప్రజా ప్రతిభ)

భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) ప్రతిష్టాత్మకమైన 'నవజీవన్ శ్రీ' ప్లాన్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బుధవారం మార్కాపురం పట్టణంలో ఎల్ఐసీ అధికారులు, ఏజెంట్లు కలిసి భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎల్ఐసీ కార్యాలయం నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ ప్రధాన వీధుల గుండా సాగింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, సింగిల్ ప్రీమియం మరియు లిమిటెడ్ ప్రీమియం సదుపాయం ఉన్న 'నవజీవన్ శ్రీ' (ప్లాన్ నెం. 911, 912) పాలసీలు అత్యంత లాభదాయకమైనవని పేర్కొన్నారు. అయితే, ఈ ప్లాన్లను పొందేందుకు మార్చి 31వ తేదీ వరకు మాత్రమే గడువు ఉందని, ఆ తర్వాత ఈ ప్లాన్లు అందుబాటులో ఉండవని వారు స్పష్టం చేశారు. చిన్న వయస్సు నుండే పాలసీ తీసుకోవడం ద్వారా పిల్లల ఉన్నత చదువులకు, పెళ్లిళ్లకు భారీ నిధిని సమకూర్చుకోవచ్చని వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగింపుతో పాటు ఈ ప్లాన్ కూడా నిలిపివేయబడుతున్నందున, పాలసీదారులు త్వరపడాలని కోరారు. "నవజీవన్ శ్రీలో పెట్టుబడి, మీ పిల్లల బంగారు భవిష్యత్తుకు రాబడి" అనే నినాదాలతో ప్రజలకు అవగాహన కల్పించారు. ర్యాలీలో ఎల్ఐసీకి చెందిన ఇతర ప్రసిద్ధ ప్లాన్లు అయిన జీవన్ ఆనంద్, జీవన్ శాంతి, అమృత బాల్, మరియు జీవన్ ఉత్సవ్ గురించి కూడా కరపత్రాల ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ఏబీఎం (సేల్స్) ఖాదర్ మస్తాన్, లియాపి ప్రెసిడెంట్ పి బాల నర్సయ్య, కార్యదర్శి ఏ. రఘురామ్, కోశాధికారి జి. నారాయణ రెడ్డి, డెవలప్మెంట్ అధికారులు, పెద్ద సంఖ్యలో ఎల్ఐసీ ఏజెంట్లు మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### - కాలం చెల్లిన మందులతో చిన్నారి ప్రాణాలకు ముప్పు

### - రెండుసార్లు తనిఖీలు నిర్వహించిన వైద్యశాఖ.





ప్రకాశం జిల్లా బ్యూరో / కుందూరు శ్రీనివాసరెడ్డి, మార్చి 25, (ప్రజా ప్రతిభ):

మార్కాపురం జిల్లా, కంభం పట్టణంలో ప్రైవేట్ వైద్యశాలల నిర్లక్ష్యం బహిర్గతమై,ప్రజల్లో తీవ్ర ఆందోళనకు దారితీసింది. అధిక ఖర్చుతో వైద్యం అందిస్తున్నామని చెప్పుకుంటూ ప్రజల నమ్మకాన్ని దోపిడీగా మార్చుకుంటున్న కొన్ని ఆసుపత్రులు, కాలం చెల్లిన మందులు విక్రయిస్తూ ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ఘటన బయటపడింది. కంభం అర్బన్ కాలనీకి చెందిన షేక్ ఫరీద్ తన 18 నెలల పాపకు జ్వరం రావడంతో ఈ నెల 6న పట్టణంలోని మల్లికార్జున మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రికి తీసుకెళ్లాడు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించిన సిబ్బంది చికిత్స అందించి, పాప బలహీనంగా ఉందని పేర్కొంటూ ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న మెడికల్ షాపులో నుంచి సిరప్ కొనుగోలు చేయాలని సూచించారు. తల్లిదండ్రులు అదే విధంగా మందు కొనుగోలు చేసి ఇంటికి తీసుకెళ్లారు. ఈ నెల 9న ఆ సిరప్‌ను చిన్నారికి ఇచ్చిన కొద్ది సేపటికే వాంతులు, విరోచనాలు ప్రారంభమయ్యాయి. చిన్నారి పరిస్థితి క్షీణించడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. వెంటనే మందు బాటిల్‌ను పరిశీలించగా, అది కాలం చెల్లినదిగా గుర్తించారు. దీంతో వెంటనే చిన్నారిని తిరిగి అదే ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ మళ్లీ చికిత్స అందించిన సిబ్బంది, రక్త పరీక్షలు చేయించాలని సూచించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే కాలం చెల్లిన మందు ఇవ్వడం వల్లే చిన్నారి అనారోగ్యానికి గురైందని తల్లిదండ్రులు ప్రశ్నించగా, స్పష్టమైన సమాధానం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో తల్లిదండ్రులు ప్రభుత్వ ఆసుపత్రిని ఆశ్రయించారు. అక్కడ నిర్వహించిన పరీక్షలలో, కాలం చెల్లిన సిరప్ వినియోగం వల్లే వాంతులు, విరోచనాలు వచ్చిన అవకాశముందని వైద్యులు అభిప్రాయపడ్డారు. దీంతో ఈ ఘటన మరింత తీవ్రతరమైంది. తల్లిదండ్రులు మీడియాతో మాట్లాడుతూ, ఖరీదైన చికిత్స పేరుతో ప్రజలను ఆకర్షిస్తున్న ప్రైవేట్ ఆసుపత్రులు, కనీస జాగ్రత్తలు కూడా పాటించకుండా ప్రమాదకర పరిస్థితులకు దారి తీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ఇలాంటి ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై పీజీఆర్ఎస్ ద్వారా ఫిర్యాదు చేయడంతో పాటు జిల్లా వైద్యశాఖకు కూడా వివరాలు అందజేశారు. ఈ ఘటన సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ప్రజల్లో తీవ్ర చర్చకు దారితీసింది. పలు వార్తా ఛానెల్లు కూడా ఈ విషయాన్ని ప్రసారం చేయడంతో వైద్యశాఖ అప్రమత్తమైంది. బాధితుడి ఫిర్యాదు, మీడియా కథనాల నేపథ్యంలో జిల్లా వైద్యశాఖ వెంటనే స్పందించింది. జిల్లా వైద్యశాఖాధికారి ఆదేశాల మేరకు ఈ నెల 13న వైద్యాధికారుల బృందం మల్లికార్జున మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో తనిఖీలు చేపట్టింది. మందుల నిల్వలు, గడువు తేదీలు, రికార్డులు, రిజిస్ట్రేషన్లు, చికిత్స విధానం వంటి అంశాలపై ప్రాథమికంగా పరిశీలించారు. అనంతరం మంగళవారం అయిన మార్చి 25న మరోసారి ఆసుపత్రిలో విస్తృత స్థాయి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మందుల స్టాక్ రిజిస్టర్లు, కొనుగోలు బిల్లులు, ఫార్మసీ నిర్వహణ, లైసెన్స్ నిబంధనలు, వైద్య సేవల ప్రమాణాలపై సమగ్రంగా పరిశీలించినట్లు సమాచారం. కఠిన చర్యలపై దృష్టి సరించిన అధికారులు, తనిఖీలలో బయటపడిన అంశాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకునే అవకాశముందని వైద్యశాఖ వర్గాలు వెల్లడించాయి. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే జరిమానాలు విధించడం, లైసెన్స్ రద్దు వంటి చర్యలు కూడా తీసుకునే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటన నేపథ్యంలో కంభం పట్టణంలో ప్రైవేట్ ఆసుపత్రులపై ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఖరీదైన చికిత్స అందిస్తున్న సంస్థలు కనీస నాణ్యత ప్రమాణాలు పాటించకపోతే ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడే పరిస్థితి ఏర్పడుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేట్ వైద్యశాలలపై పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలని ప్రజలు కోరుతున్నారు. తరచూ తనిఖీలు నిర్వహిస్తూ, కాలం చెల్లిన మందుల విక్రయాన్ని పూర్తిగా అరికట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వైద్య సేవల నాణ్యతను కాపాడేందుకు కఠిన చర్యలు తప్పనిసరిగా అవసరమని అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ ఘటన ప్రైవేట్ వైద్య రంగంలో ఉన్న లోపాలను మరోసారి వెలుగులోకి తెచ్చింది. ప్రజల ఆరోగ్య భద్రతను పరిరక్షించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం స్పష్టమవుతోంది.

## సబ్ జైలులో సమగ్ర తనిఖీ ఖైదీల సమస్యలపై విస్తృతంగా చర్చ

మార్కాపురం జిల్లా బ్యూరో / లుంజల శేఖర్ , మార్చి 25, (ప్రజా ప్రతిభ):



మార్కాపురంలోని సబ్ జైలును జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ షేక్ ఇబ్రహీం షరీఫ్ విస్తృతంగా తనిఖీ చేశారు. జైలు పరిసరాలను మొత్తం పరిశీలిస్తూ భద్రతా ఏర్పాట్లు, ఖైదీలకు కల్పిస్తున్న వసతులు, ఆహారం, తాగునీరు, పారిశుధ్య పరిస్థితులను సూక్ష్మంగా పరిశీలించారు. జైలులో ఉన్న ప్రతి విభాగాన్ని సందర్శించి, ఖైదీల నివాస గదులు, వంటశాల, వైద్య విభాగం పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా విచారణ ఖైదీలు, శిక్ష అనుభవిస్తున్న ఖైదీలతో విడిగా మాట్లాడారు. వారి వ్యక్తిగత సమస్యలు, కేసుల పురోగతి, బెయిల్ అవకాశాలు, న్యాయ సహాయం అవసరాలపై వివరంగా అడిగి తెలుసుకున్నారు. కొన్ని కేసుల్లో ఆలస్యం జరుగుతోందని ఖైదీలు తెలియజేయగా, వాటిని త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. న్యాయ సహాయం అందక ఇబ్బందులు పడుతున్న వారికి ఉచిత న్యాయ సేవలు అందేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. జైలులో ఖైదీలకు అందిస్తున్న ఆహారం నాణ్యత, సమయపాలన, వైద్య సేవల లభ్యతపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. అనారోగ్యంతో ఉన్న ఖైదీలకు తక్షణ వైద్య చికిత్స అందించాలని, అవసరమైతే బయట ఆసుపత్రులకు తరలించే ఏర్పాట్లు చేయాలని సూచించారు. పారిశుధ్యం విషయంలో మరింత జాగ్రత్తలు తీసుకోవాలని, తాగునీటి సదుపాయాలు మెరుగుపరచాలని ఆదేశించారు. అనంతరం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఖైదీలను ఉద్దేశించి మాట్లాడారు. మానవ జన్మ ఎంతో విలువైనదని, మంచి చెడులను గుర్తించే సామర్థ్యం ప్రతి మనిషిలో ఉండాలని తెలిపారు. తప్పులు చేయడం వల్ల జీవితం మారిపోతుందని, కానీ మార్పు సాధ్యమేనని, ప్రతి ఒక్కరూ తమ జీవితాన్ని సరిదిద్దుకునే అవకాశం ఉందని చెప్పారు. తప్పు మార్గాలను విడిచిపెట్టి సన్మార్గంలో నడవాలని, భవిష్యత్తులో సమాజంలో గౌరవంగా జీవించేందుకు కృషి చేయాలని సూచించారు. జైలులో గడిపే సమయాన్ని వృథా చేయకుండా చదువు, నైపుణ్యాలు నేర్చుకోవడంపై దృష్టి పెట్టాలని, ఇది భవిష్యత్తులో ఉపాధికి ఉపయోగపడుతుందని వివరించారు. న్యాయ అవగాహన పెంపొందించుకోవడం ద్వారా తమ హక్కులను తెలుసుకుని సరైన మార్గంలో ముందుకు సాగవచ్చని పేర్కొన్నారు. ఖైదీలు కూడా తమ సమస్యలను స్వేచ్ఛగా వివరించారు. కొందరు కుటుంబ పరిస్థితులు, ఆర్థిక ఇబ్బందులు, కేసుల ఆలస్యంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలను నమోదు చేసి పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఖైదీలకు అవసరమైన న్యాయ సాయం అందించడంలో ఎటువంటి లోటు ఉండదని స్పష్టం చేశారు. జైలు పరిపాలన వ్యవస్థలో మరింత పారదర్శకత, బాధ్యత అవసరమని పేర్కొంటూ, ఖైదీల హక్కులను కాపాడటం ప్రతి అధికారికి బాధ్యత అని చెప్పారు. జైలు శిక్ష మాత్రమే కాకుండా మార్పుకు దారితీసే స్థలంగా ఉండాలని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో జైలు సిబ్బంది, న్యాయ విభాగ సిబ్బంది పాల్గొన్నారు. ఖైదీల సంక్షేమం, న్యాయ సహాయం, జీవన మార్పు అంశాలపై ఈ తనిఖీ ప్రాధాన్యత సంతరించుకుంది.

## నియోజకవర్గాల పునర్విభజన శుభవార్త

### - కార్యకర్తలకు పెద్దపీట, వైఎస్ జగన్

ప్రకాశం జిల్లా బ్యూరో / కుందూరు శ్రీనివాసరెడ్డి, మార్చి 25, (ప్రజా ప్రతిభ):



నియోజకవర్గాల పునర్విభజన శుభవార్త అని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేర్కొన్నారు. మహిళలకు రిజర్వేషన్లు పెరగడం, సీట్ల సంఖ్య పెరగడం ద్వారా కొత్త నాయకత్వానికి అవకాశం లభిస్తుందని తెలిపారు. కష్టపడే కార్యకర్తలకు భవిష్యత్తులో మరింత ప్రాధాన్యం ఉంటుందని స్పష్టం చేశారు. బుధవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో అద్దంకి నియోజకవర్గ నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున, అద్దంకి నియోజకవర్గ ఇంఛార్జి అశోక్ కుమార్ తో పాటు పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విధానాలపై విమర్శలు చేస్తూ, యుద్ధం పేరుతో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచుతున్నారని ఆరోపించారు. వంటనూనె ధరలు లీటరుకు సుమారు 40 రూపాయలు పెరిగాయని, పప్పుల ధరలు కిలోకు 15 రూపాయలకుపైగా పెరిగాయని తెలిపారు. గ్యాస్ సిలిండర్లు బ్లాక్ మార్కెట్‌లో 2 నుంచి 3 వేల రూపాయలకు అమ్ముతున్నారని పేర్కొన్నారు. ఇప్పుడు కిరోసిన్ ఇస్తామంటూ ప్రజలను మళ్లీ వెనక్కి నెట్టే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. వ్యవసాయ రంగం పరిస్థితి దయనీయంగా మారిందని, మొక్కజొన్న, కోకో, శెనగ, అరటి, టమోటా పంటలకు సరైన ధర లభించడం లేదన్నారు. రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల విషయంలో క్రెడిట్ దోపిడీ జరుగుతోందని ఆరోపిస్తూ, స్టీల్ ప్లాంట్ వ్యవహారంలో తాము తీసుకున్న చర్యలను ఇతరులు తమవిగా చెప్పుకుంటున్నారని విమర్శించారు. తమ పాలనలోనే పెట్టుబడులు ఆకర్షించి భూములు చూపించామని గుర్తుచేశారు. గూగుల్ వంటి సంస్థల విషయంలోనూ ఇదే తరహా ప్రచారం జరుగుతోందన్నారు. బల్క్ డ్రగ్ పార్క్ విషయాన్ని ప్రస్తావిస్తూ, భూముల వివాదం సృష్టించి ప్రాజెక్ట్ ముందుకు సాగకుండా అడ్డుకున్నారని తెలిపారు. తమ పాలనలో ప్రారంభించిన మూడు పోర్టుల పనులు ఇప్పటికీ ముందుకు సాగలేదని విమర్శించారు. పోర్టుల పరిసర ప్రాంతాల్లో మళ్లీ భూముల సేకరణకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. నియోజకవర్గాల పునర్విభజనతో పాటు మహిళలకు మరిన్ని అవకాశాలు రావడం సానుకూల పరిణామమని తెలిపారు. తమ పాలనలో మహిళలకు ఉద్యోగాలు, కాంట్రాక్టుల్లో రిజర్వేషన్లు కల్పించామని గుర్తుచేశారు. భవిష్యత్తులో కార్యకర్తలే నాయకులుగా ఎదిగేలా పార్టీ దృష్టి ఉంటుందని స్పష్టం చేశారు. జగన్ 2.0లో కష్టపడే కార్యకర్తలకు పెద్దపీట ఉంటుందని తెలిపారు.

## గురువుని మించిన శిష్యుడు, తాటిపత్రి చంద్రశేఖర్.

### - జలహారతులు కాదు, ధనహారతులే



మార్కాపురం జిల్లా బ్యూరో / లుంజల శేఖర్ , మార్చి 25,(ప్రజా ప్రతిభ):

మార్కాపురం జిల్లాలో కూటమి ప్రభుత్వ పనితీరుపై రోజురోజుకూ విమర్శలు తీవ్రమవుతున్నాయి. ప్రకృతి వనరుల దోపిడీ, అక్రమ రవాణాలు,వాటాల రాజకీయాలు పరాకాష్టకు చేరుకున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా మార్కాపురం జిల్లా పరిధిలోని ఎర్రగొండపాలెం ఈ వ్యవహారాల్లో కేంద్రంగా మారిందని స్థానికులు బహిరంగంగా చెబుతున్నారు. మట్టి, ఇసుక, మద్యం, బియ్యం అక్రమ రవాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయని, వాటిలో భాగస్వామ్యం ఉన్నవారికి రాజకీయ అండదండలు ఉన్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బుధవారం దోర్నాల మండలం పెద్ద బొమ్మలాపురం గ్రామంలో చెరువులకు నీళ్ల విడుదల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఇన్చార్జి ఎరిక్షన్ బాబు కాళ్లకు చెప్పులు వేసుకుని జలహారతి ఇవ్వడం వివాదానికి దారితీసింది. సంప్రదాయాలకు విరుద్ధంగా జరిగిన ఈ చర్యను గ్రామస్తులు తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పూజా విధానాల్లో కనీస మర్యాదలు పాటించకుండా వ్యవహరించడం ప్రజల భావోద్వేగాలను దెబ్బతీసిందని వారు అంటున్నారు. గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు ఈ ఘటనపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఇది అహంకారానికి నిదర్శనం అని విమర్శిస్తున్నారు. అదే ధోరణి ఇప్పుడు గ్రామస్థాయి కార్యక్రమాల్లో కూడా కనిపిస్తోందని వ్యాఖ్యానిస్తున్నారు. ఇక గ్రామాల పర్యటనల వెనుక అసలు ఉద్దేశ్యం కలెక్షన్లేననే ఆరోపణలు మరింత బలంగా వినిపిస్తున్నాయి. చెరువుల పనులు, మట్టి తవ్వకాలు, బియ్యం కొనుగోళ్లు, మద్యం వ్యాపారాల్లో ఉన్న స్థానిక నాయకుల వద్ద నుంచి వసూళ్లు చేయడానికే పర్యటనలు నిర్వహిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని కొంతమంది టీడీపీ నాయకులే అంతర్గతంగా చర్చించుకుంటున్నారని సమాచారం. గ్రామాల్లో జరిగే ప్రతి పనిలో వాటాలు కేటాయించుకుని లాభాలు పంచుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. పల్లెల్లో అక్రమాలు విస్తృతంగా పెరిగిపోతున్నా, వాటిపై కట్టడి చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రభుత్వ యంత్రాంగం కళ్లముందే ప్రకృతి వనరుల దోపిడీ జరుగుతున్నా చర్యలు లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. చెరువులు, పంట పొలాలు, నదీ పరివాహక ప్రాంతాలు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్ తరాలకు మిగిలేది శూన్యమవుతుందని వారు హెచ్చరిస్తున్నారు. మరోవైపు గ్రామాల్లో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు అందడం లేదని స్థానికులు చెబుతున్నారు. తాగునీరు, రహదారులు, విద్యుత్ వంటి ప్రాథమిక సమస్యలు పరిష్కారం కాకుండానే రాజకీయ నాయకులు తమ ప్రయోజనాల కోసం మాత్రమే తిరుగుతున్నారని విమర్శలు వస్తున్నాయి. ప్రజల సమస్యలను పక్కనపెట్టి, అక్రమ కార్యకలాపాలకు ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోంది. గ్రామ స్థాయిలోనే వ్యతిరేక స్వరాలు వినిపిస్తున్నాయి. పారదర్శక పాలన, అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వంపై నమ్మకం కోల్పోతున్నామని, వెంటనే పరిస్థితిని సరిదిద్దాలని కోరుతున్నారు. ప్రజల ఆవేదనను గుర్తించి తక్షణమే చర్యలు తీసుకోకపోతే పరిస్థితులు మరింత దిగజారే ప్రమాదం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. అక్రమాలకు చెక్ పెట్టి, పారదర్శకతకు ప్రాధాన్యం ఇచ్చినప్పుడే ప్రజల విశ్వాసం తిరిగి పొందగలమని వారు సూచిస్తున్నారు.

## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..

**సెన్సెక్స్ 1205 పాయింట్ల లాభం..**

**నిఫ్టీ 394 పాయింట్లు జంప్**



**ముంబై:** భారతీయ స్టాక్ మార్కెట్లు బుధవారం లాభాల్లో ముగిశాయి. వరుసగా రెండో రోజు కూడా లాభాలు పొందడం విశేషం. బుధవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 1205 పాయింట్ల లాభంతో 75,273.45 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 394.05 పాయింట్ల లాభంతో 23,306.45 వద్ద ముగిసింది. సెన్సెక్స్ మంగళవారం 74,068.45 పాయింట్ల వద్ద ముగియగా, బుధవారం ఉదయం 74,652.01 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది.

ఒక దశలో 75,849.76 పాయింట్లను తాకింది. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. బుధవారం అంతర్జాతీయ మార్కెట్లు కూడా లాభాల్లో కొనసాగడం భారతీయ స్టాక్ మార్కెట్‌కు కలిసొచ్చింది. అలాగే ఇరాన్-అమెరికా మధ్య చర్చలు, ట్రంప్ శాంతి ప్రతిపాదన వంటి అంశాలు కూడా మార్కెట్‌కు ఊతమిచ్చాయి. ఈ పరిణామంతో అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు కాస్త తగ్గుముఖం పడుతున్నాయి. ఆసియా మార్కెట్లైన దక్షిణ కొరియా బెంచ్‌మార్క్ కోస్పి, జపాన్ నిక్కీ 225 ఇండెక్స్, షాంఘై ఎస్ఎస్ఈ కాంపోజిట్ ఇండెక్స్, హాంకాంగ్ సెంగ్ ఇండెక్స్ వంటివి బుధవారం లాభాల్లో ముగిశాయి. అల్ట్రాటెక్ సిమెంట్ లిమిటెడ్ షేర్లు అత్యధికంగా 4.39 శాతం లాభాలు పొందాయి. లార్సెన్ అండ్ టర్బో లిమిటెడ్ 4 శాతం, బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ 3.82 శాతం, టైటాన్ కంపెనీ లిమిటెడ్ 3.50 శాతం, ట్రెంట్ లిమిటెడ్ 3.39 శాతం పెరిగాయి.

టెక్ మహీంద్రా, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, టాటా కన్సల్టెన్సీ, భారత్ ఎలక్ట్రానిక్స్ వంటి కంపెనీలు నష్టాలు చవిచూశాయి. మరోవైపు తాజా పరిణామాలతో అంతర్జాతీయంగా బ్యారెల్ క్రూడాయిల్ చమురు ధర 100 డాలర్ల దిగువకు చేరింది. ఈ రోజు దాదాపు 99 డాలర్ల వద్ద ఆయిల్ ట్రేడవుతోంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 93.96గా ఉంది. అయితే, బంగారం ధరలు మాత్రం బుధవారం పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ఒక ఔన్స్ బంగారం ధర 4,554 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఔన్స్ వెండి ధర 72 డాలర్లకుపైగా కొనసాగుతోంది.

## రష్యా నుంచి భారత్‌కు 60 మిలియన్ బ్యారెళ్ల చమురు...

**వచ్చే నెలలో డెలివరీ**




**న్యూఢిల్లీ:** భారత చమురు సంస్థలు రష్యా నుంచి సుమారు 60 మిలియన్ బ్యారెళ్ల చమురును కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో మన దేశంలో ఇంధన సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా కేంద్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా రష్యా నుంచి చమురును కొనుగోలు చేస్తోంది. ఇది వచ్చే నెలలో డెలివరీ కానున్నట్లు బ్లూమ్‌బర్గ్‌లో కథనం వచ్చింది.

బ్రెంట్ క్రూడ్ ధర కంటే బ్యారెల్‌కు 5 నుంచి 15 డాలర్లు అధికంగా చెల్లించి భారత రిఫైనరీలు ఈ చమురును బుక్ చేసినట్లు ఈ కథనం పేర్కొంది. ఈ మొత్తం ఫిబ్రవరిలో చేసిన చమురు కొనుగోళ్ల కంటే రెట్టింపు అని వెల్లడించింది. రష్యా చమురుపై ఉన్న ఆంక్షలను ఇటీవల అమెరికా ఎత్తివేసింది. ఈ నేపథ్యంలో తాజా కొనుగోళ్లు జరిగాయి.

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నంత కాలం రష్యా చమురుపై ఆంక్షల మినహాయింపును అమెరికా పొడిగించే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. రష్యా నుంచి ఈ చమురు కొనుగోలుకు సంబంధించి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇరాన్ చమురుపై ఉన్న ఆంక్షలను కూడా అమెరికా ఎత్తివేయడంతో, ఆ దేశ చమురును కూడా భారత రిఫైనరీలు కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది.

## ఎల్‌పీజీ రీఫిల్ నిబంధనల్లో మార్పులు లేవు..

**బుకింగ్‌పై వదంతులు నమ్మొద్దు: పెట్రోలియం శాఖ**



**న్యూఢిల్లీ:** ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ రీఫిల్ బుకింగ్ గడువును మార్చారంటూ వస్తున్న వార్తలను కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఇవి పూర్తిగా నిరాధారమైన, తప్పుదోవ పట్టించే కథనాలని స్పష్టం చేసింది. ఎల్‌పీజీ కనెక్షన్లకు సంబంధించి రీఫిల్ బుకింగ్ నిబంధనల్లో ఎలాంటి మార్పులు చేయలేదని కేంద్ర పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది.

కొన్ని మీడియా సంస్థలు, సోషల్ మీడియాలో ప్రధాన్ మంత్రి ఉజ్వల యోజన లబ్ధిదారులకు 45 రోజులు, ఇతరులకు 25 నుంచి 35 రోజుల గడువు విధించినట్టు ప్రచారం జరిగింది. ఈ వార్తల్లో ఏమాత్రం నిజం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనల ప్రకారమే రీఫిల్ బుకింగ్ ప్రక్రియ కొనసాగుతుందని వివరించింది. పట్టణ ప్రాంతాల్లో 25 రోజుల తర్వాత, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల తర్వాత వినియోగదారులు మరో సిలిండర్‌ను బుక్ చేసుకోవచ్చు.

ఇలాంటి తప్పుడు సమాచారాన్ని నమ్మవద్దని, అనవసరంగా ఆందోళనతో సిలిండర్లను బుక్ చేసుకోవద్దని ప్రజలకు ప్రభుత్వం సూచించింది. దేశవ్యాప్తంగా సరిపడా ఎల్‌పీజీ నిల్వలు ఉన్నాయని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చింది. దేశంలోని అన్ని రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయని, పెట్రోల్, డీజిల్ నిల్వలు కూడా పుష్కలంగా ఉన్నాయని పేర్కొంది. ఇదే సమయంలో పెట్రోల్, డీజిల్ కొరత ఉందన్న వదంతులను భారత్ పెట్రోలియం కార్పొరేషన్ కూడా ఖండించింది.

ఇరాన్ యుద్ధం కారణంగా ఆర్థిక వ్యవస్థపై పడే ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు చమురు, గ్యాస్, సరఫరా వ్యవస్థలపై దృష్టి సారించేందుకు కేంద్రం ఏడు ఉన్నతస్థాయి బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపింది.

## ఐపీఎల్ అభివృద్ధి అద్భుతం..



**ఎన్‌బీఏ, ప్రీమియర్ లీగ్‌లతో సమానం: సౌరవ్ గంగూలీ**

ముంబై: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) బ్రాండ్ విలువ ఆకాశాన్నంటుతోంది. తాజాగా రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీని ఏకంగా 1.63 బిలియన్ డాలర్లకు (సుమారు రూ. 15,286 కోట్లు) కొనుగోలు చేయడంపై భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ ఆశ్చర్యం, హర్షం వ్యక్తం చేశాడు. కేవలం రెండు, మూడు నెలలు జరిగే లీగ్‌కు ఈ స్థాయి విలువ రావడం అద్భుతమని ఆయన అభిప్రాయపడ్డారు. ఐపీఎల్ ఇప్పుడు ప్రపంచంలోని దిగ్గజ స్పోర్ట్స్ లీగ్‌లైన నేషనల్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ (ఎన్‌బీఏ), ఇంగ్లిష్ ప్రీమియర్ లీగ్ (ఈపీఎల్) సరసన నిలిచిందని ప్రశంసించాడు.

తాజాగా రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీని అమెరికాకు చెందిన పారిశ్రామికవేత్త కల్ సోమాని నేతృత్వంలోని కన్సార్టియం సొంతం చేసుకుంది. వాల్‌మార్ట్ కుటుంబానికి చెందిన రాబ్ వాల్టన్, ఫోర్డ్ మోటార్ కంపెనీలో భాగస్వాములైన హ్యాంప్ కుటుంబం ఈ కన్సార్టియంలో భాగస్వాములుగా ఉన్నారు. ఇదే క్రమంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ఫ్రాంచైజీని 1.78 బిలియన్ డాలర్లకు (సుమారు రూ. 16,000 కోట్లకు పైగా) అమ్ముడయింది.

ఈ పరిణామాలపై ఎన్డీటీవీ అడిగిన ప్రశ్నకు గంగూలీ స్పందిస్తూ... "2008లో ఐపీఎల్ ప్రారంభమైనప్పుడు ఆర్సీబీ, కేకేఆర్ మధ్య జరిగిన తొలి మ్యాచ్‌లో మొదటి బంతిని నేనే ఎదుర్కొన్నాను. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఐపీఎల్ ఎదిగిన తీరు అసాధారణం. ఇది భారత క్రికెట్ ఎంతగా విస్తరించిందో చూపిస్తోంది. అమెరికా నుంచి కొనుగోలుదారులు రావడం, ప్రపంచవ్యాప్తంగా భారత క్రికెట్‌పై ఆసక్తి పెరగడం గొప్ప విషయం" అని అన్నాడు.

"ప్రసార హక్కుల విషయంలో ఐపీఎల్ ప్రపంచంలోని ఏ లీగ్‌కు తీసిపోదు. కొన్నిసార్లు ఈపీఎల్ మ్యాచ్ కంటే ఐపీఎల్ మ్యాచ్ ప్రసార హక్కుల విలువే ఎక్కువగా ఉంటోంది. సంవత్సరంలో కేవలం రెండున్నర, మూడు నెలలు మాత్రమే ఆడే ఒక స్పోర్ట్స్ ఫ్రాంచైజీకి ఇంత భారీ మొత్తంలో విలువ ఉండటం ఊహకు అందని విషయం" అని గంగూలీ తెలిపాడు. ఈ రికార్డు స్థాయి ఒప్పందాలు ఐపీఎల్‌ను ప్రపంచ క్రీడా వేదికపై ఒక శక్తివంతమైన లీగ్‌గా నిలబెట్టాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## ప్రపంచకప్ విజయం తర్వాత.. సింగపూర్‌లో కుటుంబంతో ఎంజాయ్ చేస్తున్న కోచ్ గౌతమ్ గంభీర్





**న్యూఢిల్లీ:** టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ప్రస్తుతం కుటుంబంతో కలిసి సరదాగా గడుపుతున్నాడు. ఇటీవల ముగిసిన టీ20 ప్రపంచకప్ 2026లో భారత్‌కు చారిత్రక విజయాన్ని అందించిన తర్వాత గౌతీ విరామం తీసుకున్నాడు. సింగపూర్‌లో తన భార్య నటాషా, కుమార్తెలు అజీన్, అనైజాతో కలిసి వెకేషన్‌ను ఆస్వాదిస్తున్నాడు.

సింగపూర్ వీధుల్లో సాధారణ దుస్తుల్లో కనిపించిన గంభీర్, తన చిన్న కుమార్తెను భుజాలపై ఎక్కించుకుని నడుస్తూ కనిపించాడు.

2007లో టీ20 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టులో కీలక ఆటగాడిగా ఉన్న గంభీర్, ఇప్పుడు కోచ్‌గానూ కప్ సాధించి అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. రాహుల్ ద్రవిడ్, లాల్‌చంద్ రాజ్‌పుత్ తర్వాత ఈ ఘనత సాధించిన కోచ్‌గా నిలిచాడు. ఐపీఎల్ 2024లో కోల్‌కతా నైట్ రైడర్స్‌ను ఛాంపియన్‌గా నిలిపిన తర్వాతే గౌతీ భారత జట్టు హెడ్ కోచ్‌గా నియమితులయ్యాడు.

ఇక, టీమిండియా తదుపరి సిరీస్ జూన్‌లో ఆఫ్ఘనిస్థాన్‌తో జరగనుంది. ఈ పర్యటనలో ఒక టెస్ట్, మూడు వన్డేలు ఆడనుంది. ఆ తర్వాత ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలకు వెళ్లనుంది.

## నల్లగా ఉన్నందుకు నన్ను కాలియా అని అవమానించారు : మాజీ క్రికెటర్



**న్యూఢిల్లీ:** భారత క్రికెట్‌లో ఒకప్పుడు అత్యంత ప్రతిభావంతులైన ఆటగాళ్లలో ఒకరిగా పేరుగాంచిన లెగ్ స్పిన్నర్ లక్ష్మణ్ శివరామకృష్ణన్ తన కెరీర్‌ను ప్రభావితం చేసిన కొన్ని చేదు అనుభవాలను పంచుకున్నారు. తనపై జరిగిన వర్ణ వివక్ష, జాత్యహంకార వ్యాఖ్యలు తనను మానసికంగా ఎంతగా కుంగదీశాయో తాజాగా తెలియజేశారు. ఓ జాతీయ దినపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ సంచలన విషయాలను వెల్లడించారు.

స్టేడియంలో టీమిండియాకు నెట్ బౌలర్‌గా వెళ్లినప్పుడు.. స్కూల్ యూనిఫాంలో ఉన్న తనను ఓ సీనియర్ భారత బ్యాటర్ గదిలోకి పిలిచారని శివరామకృష్ణన్ తెలిపారు. గ్రౌండ్ సిబ్బందిలో ఒకడిగా భావించి, తన బూట్లు శుభ్రం చేయమని ఆ ఆటగాడు ఆదేశించాడని చెప్పారు. ఆ మాటకు నిశ్చేష్టుడైన తాను.. 'అది నా పని కాదు, మీ పని మీరు చూసుకోండి' అని బదులిచ్చినట్లు తెలిపాడు.

అప్పుడు జాతి వివక్ష అంటే ఏమిటో తెలియకపోయినా ఆ ఆటగాడి ప్రవర్తన తనను తీవ్రంగా బాధించిందని ఎల్ శివరామకృష్ణన్ అన్నారు. ఇలాంటి అవమానాలు తన కెరీర్‌లో చాలాసార్లు ఎదురయ్యాయని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. తమిళనాడు జట్టులో ఆడుతున్నప్పుడు కొందరు ప్రముఖ ఆటగాళ్లు తనను 'కరుపా (నల్లటి వాడు)' అని పిలిచేవారని చెప్పాడు. ముంబై, చండీగఢ్, జలంధర్ వంటి నగరాల్లో బౌండరీ లైన్ వద్ద ఫీల్డింగ్ చేస్తున్నప్పుడు, ప్రేక్షకులు 'కాలియా, తేరా క్యా హోగా (నల్లోడా, నీ గతేంటి)' అంటూ ఎగతాళి చేసేవారని గుర్తుచేసుకున్నాడు.

తన 17వ పుట్టినరోజున జరిగిన మరో ఘటన తనకు కన్నీళ్లు తెప్పించిందని శివరామకృష్ణన్ తెలిపారు. ఆ రోజు తన కోసం తెచ్చిన చాక్లెట్ కేక్‌ను చూపిస్తూ ఓ సీనియర్ ఆటగాడు.. 'హే సన్నీ.. నువ్వు సరైన రంగు కేకే ఆర్డర్ చేశావ్. ఇంత నల్లటి అబ్బాయికి ఇలాంటి డార్క్ చాక్లెట్ కేకే కరెక్ట్' అని ఎగతాళిగా అన్నాడని గుర్తుచేశారు. ఆ మాటలతో తాను ఏడుస్తూ కేక్ కట్ చేయడానికి నిరాకరించానని, అప్పుడు దిగ్గజ ఆటగాడు సునీల్ గవాస్కర్ తనను ఓదార్చడంతో కన్నీళ్లతోనే కేక్ కట్ చేశానని ఆనాటి బాధను పంచుకున్నాడు.

ఈ ఘటనలన్నీ తన మనసుపై చెరగని ముద్ర వేశాయని శివరామకృష్ణన్ అన్నారు. తన కెరీర్ ఆశించిన స్థాయిలో సాగకపోవడానికి ఇవి కూడా కారణమయ్యాయని ఆయన భావిస్తున్నట్లు తెలుస్తోంది.

## ఆర్సీబీ ఛైర్మన్‌గా మాజీ క్రికెటర్..

**ఎవరీ ఆర్యమన్ బిర్లా?**

**ముంబై:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రముఖ ఫ్రాంచైజీ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) యాజమాన్యం చేతులు మారింది. ఆదిత్య బిర్లా గ్రూప్ నేతృత్వంలోని కన్సార్టియం.. ఆర్సీబీని రూ.16,000 కోట్లకు పైగా (1.78 బిలియన్ డాలర్లు) భారీ మొత్తానికి కొనుగోలు చేసింది. ఈ డీల్ అనంతరం ఫ్రాంచైజీకి కొత్త ఛైర్మన్‌గా ఆదిత్య బిర్లా గ్రూప్ అధినేత కుమార్ మంగళం బిర్లా కుమారుడు ఆర్యమన్ బిర్లా బాధ్యతలు చేపట్టనున్నారు.

ఈ కన్సార్టియంలో ఆదిత్య బిర్లా గ్రూప్‌తో పాటు టైమ్స్ ఆఫ్ ఇండియా గ్రూప్, డేవిడ్ బ్లిట్జర్ నేతృత్వంలోని బోల్ట్ వెంచర్స్, అమెరికాకు చెందిన బ్లాక్‌స్టోన్ ఇన్వెస్ట్‌మెంట్ గ్రూప్ భాగస్వాములుగా ఉన్నాయి. ఇప్పటివరకు యూకేకు చెందిన డయాజియో పీఎల్‌సీ అనుబంధ సంస్థ అయిన యునైటెడ్ స్పిరిట్స్ లిమిటెడ్ (యూఎస్ఎల్) చేతిలో ఉన్న ఆర్సీబీ 100 శాతం వాటాను ఈ బృందం సొంతం చేసుకుంది. ఈ ఒప్పందంలో పురుషుల జట్టుతో పాటు మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) ఆడుతున్న మహిళల జట్టు కూడా వుంది.

ఎవరీ ఆర్యమన్ బిర్లా?

ఫ్రాంచైజీకి కొత్త బాస్‌గా రానున్న 28 ఏళ్ల ఆర్యమన్ బిర్లా గురించి ప్రస్తుతం ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఆయన కేవలం ఒక పారిశ్రామికవేత్త మాత్రమే కాదు, మాజీ క్రికెటర్ కూడా. మధ్యప్రదేశ్ తరఫున దేశవాళీ క్రికెట్‌లో సత్తా చాటారు.



ఎడమచేతి వాటం బ్యాటర్ అయిన ఆర్యమన్.. 9 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడి 414 పరుగులు చేశారు. ఇందులో కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో బెంగాల్‌పై సాధించిన సెంచరీ కూడా ఉంది. ప్రస్తుత ఆర్సీబీ కెప్టెన్ రజత్ పాటిదార్, స్టార్ ఆల్‌రౌండర్ వెంకటేశ్ అయ్యర్‌తో కలిసి ఆయన డ్రెస్సింగ్ రూమ్ పంచుకున్నారు.

2018 ఐపీఎల్ మెగా వేలంలో రాజస్థాన్ రాయల్స్ జట్టు ఆర్యమన్‌ను రూ.30 లక్షలకు కొనుగోలు చేసింది. అయితే, ఆ ఫ్రాంచైజీ తరఫున ఒక్క మ్యాచ్ కూడా ఆడే అవకాశం రాలేదు. 2020 సీజన్‌కు ముందు ఆయన్ను జట్టు నుంచి విడుదల చేశారు. సరిగ్గా అదే సమయంలో 'తీవ్రమైన ఆందోళన' కారణంగా క్రికెట్‌కు తాత్కాలిక విరామం (సెబాటికల్) తీసుకుంటున్నట్లు ఆర్యమన్ ప్రకటించారు. "మానసిక ఆరోగ్యం, శ్రేయస్సుకు అన్నింటికంటే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని భావిస్తున్నాను" అని ఆయన అప్పట్లో సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఆటకు దూరమైన తర్వాత కార్పొరేట్ రంగంలోకి అడుగుపెట్టిన ఆర్యమన్, ప్రస్తుతం ఆదిత్య బిర్లా మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌లో డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు.

ఈ కొనుగోలుపై ఆర్యమన్ బిర్లా స్పందిస్తూ... "ఆర్సీబీ తదుపరి వృద్ధి దశను నిర్మించడానికి ఈ భాగస్వామ్యంలో భాగం కావడం ఒక గౌరవంగా భావిస్తున్నాను. క్రీడలు, మీడియా, వినియోగదారుల వ్యాపారాలపై లోతైన అవగాహన ఉన్న బృందం మాది" అని తెలిపారు.



# దుల్కర్ సల్మాన్ గురించి ఆసక్తికర విషయాన్ని వెల్లడించిన శృతి హాసన్

**టాకీస్:** వెండితెరపై స్టార్ కిడ్స్‌గా అడుగుపెట్టిన శృతి హాసన్, దుల్కర్ సల్మాన్ తమకంటూ మంచి గుర్తింపును తెచ్చుకున్నారు. మరోవైపు, వీరి మధ్య చిన్నప్పటి నుంచే ఒక వింతైన స్నేహం ఉందన్న విషయం తాజాగా బయటపడింది. వీరిద్దరూ చెన్నైలోని ఒకే పాఠశాలలో కలిసి చదువుకున్నారన్న వార్త అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న శృతి... దుల్కర్‌తో తనకున్న స్పెషల్ మెమొరీస్‌ను పంచుకున్నారు.

తామిద్దరూ చెన్నైలోని రెండు వేర్వేరు ప్రముఖ పాఠశాలల్లో క్లాస్‌మేట్స్‌గా ఉన్నామని, స్టార్ కిడ్స్ అనే ఫీలింగ్ లేకుండా చాలా సాధారణంగా పెరిగామని శృతి చెప్పుకొచ్చారు. స్కూల్లో ఉన్నప్పుడు దుల్కర్ తనను 'సోంబి' అని పిలిచి ఆటపట్టించేవాడట. దానికి కారణం.. అప్పట్లో స్కూల్ ఫంక్షన్‌లో శృతి 'సోంబి' అనే పాటను పాడటమే. ఆ పాట విన్నప్పటి నుంచి దుల్కర్‌కు ఆమె పేరు 'సోంబి' అయిపోయింది.

ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే, స్కూల్లో ఉన్న చాలామంది పిల్లలకు ఆమె పేరు శృతి అని కూడా తెలియదట. కేవలం 'కమల్ హాసన్ కూతురు' అని మాత్రమే గుర్తుంచుకునేవారని నవ్వుతూ గుర్తు చేసుకున్నారు.

చిన్నప్పుడు క్లాస్‌మేట్స్‌గా అల్లరి చేసిన ఈ ఇద్దరూ, ఇప్పుడు పవన్ సాదినేని దర్శకత్వంలో రాబోతున్న 'ఆకాశంలో ఒక తార' చిత్రంలో కలిసి నటించబోతున్నారు. గీతా ఆర్ట్స్, స్వప్న సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ ప్రాజెక్టుపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. దుల్కర్ సల్మాన్ సరసన శృతి హాసన్ ఒక పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనుందని సమాచారం.

## పెద్ది షూటింగ్‌లో రామ్‌చరణ్‌కు స్వల్ప గాయం

### భయమేమీ లేదని వెల్లడించిన చిత్రబృందం

### త్వరగా కోరుకోవాలని పవన్ ఆకాంక్ష

**టాకీస్:** మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం బుచ్చిబాబు సానా దర్శకత్వంలో 'పెద్ది' చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఏప్రిల్ 30న ఈ చిత్రం విడుదల కానుండగా.. వీలైనంత త్వరగా షూటింగ్ ఫినిష్ చేసేలా దూసుకుపోతోంది చిత్ర యూనిట్. ప్రజెంట్ హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతోంది. అయితే, ఈ చిత్రానికి సంబంధించిన ఒక కీలకమైన యాక్షన్ సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్న సమయంలో రామ్ చరణ్‌కు గాయం అయినట్టుగా తెలుస్తోంది. ఆయన కంటి సమీపంలో స్వల్ప గాయం అయిందని సమాచారం. ఈ వార్త తెలియగానే అభిమానులు కాస్త ఆందోళన చెందినప్పటికీ, ఇది చాలా చిన్న గాయమని, అభిమానులు భయపడాల్సిన అవసరం లేదని చిత్ర యూనిట్ వర్గాలు తెలిపాయి. అయితే, కంటికి సంబంధించిన గాయం కావడంతో జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచించారు. అలాగే.. రెండు రోజుల పాటు పూర్తి విశ్రాంతి అవసరమని డాక్టర్లు సలహా ఇచ్చారు. దీంతో.. రెండు రోజుల రెస్ట్ తర్వాత తిరిగి రామ్ చరణ్ పెద్ది సెట్స్‌లో జాయిన్ అవనున్నారు. ఈ షెడ్యూల్ అయిపోయిన తర్వాత.. తదుపరి షెడ్యూల్‌లో ఒక స్పెషల్ సాంగ్ చిత్రీకరణలో పాల్గొననున్నారు. ఇక్కడితో షూటింగ్ దాదాపుగా కంప్లీట్ అయినట్టే. మరోవైపు, ఈ శుక్రవారం మార్చి



27న రామ్ చరణ్ పుట్టినరోజు కావడంతో మెగా సెలబ్రేషన్స్‌కు సిద్ధమవుతున్నారు అభిమానులు. ఆరోజు పెద్ది టీజర్ లేదా గ్లింప్స్ విడుదలయ్యే అవకాశం ఉంది. ఇలాంటి సమయంలో చరణ్‌కు గాయం అనే వార్త మెగాభిమానులను కాస్త టెన్షన్‌కు గురి చేసినట్టైంది. తమ అభిమాన హీరో త్వరగా కోలుకోవాలని సోషల్ మీడియా వేదికగా కోరుకుంటున్నారు అభిమానులు. ఈ క్రమంలోనే తాజాగా రామ్ చరణ్ గాయం మీద పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, స్పందించారు. ఈ మేరకు మీడియాకు సమాచారం అందించారు. త్వరగా రామ్ చరణ్ కోలుకోవాలని పవన్ కళ్యాణ్ ఆకాంక్షిస్తున్నట్లుగా పవన్ కళ్యాణ్ టీం ఒక మెసేజ్ షేర్ చేసింది. అయితే ఇప్పటివరకు రామ్ చరణ్ కి గాయాలు అయినట్లుగా 'పెద్ది' టీం కానీ, రామ్ చరణ్ టీం కానీ ప్రకటించలేదు. కానీ పవన్ కళ్యాణ్ స్పందించడంతో, ఈ వార్త కన్ఫామ్ అయినట్లయింది.

## ధురంధర్-2 కలెక్షన్ల సునామీ



**టాకీస్:** బాలీవుడ్ స్టార్ రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో, ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కిన యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్: ది రివెంజ్' బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని నమోదు చేస్తోంది. విడుదలైన తొలి రోజు నుంచే ఈ సినిమా కలెక్షన్ల సునామీ సృష్టిస్తూ, రికార్డులను తిరగరాస్తోంది. ట్రేడ్ వర్గాల లెక్కల ప్రకారం, కేవలం ఆరు రోజుల్లోనే ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ. 919 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించడం విశేషం. ఇందులో ఇండియాలోనే రూ. 695 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్లు నమోదు చేయడం సినిమా దూకుడుకు నిదర్శనం.

వీక్‌డేస్‌లో కూడా కలెక్షన్లు ఏ మాత్రం తగ్గడం లేదు. ఐదో రోజు రూ. 65 కోట్లు, ఆరవ రోజు రూ. 56 కోట్లకు పైగా నెట్ కలెక్షన్లు రాబట్టింది. ఇక ఓవర్సీస్ మార్కెట్‌లో కూడా 'ధురంధర్ 2' దూసుకుపోతోంది. ఇప్పటికే రూ. 200 కోట్ల మార్క్‌ను దాటేసి, గ్లోబల్ స్థాయిలో భారీ వసూళ్లను అందుకుంటోంది.

ఈ వేగాన్ని చూస్తుంటే, కేవలం వారం రోజుల్లోనే రూ. 1000 కోట్ల క్లబ్‌లో చేరడం ఖాయం అని సినీ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అదే జరిగితే అత్యధిక వేగంగా వారం రోజుల్లోనే వెయ్యి కోట్లు రాబట్టిన చిత్రంగా సరికొత్త రికార్డ్ క్రియేట్ చేయనుంది ధురంధర్ 2. సుమారు నాలుగు గంటల భారీ రన్‌టైమ్ ఉన్నప్పటికీ, ప్రేక్షకులు ఈ సినిమాను ఆదరించడం విశేషం. మొదటి భాగం సుమారు రూ. 1400 కోట్ల వసూళ్లు సాధించిన నేపథ్యంలో, 'ధురంధర్ 2' రూ. 2000 కోట్ల మార్క్‌ను అందుకునే అవకాశముందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. బాలీవుడ్‌లో హిట్ సినిమాలకు లాంగ్ రన్ ఉండటం ఈ అంచనాలకు బలం ఇస్తోంది. ఈ చిత్రంలో రణ్‌వీర్ సింగ్ తన పవర్‌ఫుల్ యాక్షన్‌తో ప్రేక్షకులను ఆకట్టుకోగా, అర్జున్ రాంపాల్, సంజయ్ దత్, ఆర్. మాధవన్ వంటి స్టార్ నటులు కీలక పాత్రల్లో మెప్పించారు. మొత్తానికి 'ధురంధర్ 2' భారతీయ సినీ చరిత్రలో కొత్త రికార్డులను సృష్టించే దిశగా దూసుకెళ్తోంది.

## హైదరాబాద్‌లో వారణాసి నిర్మాణం

### రాజమౌళి మూవీ కోసం భారీ సెట్టింగ్

**టాకీస్:** రాజమౌళి అంటేనే ప్రతి విషయంలోనూ ఎంత అదనపు శ్రద్ధ తీసుకుంటారో తెలిసిందే. ఇక సెట్స్‌పై ఆయన విజన్ మరింత ప్రత్యేకం. తాజాగా వైరలవుతోన్న వారణాసి సెట్ ఇమేజ్‌లు మరోసారి జక్కన్న పనితీరును చాటిచెబుతున్నాయి. రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా రానున్న చిత్రం 'వారణాసి'. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీప్రియులు దీనికోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. దీంతో దీనికి సంబంధించిన చిన్న అప్‌డేట్ కూడా క్షణాల్లో వైరల్ అవుతోంది. తాజాగా ఈ సినిమా కోసం వేస్తోన్న సెట్ ఇమేజ్‌లు వైరల్‌గా మారాయి. ఈ సినిమా కాశీ నేపథ్యంలో సాగే విషయమని తెలిసిందే.



దీంతో కాశీ నగరాన్ని తలపించేలా సెట్‌ను నిర్మిస్తున్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని పురాతన నగరం వారణాసిని అచ్చుగుద్దినట్లు చూపించేలా దాదాపు 700 మీ 400 అడుగుల విస్తీర్ణంలో ఈ భారీ సెట్‌ను నిర్మించారు. వారణాసిలోని ప్రతి వీధి, ప్రతి కట్టడాన్ని తలపించేలా దీన్ని రూపొందిస్తున్నారు. వేల సంఖ్యలో రిఫరెన్స్ చిత్రాలను, కచ్చితమైన కొలతలను వాడినట్లు చిత్ర బృందం పేర్కొంది. ఇక ఈ సెట్‌లో రత్నేశ్వర్ మహాదేవ్ ఆలయం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందట. దీని గోపురం వంపు తిరిగి ఉంటుందని ఈ సెట్‌లో ఆ ఆలయాన్ని కూడా అదే కోణంలో, అదే ఎత్తులో రూపొందిస్తున్నట్లు సమాచారం. నిర్మాణ సమయంలో ఏ చిన్న అలంకరణను, శిల్పకళలను మిస్ కాకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా కథ త్రేతాయుగం నుంచి 2027 వరకూ సాగనున్నట్లు తెలుస్తోంది. దీనికి అనుగుణంగా వారణాసి నగరం కాలక్రమేణా ఎలా మారిందో చూపించడానికి సెట్‌లో ప్రత్యేక మార్పులు చేస్తున్నారు. అప్పటి కట్టడాల నంచి నేటి ఆధునిక కాలం వరకు ప్రతీది ప్రత్యేక శ్రద్ధతో నిర్మిస్తున్నట్లు తాజాగా టీమ్ పంచుకున్న ఫొటోలు చూస్తే అర్థమవుతుంది. వారణాసిలోని గంగా నది తీరం, అక్కడి పురాతన కట్టడాలను తలపించేలా హైదరాబాద్‌లో ఒక భారీ సెట్‌ను రాజమౌళి నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది. రాజమౌళి తన సినిమాల్లో లొకేషన్లకు ఇచ్చే ప్రాధాన్యత గురించి అందరికీ తెలిసిందే. ఈ సినిమాలో ఒక కీలకమైన సన్నివేశం వారణాసి నేపథ్యంలో

## ఇన్‌స్టాలోకి అన్నా కొణిదెల



**టాకీస్:** పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ భార్య అన్నా లెజినోవా ఇప్పుడు సోషల్ మీడియాలోకి అడుగుపెట్టి 'అన్నా కొణిదెల'గా మారింది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె ఖాతా ప్రారంభించగానే అభిమానుల నుంచి భారీ స్పందన లభిస్తోంది. ముఖ్యంగా ఆమె తొలి పోస్టు నెటిజన్లను ఆకట్టుకుంటు న్నాయి. మొదటి పోస్ట్ సాధారణ పరిచయంకి సంబంధించింది కాగా , రెండో పోస్టులో భర్త పవన్ కళ్యాణ్‌తో కలిసి ఉన్న ఫోటోను షేర్ చేయడం ప్రత్యేకతను సంతరించుకుంది. తన బయోలో ' రష్యన్ హార్ట్ , ఇండియన్ సోల్ అని పేర్కొనడం ద్వారా తన వ్యక్తిత్వాన్ని అందంగా వ్యక్తపరిచారు అన్నా లెజినోవా. రష్యాలో జన్మించిన ఆమె, భారతీయ కుటుంబంలోకి కోడలిగా చేరిన తర్వాత రెండు సంస్కృతుల సమ్మేళనంగా జీవిస్తున్నానని తెలియజేసింది. అలాగే ప్రేమ, కృతజ్ఞతలతో జీవిస్తూ నిరంతరం నేర్చుకుంటూనే ఉంటానని కూడా తన ప్రొఫైల్‌లో తెలియజేశారు. ఇన్‌స్టాగ్రా మ్ ఎంట్రీ సందర్భంగా షేర్ చేసిన పోస్టులో, చాలా కాలంగా సోషల్ మీడియాలోకి రావాలని అనుకున్నానని, ఇప్పుడు సరైన సమయం అనిపించిందని తెలిపారు. చిరంజీవి ఆశీస్సులు, పవన్ కళ్యాణ్ మద్దతుతో ఈ కొత్త ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నానని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, ఆమె ఖాతా ప్రారంభించిన కొద్ది గంటల్లోనే ఫాలోవర్స్ సంఖ్య లక్ష దాటడం విశేషం. అన్నా కొణిదెల ఇన్‌స్టాలోకి ఎంట్రీ ఇవ్వడంతో పవన్ కళ్యాణ్ తన భార్యకు స్వాగతం పలుకుతూ ఒక పోస్ట్ చేశాడు.

## సర్కే చునార్ తేరీ సర్కేలో అశ్లీలం తెలియదు

### దర్శకుడు ప్రేమ్ స్పందన

**టాకీస్:** ప్రేమ్ దర్శకత్వంలో రాబోతున్న 'కేడీ: ది డెవిల్' సినిమాలోని 'సర్కే చునార్ తేరీ సర్కే' పాట వివాదాస్పదమైన విషయం తెలిసిందే.అన్ని వేదికల్లోనూ ఈ పాటను తొలగించేలా చర్యలు తీసుకోవాలని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) అధికారులను ఆదేశించింది. తాజాగా ఈ పాట వివాదంపై దర్శకుడు ప్రేమ్ స్పందించారు. తనకు కూడా ఆ హిందీ పాట లిరిక్స్ అర్థం తెలియదని అన్నారు. 'ఈ పాట ఐదు భాషల్లో విడుదలైంది. కన్నడలో లిరిక్స్ నేను రాశా. హిందీపై నాకు పట్టులేదు. అందుకే వాటి అర్థం తెలియదు. ప్రస్తుతం దేశంలో ఎన్నో సమస్యలు ఉన్నాయి. ఒకవైపు యుద్ధం, మరోవైపు గ్యాస్ కొరత.. ఇలాంటి వాటి గురించి చర్చించుకుందాం. అంతేగానీ, ఈ పాట లిరిక్స్‌ను వివాదం చేయాల్సిన అవసరం లేదు' అని అన్నారు. ఇక ఉద్దేశపూర్వకంగానే దీన్ని వివాదం చేస్తున్నారంటూ వస్తోన్న వార్తలను ప్రేమ్ ఖండించారు. తాను వివాదాలకు దూరంగా ఉంటానన్నారు. ఇది ఎమోషనల్ మూవీ అని.. ఇందులో ఆ పాట కేవలం పార్టీలో భాగంగా సరదాగా ఉంటుందని చెప్పారు. ఇటీవల ఈ అంశంపై ప్రేమ్ భార్య రక్షిత కూడా స్పందించిన విషయం తెలిసిందే. గతంలో 'పీలింగ్స్', 'డ్రీమమ్ వేకపమ్', 'చోళీ కే పీచే' వంటి వందలాది పాటలు వచ్చినప్పుడు అందరికీ అవి సాధారణంగానే అనిపించాయని.. ఇప్పడెందుకు ఈ పాట విషయంలో ఇలా చేస్తున్నారని అసహనం వ్యక్తంచేశారు. ధ్రువ్ సర్జా కథానాయకుడిగా నటించిన ఈ మూవీలో నోరా ఫతేహి, సంజయ్‌దత్ కీలక పాత్రలు పోషించారు.



Printed published and own by him Dr. kongarapu Ganapathi, Phone number: 9494451230, D.No 1/164 Balanki street, paalakonda-532440.
Officeaddress D-NO: 8-33-13, Near Kalabarathi opp com office, pithapuram colony, Maddilapalem visakhapatnam-530003. RNI:APTEL 2013/54721.
Editor in Chief: Danuri Srinivas - 9441500341